# ముద్ర

సమగ్ర సమాచార పత్రిక

www.mudranews.in

హైదరాబాద్
ఆదివారం, 22.02.2026

www.mudranews.in | @mudranews

సంపుటి:13 సంచిక: 122
పేజీలు: 12 వెల: రూ. 5


## ఎస్ఎల్ బీసీ పునరుద్ధరణ ఎన్నడో?



- నల్లగొండ జిల్లాకు సాగు, తాగునీరు అందించే భారీ ప్రాజెక్ట్ –ఎస్ఎల్‌బీసీ
- 2005లో ప్రారంభమైన సొరంగ పనులు 2010లో పూర్తవాల్సి ఉండగా ఇంకా సాగుతున్నాయి

రెండు దశాబ్దాల నిరీక్షణ.. రెండు దశాబ్దాల అశ్రద్ధ! నల్లగొండ జిల్లా సాగు, తాగునీటి కలను సాకారం చేయాల్సిన శ్రీశైలం ఎడమ గట్టు కాలువ (SLBC) సొరంగం పనులు నేటికీ అసంపూర్ణమే. 2005లో మొదలైన ఈ బృహత్తర ప్రాజెక్టు గతేడాది జరిగిన ఘోర ప్రమాదంతో మరింత సంభించిపోయింది. సీఎం రేవంత్ రెడ్డి "రెండేళ్లలో పూర్తి చేస్తాం" అని ప్రకటించిన తరుణంలో, బురదలో కూరుకుపోయిన టీబీఎం మిషన్‌కు ఎప్పుడు మోక్షం కలుగుతుందో.. పనులు ఎప్పుడు పట్టాలెక్కుతాయోనని ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాల ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

10

-ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి :

## వ్యతిరేకత ఏంటో నాకు తెలుసు
### సీఎం రేవంత్ రెడ్డి



- పీసీసీ చీఫ్‌గా నేనూ ఎదుర్కొన్నా
- పార్టీలో మెరిట్ లిస్ట్ ఒక్కటే
- ఎవరైనా అభిప్రాయాలు చెప్పుకోవచ్చు
- కాంగ్రెస్‌ను విచ్ఛిన్నం చేసే కుట్ర
- అందరినీ కలుపుకుపోవడమే అసలైన విజయం

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

కాంగ్రెస్ పార్టీలో భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ.. వారిపై వేధింపులు చేసే పరిస్థితి ఉండదని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. తాను పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో పార్టీలో కొంత మంది నుంచి వ్యతిరేకతను ఎదుర్కొన్నట్లు గుర్తు చేసుకున్నారు. అందరినీ సమన్వయంతో కలుపుకుంటూ పోయి.. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో ఏ లిస్టులూ ఉండవని తెలిపిన రేవంత్.. కేవలం మెరిట్ లిస్ట్ ఉంటుందని వెల్లడించారు. వికారాబాద్ జిల్లా అనంతగిరిలో డీసీసీ అధ్యక్షులకు నిర్వహించిన ప్రత్యేక శిక్షణ మిగతా 10లో



## ట్రెండ్ సెట్టర్‌గా అడ్లూరి

### నాటి బీఆర్ఎస్ కోట.. నేడు కాంగ్రెస్ విశ్వాస కోట

- మున్సిపాల్ ఎన్నికల్లో అడ్లూరి సంచలనం
- 15 స్థానాలకు 15 గెలిచి రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు
- రాష్ట్ర రాజకీయాల్లో ప్రత్యేక ఆకర్షణగా మంత్రి అడ్లూరి
- అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా

02

# విస్తరణ వివాదం

### మళ్లీ కేబినెట్‌లో కొత్త లొల్లి

### సీఎం రేవంత్ నిర్ణయమే ఫైనల్?

- అసలు వ్యూహం ఏంటి
- మరోవైపు అజారుద్దీన్‌కు పదవీ గండం
- ఇప్పటికే ఖరారు కాని ఎమ్మెల్సీ
- ఎమ్మెల్సీగా ఒకరిని రాజీనామా చేయించే ప్లాన్
- ఎమ్మెల్సీగా రాజీనామా చేస్తే రాజ్యసభ సీటు ఆఫర్



**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

రాష్ట్ర క్యాబినెట్ విస్తరణ ప్రతిసారీ ఏదో ఒక వివాదంగా మారుతూనే ఉంది. పార్టీలో ఎవరో ఒకరి రూపంలో చిచ్చు రగులుతూనే ఉంది. నిజానికి, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనదైన శైలిలో పాలన సాగిస్తున్నారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాల తర్వాత పార్టీ అధిష్టానం వద్ద ఆయన పరపతి గతంతో పోలిస్తే గణనీయంగా పెరిగింది. వరుస విజయాలు తెలంగాణ కాంగ్రెస్‌లో రేవంత్ రెడ్డి మాటకు తిరుగులేని పరిస్థితి కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో రేవంత్ కు రెండు అంశాలు కీలకంగా మారాయి. ఒకటి మంత్రివర్గ విస్తరణ అయితే.. ఇప్పుడు మంత్రి అజారుద్దీన్ వ్యవహారం మరో వివాదంగా మారుతోంది.

**ఆచి తూచి అడుగులు**

మంత్రివర్గంలో ఖాళీగా ఉన్న స్థానాలతో పాటు పని చేయని వారిని తీసేసి కొత్త వారితో భర్తీ చేయాలన్న చర్చ కొంత కాలంగా జరుగుతోంది. అయితే ఇప్పుడున్న మంత్రులను కదిలించడం, కొత్తవారిని తీసుకోవడం వల్ల అంతర్గత విభేదాలు తలెత్తే ప్రమాదం ఉందని రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న టీమ్ తోనే సమన్వయం చేసుకుంటూ వెళ్లడం మేలని ఆయన ఆలోచనగా తెలుస్తోంది. అనవసరంగా కేబినెట్ ప్రక్షాళన చేసి అసంతృప్తికి తావివ్వడం కంటే పాలనపై దృష్టి పెట్టడమే ఉత్తమమని ముఖ్యమంత్రి భావిస్తున్నట్లు సమాచారం. కానీ ఆయనపై ఒత్తిడి పెరుగుతోంది. ఆశావహులు పలువురు తమ ప్రయత్నాలను ఢిల్లీ స్థాయి నుంచి చేసుకుంటున్నారు. మిగతా 02లో

## కులగణన డబ్బుల మాటేంటి?

### ఏడాది గడిచినా చెల్లింపులు లేక బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థుల ఆవేదన




- 1.90 లక్షల డేటా ఎంట్రీకి వేతనం ఎక్కడ?
- ప్రతి ఎంట్రీకి రూ.30 వాగ్దానం.. అమలు ఎప్పుడూ?
- 1600 మంది ట్రిపుల్ ఐటీ విద్యార్థుల శ్రమ వృథా?
- ప్రభుత్వ హామీలపై నిలిచిన సందేహాలు

09

## తెలంగాణకు 3 లక్షల ఇండ్లు ఇవ్వండి

### కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కోరిన మంత్రి పొంగులేటి



- పీఎం ఆవాస్ యోజన కింద భారీ కేటాయింపులు చేయాలన్న విజ్ఞప్తి
- గత 12 ఏళ్లలో గ్రామీణ పేదలకు ఇళ్లు లేకపోయినట్లు ఆవేదన
- ఇప్పటికే 4 లక్షల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామన్న రాష్ట్రం
- మొత్తం 11.57 లక్షల అర్హుల గుర్తింపు.. తక్షణం సహకారం కోరిన ప్రభుత్వం

03

## 1100 ఫైళ్లు బూడిద

### నాంపల్లి ఎఫ్ఎస్ఎల్ అగ్నిప్రమాదం

- 50 కంప్యూటర్లు, కీలక హార్డ్‌డిస్కులు అగ్నికి ఆహుతి
- తీవ్ర నేరాల సాంకేతిక ఆధారాలు పూర్తిగా నాశనం
- ఫైళ్లలో ఏముందో స్పష్టత కోసం ఎదురుచూపులు




- 'ఫోన్ ట్యాపింగ్' కేసు శాస్త్రీయ సాక్ష్యాలు కూడా దగ్ధం
- నాగ్‌పూర్ స్పెషల్ టీమ్ రిపోర్ట్‌లో సంచలన వివరాలు
- దగ్ధమైన డేటాను రికవర్ చేయడం అసాధ్యం అని తేల్చి చెప్పిన నిపుణులు

03

## 'గృహలక్ష్మి'కి గుడ్ న్యూస్

### పేదల సొంతింటి కల సాకారం

- గృహలక్ష్మి లబ్ధిదారులకు ఊరట
- ఇందిరమ్మ ఇళ్లకు బదలాయింపు
- రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం
- పెండింగ్ బిల్లులు చెల్లింపు
- ప్రభుత్వం నిర్ణయం.. మార్గదర్శకాలు

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

గృహలక్ష్మి పథకం కింద గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కొందరు పేదలు ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఆ ఇళ్ల నిర్మాణాలు ఆగిపోగా.. వాటికి ఇందిరమ్మ ఇళ్ల పథకం వర్తింపజేయాలని రేవంత్ సర్కార్ నిర్ణయం తీసుకుంది. తాజాగా.. బిల్లుల చెల్లింపుపై మార్గదర్శకాలు విడుదల చేసింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పేదల సొంతింటి కలను మిగతా 02లో




## హైదరాబాద్ మెట్రో టేకోవర్‌కు గ్రీన్ సిగ్నల్

### కేబినెట్ ముందుకు తుది రిపోర్ట్



- తుది దశలో మెట్రో స్వాధీనం ప్రక్రియ
- ఐడీబీఐ ఫైనాన్స్ రిపోర్ట్ సిద్ధం – నిర్ణయానికి రంగం సిద్ధం
- మార్చి 31లోపు టేకోవర్ పూర్తి చేయాలన్న ప్రభుత్వ లక్ష్యం
- రెండో దశకు కేంద్ర గ్రీన్ సిగ్నల్ –కమిటీ ఏర్పాటుకు పిలుపు
- రూ.19,579 కోట్లతో మెట్రో ఫేజ్-II విస్తరణ ప్రణాళిక

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

మెట్రో ప్రాజెక్టు టేకోవర్ ప్రక్రియపై కసరత్తు స్పీడ్ అయింది. హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టును తెలంగాణ ప్రభుత్వం టేకోవర్‌పై కీలక అడుగు వేస్తోంది. హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టును ప్రభుత్వం తన ఆధీనంలోకి తీసుకునే ప్రక్రియ తుది దశకు చేరుకుంది. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా, అంటే మార్చి 31 నాటికి ఈ ప్రక్రియ మొత్తాన్ని పూర్తి చేయాలని తెలంగాణ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా ఇప్పటికే ఫైనాన్స్, టెక్నికల్ స్టడీ రిపోర్టులు సిద్ధమయ్యాయి. హైదరాబాద్ మెట్రో టేకోవర్‌కు సంబంధించి సాంకేతిక సలహాదారుగా డీఎంఆర్సీ వ్యవహరిస్తుండగా ఆర్థిక, న్యాయపరమైన అంశాల అధ్యయనాన్ని మిగతా 02లో

## ఇక సూపర్ 8 సమరం

### వర్షంతో న్యూజిలాండ్-పాక్ మ్యాచ్ రద్దు

- నేడు సౌతాఫ్రికాతో టీమిండియా ఢీ
- లంకలో లంకను ఎదుర్కోబోతున్న ఇంగ్లండ్
- దిగ్గజాల పోరుతో పొట్టికప్ రక్తికట్టడం ఖాయం

ICC MEN'S T20 WORLD CUP INDIA & SRI LANKA 2026

11



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
ఆదివారం 22.02.2026
www.mudranews.in | @mudranews



2వ పేజీలోఇండియాలో టాప్ 10 హీరోలు




**షారుఖ్ ఖాన్**
షారుఖ్ ఖాన్ బాలీవుడ్ కింగ్‌గా ప్రపంచవ్యాప్తంగా అభిమానులను సంపాదించుకున్నాడు. రొమాంటిక్ పాత్రలతో పాటు యాక్షన్‌లో కూడా తన ప్రత్యేకత చూపించాడు.

## 'గృహలక్ష్మి'కి గుడ్ న్యూస్

(మొదటి పేజీ తరువాయి)

–నిజం చేసేందుకు గృహలక్ష్మి పథకం అమలు చేసిన సంగతి తెలిసింది. 2023లో అసెంబ్లీ ఎన్నికలకు కొన్ని నెలల ముందు ఈ పథకానికి శ్రీకారం చుట్టారు. ఈ పథకం కింద పలువురు లబ్ధిదారులకు ఇంటి నిర్మాణం కోసం రూ.3 లక్షలు చెల్లించేందుకు ఉత్తర్వులు జారీ చేశారు. కొందరు లబ్ధిదారులకు అప్పటి మంత్రులు, ఎమ్మెల్యే మంజూరు పత్రాలు సైతం అందించారు. దీంతో పలువురు లబ్ధిదారులు ఇంటి నిర్మాణ పనులు మొదలుపెట్టారు. ఆ తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగా.. ఆ పథకాన్ని రద్దు చేశారు. దాని స్థానంలో ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని తీసుకొచ్చారు. ఈ పథకం కింద పేదల ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందిస్తున్నారు. అయితే గృహలక్ష్మి పథకం లబ్ధిదారులకు మాత్రం బిల్లులు చెల్లించలేదు. దీంతో ఏళ్లుగా ఆయా లబ్ధిదారులు బిల్లుల కోసం ఎదురు చూస్తున్నారు. తాజాగా వారి నిరీక్షణకు రాష్ట్ర ప్రభుత్వం తెరదించింది. మొండిగోడలు, పిల్లర్లతో దర్శనమిస్తున్న గృహలక్ష్మి నిర్మాణాలకు ఊపిరిపోయాలని నిర్ణయించారు. మధ్యలోనే నిలిచిపోయిన ఇళ్లకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని వర్తింపజేస్తూ ఉత్తర్వులిచ్చారు.

**ఇవే మార్గదర్శకాలు**

ఇందిరమ్మ ఇళ్ల మార్గదర్శకాల ప్రకారం.. పునాది ప్రాంతం 400 చదరపు అడుగుల నుంచి 600 చదరపు అడుగుల మధ్యనే ఉండాల్సి ఉంటుంది. గృహలక్ష్మి లబ్ధిదారుల ఇప్పటికే నిర్మించిన బేస్మెంట్ తక్కువగా ఉంటే దానిని కనీసం 400 చదరపు అ డుగులకు తేవటానికి అదనపు పునాది బీమ్‌లను వేసుకోవాల్సి ఉంటుంది. పెద్ద బేస్‌మెంట్ వేసినట్లయితే దాన్ని గరిష్ఠంగా 600 చదరపు అడుగులకు పరిమితం చేయాలి. నిర్మాణాన్ని ఇప్పటికే బేస్‌మెంట్ తీసుకెళ్లిన దృష్ట్యా వారికి ఆ దశ డబ్బులు చెల్లించరు. అయితే బేస్‌మెంట్ తర్వాత మిగిలిన రూ.4లక్షలు దశల వారీగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారు. రూఫ్ లెవల్ రూ.లక్ష, స్లాబ్ పూర్తయితే మరో రూ.2లక్షలు, ఫినిషింగ్ రూ.లక్ష చొప్పున గృహలక్ష్మి పథకం లబ్ధిదారులకు అందిస్తారు.

# విస్తరణ వివాదం

(మొదటి పేజీ తరువాయి)

**సామాజిక సమీకరణాల లెక్కలు**

మంత్రివర్గ విస్తరణ చేపడితే సామాజిక వర్గాల వారీగా సమతుల్యత పాటించడం రేవంత్ రెడ్డికి పెద్ద సవాలుగా మారనుంది. రెడ్డి సామాజిక వర్గంతో పాటు బీసీ, ఎస్సీ , మైనారిటీ వర్గాలకు సరైన ప్రాతినిధ్యం కల్పించాల్సి ఉంటుంది. ఇప్పటికే ఆశావహుల జాబితా చాంతడంత ఉండటంతో ఎవరిని తీసుకున్నా మిగిలిన వారిలో అసహనం కలిగే అవకాశం ఉంది. ఈ కారణాల వల్ల రేవంత్ రెడ్డి ప్రస్తుతానికి ఎలాంటి రిస్క్ తీసుకోవడానికి ఇష్టపడటం లేదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ పై హైకమాండ్ నుండి రేవంత్ రెడ్డికి పూర్తి స్వేచ్ఛ లభించినట్లు సమాచారం. ఎవరిని మంత్రిగా తీసుకోవాలి, ఎవరిని తొలగించాలి అనే నిర్ణయాధికారం ఆయనకే వదిలేసినట్లు తెలుస్తోంది. అయినప్పటికీ రేవంత్ రెడ్డి తక్షణమే ఈ ప్రక్రియను చేపట్టేందుకు ఆసక్తి చూపడం లేదని ..కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి లాంటి వాళ్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**పరిషత్, గ్రేటర్ ఎన్నికల తర్వాతే ఆలోచన**

బడ్జెట్ సమావేశాలు, గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలు వంటి కీలక రాజకీయ పరిణామాల తర్వాతే దీనిపై ఒక నిర్ణయం ఉండవచ్చని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అప్పటి వరకు ప్రస్తుత మంత్రుల పనితీరును గమనించి ఆ తర్వాతే మార్పులు చేసే అవకాశం ఉంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో రేవంత్ రెడ్డి తన పట్టును మరింత పెంచుకోవడం పైనే దృష్టి సారించారు. ఆశావహుల్ని ఎలా ఎదురు చూస్తూ ఉండేలా చేయనున్నారు.

**అజారుద్దీన్ కు పదవీ గండం**

అనూహ్యంగా మంత్రి అయిన అజారుద్దీన్‌ను పదవీ గండం వెంటాడుతోంది. గతేడాది జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల సమయంలో అక్టోబర్ 31న మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఇప్పటికే మూడున్నర నెలలు గడిచిపోయింది. కానీ అజార్ ఇప్పటివరకు అటు అసెంబ్లీకి కానీ..ఇటు మండలికి కానీ ఎన్నిక కాలేదు. ఆరు నెలల్లోపు ఏదో సభకు ఎన్నిక కాకపోతే ఆయన పదవి ఊస్ట్ అవడం పక్కా. దీంతో అజారుద్దీన్ విషయంపై కాంగ్రెస్ పెద్దలు పెద్ద కసరత్తే చేస్తున్నారు. అజారుద్దీన్‌ను పదవీ గండం నుంచి గట్టెక్కించేందుకు సీఎం రేవంత్ రెడ్డి భారీ స్కెచ్ వేస్తున్నారు. ఒక్క దెబ్బకు రెండు పిట్టలు అన్నట్లుగా వ్యూహాలకు పదును పెడుతున్నారట. ఈ దెబ్బతో ఇటు రాష్ట్రంలో ఎమ్మెల్సీ పదవుల భర్తీ, త్వరలో ఖాళీ కాబోతున్న రాజ్యసభ స్థానాల భర్తీకి మార్గం సుగమమం కానున్నట్లు తెలుస్తోంది.

**ఎమ్మెల్సీ కష్టమేనా..?**

అజారుద్దీన్ ను ఎమ్మెల్సీగా చేసే ఆలోచన లోనే మంత్రివర్గంలోకి తీసుకుంది ప్రభుత్వం. కానీ గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పదవులపై సస్పెన్స్ వీడటం లేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రొఫెసర్ కోదండరాం, అమీర్ అలీ ఖాన్లను గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా ప్రభుత్వం నామినేట్ చేసింది. వీరి నియామకాన్ని సవాలు చేస్తూ బీఆర్ఎస్ నేతలు సుప్రీంకోర్టుకు వెళ్లడంతో ప్రొఫెసర్ కోదండరాం, అమీర్ అలీఖాన్ నియామకం చెల్లదని వారి పదవులను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు నిర్ణయం తీసుకుంది. గత ఏడాది ఆగస్ట్ 30న జరిగిన క్యాబినెట్ సమావేశంలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పదవులపై చర్చించిన మంత్రిమండలి ప్రొఫెసర్ కోదండరాం, అజారుద్దీన్ను ఎమ్మెల్సీలుగా నామినేట్ చేస్తూ గవర్నర్‌కు ఫైల్ పంపింది. అయితే కోదండరాం, అమీర్ అలీఖాన్ నియామకంపై వేసిన కేసులో తాము తుది తీర్పు ఇచ్చేంత వరకు కొత్త నియామకాలు చేపట్టొద్దని సుప్రీంకోర్టు చెప్పడంతో కోదండరాం, అజారుద్దీన్ ఎమ్మెల్సీలుగా ప్రమాణ స్వీకారం చేయలేదు. అయితే ఇంతలోపే అజారుద్దీన్ మంత్రిగా పదవి చేపట్టి ఆరు నెలుల పూర్తి అయ్యే పరిస్థితి వస్తుంది. దీంతో కొత్త ఫార్ములాకు ప్లాన్ చేస్తున్నారట సీఎం రేవంత్.

**ఏప్రిల్ 30 డెడ్‌లైన్**

వచ్చే ఏప్రిల్ 30 నాటికి అజారుద్దీన్ ఎమ్మెల్సీగానో లేదా ఎమ్మెల్యేగానో ప్రమాణ స్వీకారం చేయాల్సి ఉంటుంది. అలా చేయకుంటే మంత్రి పదవికి గండం తప్పదు. అయితే ప్రస్తుతం ఉన్న పరిస్థితుల దృష్ట్యా శాసనసభకు ఎలాంటి ఎన్నికలు లేకపోవడంతో ఇక ఎమ్మెల్సీగానే ఎన్నిక కావాల్సి ఉంది. అయితే గవర్నర్ కోటా ఎమ్మెల్సీ అంశం సుప్రీంకోర్టులో పెండింగ్లో ఉంది. ప్రొ.కోదండరామ్, అజారుద్దీన్ను ఎమ్మెల్సీగా నియమించాలని క్యాబినెట్ నిర్ణయించినా సుప్రీంకోర్టులో కేసు పెండింగ్‌లో ఉండటంతో సస్పెన్స్ కొనసాగుతోంది. దీంతో అజారుద్దీన్ను పదవీగండం నుంచి గట్టెక్కించేందుకు.. రేవంత్ వ్యూహాన్ని రచిస్తున్నారట. ప్రస్తుతం ఎమ్మెల్సీలుగా ఉన్నవారిలో ఒకరి చేత రాజీనామా చేయించి వారి స్థానంలో అజారుద్దీన్కు మండలికి పంపించేలా ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఎమ్మెల్సీగా రాజీనామా చేయబోయే నేతకు రాజ్యసభ సీటును ఆఫర్ చేసే అవకాశం ఉందని టాక్.

## హైదరాబాద్ మెట్రో టేకోవర్‌కు
# గ్రీన్ సిగ్నల్

(మొదటి పేజీ తరువాయి)

ఐడీబీఐ పూర్తి చేసింది. ప్రస్తుతం మెట్రోను నిర్వహిస్తున్న ఎల్ అండ్ టీ సంస్థకు చెల్లించాల్సిన బకాయిలపై తెలంగాణ ప్రభుత్వం ఒక స్పష్టమైన నివేదికను రూపొందించింది. హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ , ఎల్ అండ్ టీ మధ్య ఉన్న ఒప్పందాల మార్పులపై ప్రస్తుతం చర్చలు జరుగుతున్నాయి. ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని సిద్ధం చేసిన తుది నివేదికలను ఈ నెల 23న




జరగనున్న రాష్ట్ర కేబినెట్ సమావేశంలో మెట్రో ప్రాజెక్టుకు సంబంధించిన ఫైనాన్స్, టెక్నికల్ స్టడీ రిపోర్టులపై చర్చించనున్నారు. ఆ నివేదికకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం పొందిన వెంటనే టేకోవర్ ప్రక్రియ మరింత వేగవంతం కానుంది. ఈ ఆర్థిక సంవత్సరం చివరి తేదీలోపు హైదరాబాద్ మెట్రో ప్రభుత్వం టేకోవర్ చేసుకుంటుంది.

**మెట్రో రెండో దశకు కేంద్రం గ్రీన్ సిగ్నల్**

హైదరాబాద్ మెట్రో రెండో దశ పనులకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ ప్రాజెక్టు పురోగతిపై కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఇటీవల అధికారిక లేఖ రాశారు. ఇటీవల తాను కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌తో భేటీ అయ్యానని, మెట్రో రెండో దశ నిర్మాణానికి కేంద్రం మద్దతు ఇస్తుందని పేర్కొన్నారు. అయితే, ఈ ప్రాజెక్టు పట్టాలెక్కాలంటే రాష్ట్ర ప్రభుత్వం కొన్ని తక్షణ చర్యలు తీసుకోవాలని కిషన్ రెడ్డి లేఖలో సూచించారు.

**అధికారుల కమిటీ ఏర్పాటు - రాష్ట్రానికి పిలుపు**

మెట్రో రెండో దశ పనుల పర్యవేక్షణ, సమన్వయం కోసం ఒక నలుగురు సభ్యుల ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఇందులో కేంద్రం తరఫున ఇద్దరు, రాష్ట్రం తరఫున ఇద్దరు అధికారులు ఉంటారు. ఈ కమిటీ ఏర్పాటు ప్రక్రియను పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రతిపాదించే ఇద్దరు అధికారుల పేర్లను వెంటనే పంపాలని కిషన్ రెడ్డి సీఎం రేవంత్ రెడ్డిని కోరారు. ప్రాజెక్టు రూపకల్పన, నిధుల కేటాయింపు మరియు అమలు తీరుపై ఈ కమిటీయే తుది నిర్ణయాలు తీసుకోనుంది.

**హైదరాబాద్ మెట్రో నెట్‌వర్క్ స్వాధీనం - కీలక నిబంధన**

మెట్రో మొదటి దశకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలు, ఒప్పందాలు పూర్తయిన తర్వాతే రెండో దశ ప్రక్రియ వేగం పుంజుకుంటుందని కేంద్రం స్పష్టం చేసింది. ప్రస్తుతం ఎల్ అండ్ టీ ఆధ్వర్యంలో ఉన్న మెట్రో నెట్‌వర్క్‌ను రాష్ట్ర ప్రభుత్వం తన అధీనంలోకి తీసుకునే ప్రక్రియ ముగిసిన తర్వాతే, రెండో దశకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదికను కేంద్రానికి పంపాలని రాష్ట్ర ప్రభుత్వానికి కిషన్ రెడ్డి కొన్ని రోజుల కిందటే సూచించారు. ఈ సాంకేతిక అడ్డంకులు తొలగితేనే కేంద్రం నుండి నిధుల విడుదల, సహకారం తేలిక అవుతుందని వివరించారు.

**ఆస్తులు, భూములపై లెక్కలు**

కాగా, ఎల్ అండ్ టీకి గతంలో లీజుకు ఇచ్చిన భూములు, వాటిలో నిర్మాణాలపై పూర్తి నివేదిక రెడీ అవుతోంది. గతంలో ఎల్ అండ్ టకి ప్రభుత్వం చాలా చోట్ల భూములు ఇచ్చింది. వాటిలో కొన్ని నిర్మాణాలు చేశారు. వాటిని కమర్షియల్ గా వినియోగిస్తున్నారు. ఇప్పుడు ప్రభుత్వం మెట్రోను టేకోవర్ చేస్తే అవన్నీ ప్రభుత్వం చేతికి తిరిగి రావాల్సిందే. అయితే, లీజు ప్రక్రియను ఎలా రద్దు చేస్తారనేది న్యాయపరంగా తేల్చుకోవాల్సి ఉంటోంది.

హైదరాబాద్ మెట్రో ఫేజ్ II–B విస్తరణ.. రూ. 19,579 కోట్లతో భారీ ప్రణాళిక హైదరాబాద్ రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా హైదరాబాద్ మెట్రో రెండో దశ విస్తరణకు సంబంధించి కీలక అడుగులు పడుతున్నాయి. ఈ ప్రతిపాదిత ప్రాజెక్టును మొత్తం 86.1 కిలోమీటర్ల పొడవునా నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ భారీ విస్తరణ కోసం సుమారు రూ. 19,579 కోట్ల అంచనా వ్యయంతో ప్రణాళికలు సిద్ధం చేశారు. దీనికి సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదికను ఇప్పటికే ఆమోదం కోసం కేంద్ర ప్రభుత్వానికి సమర్పించారు. ఈ రెండో దశ విస్తరణలో భాగంగా నగరాన్ని నలుమూలలా అనుసంధానించేలా మూడు ప్రధాన మార్గాలను ప్రకటించారు.

**ఎయిర్‌పోర్ట్ నుండి ఫ్యూచర్ సిటీ వరకు**

శంషాబాద్ విమానాశ్రయం నుండి స్కిల్ యూనివర్సిటీ ఉన్న ఫ్యూచర్ సిటీ వరకు అత్యంత పొడవైన మార్గాన్ని నిర్మించనున్నారు. దీని మొత్తం పొడవు 39.6 కిలోమీటర్లు.

**జేబీఎస్ నుండి మేడ్చల్ వరకు**

జూబ్లీ బస్ స్టేషన్ నుండి మేడ్చల్ వరకు ప్రయాణికులకు మెరుగైన సౌకర్యం కల్పించేలా 24.5 కిలోమీటర్ల మేర మెట్రో లైన్ విస్తరించనున్నారు.

**జేబీఎస్ నుండి శామీర్‌పేట్ వరకు**

జూబ్లీ బస్ స్టేషన్ నుండి శామీర్‌పేట్ వైపు మరో 22 కిలోమీటర్ల మార్గాన్ని ప్రతిపాదించారు.

# ట్రెండ్ సెట్టర్‌గా అడ్లూరి

**ముద్ర, ధర్మపురి:**

రాష్ట్ర కాంగ్రెస్ తో పాటు జాతీయ కాంగ్రెస్ పార్టీలో రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేరు చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్ పార్టీ పెద్దల నుంచి మొదలుకొని రాజకీయ విశ్లేషకుల వరకు అందరూ శేభాష్ అడ్లూరి అంటున్నారు. ఎందుకంటే ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో అడ్లూరి ప్రాతినిధ్యం వహిస్తున్న ధర్మపురి మున్సిపాలిటీలోని 15 వార్డులకు గాను 15 వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు విజయం సాధించడమే ఇందుకు కారణం.




**ప్రజల విశ్వాసానికి పట్టాభిషేకం..**

మున్సిపాల్ ఎన్నికల్లో రాష్ట్ర రాజకీయాలకు మంత్రి అడ్లూరి స్పష్టమైన సందేశం ఇచ్చారు. "ఇది గెలుపు అంటే గెలుపు మాత్రమే కాదు.. ప్రజల విశ్వాసానికి పట్టాభిషేకం". ధర్మపురి రాజకీయ చరిత్రలో ఇది ఒక అపూర్వ ఘట్టంగా చెప్పుకోవచ్చు.. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సాధించిన 15 వార్డులకు 15 వార్డుల సంపూర్ణ విజయం కేవలం ఒక ఎన్నికల ఫలితం మాత్రమే కాదు ఇది ప్రజల మనసుల్లో కాంగ్రెస్ పాలనకు లభించిన సంపూర్ణ మద్దతు. సీఎం రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కోస్గి మున్సిపాలిటిలో మాత్రమే 16 వార్డులకు 16 వార్డులు కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోగా, ధర్మపురి తీర్పు కొత్త చర్చకు తెరలేపింది.

**బీఆర్ఎస్ కోటకు బీటలు..**

2009లో నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా ఏర్పడిన ధర్మపురి నియోజకవర్గం బీఆర్ఎస్‌కు కంచుకోటగా ఉండేది. ఇక్కడి ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కడతారని ఎవ్వరూ ఉహించలేదు. ఒకవైపు అధికారం మరోవైపు ధనబలంతో పటిష్టంగా ఉన్న బీఆర్ఎస్ వరుస విజయాలకు బ్రేక్ వేయడం సాధ్యం కాని పనిగా భావించారు. కాని 2023లో ధర్మపురి ప్రజలు ఇచ్చిన తీర్పుతో ఎమ్మెల్యేగా విజయం సాధించిన అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తనపై ప్రజలు ఉంచిన బాధ్యతను ఏనాడు మరిచిపోకుండా ముందుకు సాగుతున్నారు. ఓడినా.. గెలిచినా.. ప్రజల మధ్య ఉంటూ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగిన మంత్రి అడ్లూరికి పంచాయతీ ఎన్నికల్లో సైతం నియోజకవర్గ ప్రజలు పట్టం కట్టారు. నియోజకవర్గంలో మొత్తం 149 గ్రామ పంచాయతీలు ఉండగా 108 మంది కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులు విజయం సాధించారు. మున్సిపాల్ ఎన్నికల్లో 15 వార్డులకు 15 మంది కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిచించుకొని అడ్లూరి నేడు ధర్మపురి కాంగ్రెస్‌కు విశ్వాసకోటగా మార్చారు. మంత్రిగా తనకు హోదా ఉన్నప్పటికీ ఒక సామాన్యుడిగా ముందుకు సాగుతున్నాడు.

**రాబోయే తరాలకు ఒక పాఠం..**

వరుస విజయాలతో ప్రబల శక్తిగా నిలిచిన మంత్రి అడ్లూరి నాయకత్వ పటిమ భవిష్యత్ నాయకులకు ఒక పాఠం. లక్ష్మణ్ కుమార్ రాజకీయ ప్రస్థానం ఒక ప్రేరణాత్మక ప్రయాణం. ఎన్.ఎస్.యూ.ఐలో విద్యార్థి నాయకుడిగా ప్రారంభమైన ఆయన ప్రయాణం, జెడ్పీటీసీగా, ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిషత్ చైర్మన్ గా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా అడ్లూరి చేసిన సేవలు ఆయనను మరింత ముందుకు నడిపించాయి. తాను ఎమ్మెల్యే కావాలనే కలను సాకారం చేసుకునేందుకు పట్టు వీడని విక్రమార్కుడిలా ప్రయత్నం సాగిస్తూ వచ్చారు. నిరంతర పోరాటంలో ఓటములు చవిచూసినా, ఎన్నో అవమానాలు, కష్టాలు భరిస్తూ ఏనాడు నిరాశ చెందలేదకుండా విజయం వరిస్తుందనే విశ్వాసంతో తన పోరాటాన్ని కొనసాగించారు. చివరకి 2023లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో ధర్మపురి నియోజకవర్గ ఓటర్ల ఆశీస్సులతో లక్ష్మీనర్సింహ స్వామి కటాక్షంతో ధర్మపురి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. తన సుదీర్ఘ రాజకీయ ప్రయాణంలో చిరకాల కోరికను నెరవేర్చుకున్నారు. కొత్త ప్రభుత్వంలో ప్రభుత్వ విప్ గా నియమించబడ్డారు. క్యాబినెట్ విస్తరణలో భాగంగా మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు.

**అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా..**

ధర్మపురి నియోజకవర్గంలో అభివృద్ధి సంక్షేమ రెండు కళ్లగా భావిస్తూ ముందుకు సాగుతున్న మంత్రి అడ్లూరి నియోజకవర్గంలో అర్హులైన వారికి తన శాఖ ద్వారా ప్రభుత్వ ఫలాలను అందించడంతో పాటు నియోజకవర్గంలో అనేక సంవత్సరాలుగా ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలకు పరిష్కారం చూపిస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పాలనకు అద్దం పట్టినట్లుగా మంత్రి నియోజకవర్గంలో ముందుకు సాగుతున్నారు. ఆరు నెలల్లో సాగునీరు, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం, కొత్త బస్సు డిపో, డిగ్రీ కాలేజీ, పాలిటెక్నిక్ కాలేజీ, రెవెన్యూ డివిజన్ కేంద్రం వంటి ప్రాజెక్టులు అమలు చేస్తామని ఎన్నికల సందర్భంగా ప్రకటించారు. 2027లో రాబోయే పుష్కరాల కోసం ధర్మపురిని అందంగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రితో మాట్లాడి భారీ నిధులు తీసుకువస్తామని చెప్పారు. ఇలా అభివృద్ధి, సంక్షేమం రెండు కలిపి మంత్రి అడ్లూరి అందరి ప్రశంసలు అందుకుంటున్నారు.

## కేపీహెచ్‌బీలో మొబైల్ షాపులో
# అగ్నిప్రమాదం

**ముద్ర, కూకట్‌పల్లి:**

కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు (కేపీహెచ్‌బీ) కాలనీలోని పద్మావతి ప్లాజాలో ఉన్న ఓ మొబైల్ షాపులో శనివారం తెల్లవారుజామున అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో దుకాణంలోని విలువైన సామగ్రి పూర్తిగా దగ్ధమైంది.వడ్డేపల్లి హరిబాబు నిర్వహిస్తున్న 'శ్రీ సాయి కమ్యూనికేషన్' షాపును శుక్రవారం రాత్రి మూసివేసి వెళ్లగా, ఉదయం సుమారు 6 గంటలకు పొగలు వస్తుండటాన్ని గమనించిన హోటల్ సిబ్బంది యజమానికి సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకునే సరికి మంటలు ఎగసిపడుతున్నాయి. స్థానికులు, అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చినా, అప్పటికే కొత్త మొబైల్ ఫోన్లు, రిపేర్‌కు వచ్చిన ఫోన్లు, ఫర్నిచర్ పూర్తిగా కాలిపోయాయి. షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం జరిగి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేపట్టారు.




## రెడ్ టెర్రర్ నుంచి
# భారత్‌కు విముక్తి

**ముద్ర, నేషనల్ డెస్క్:**

దేశాన్ని నక్సలిజం రూపంలోని 'రెడ్ టెర్రర్' నుంచి విముక్తి చేయడంలో కేంద్ర ప్రభుత్వం దాదాపు విజయం సాధించిందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తెలిపారు. ఈ ఏడాది మార్చి 31 నాటికి దేశం నుంచి నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలిస్తామని ఆయన పునరుద్ఘాటించారు.అస్సాంలో జరిగిన 87వ సీఆర్‌పీఎఫ్ దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న అమిత్ షా మాట్లాడుతూ, ఛత్తీస్‌గఢ్–తెలంగాణ సరిహద్దు ప్రాంతాల్లో భద్రతా దళాలు కఠిన పరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గకుండా మావోయిస్టులపై విజయాలు సాధించాయని అన్నారు. ఈ క్రమంలో సీఆర్‌పీఎఫ్, కోబ్రా దళాల పాత్ర కీలకమని ఆయన ప్రశంసించారు. ఒకప్పుడు నక్సలిజం 12 రాష్ట్రాల్లో విస్తరించినప్పటికీ, గత కొన్నేళ్లలో దానిని గణనీయంగా తగ్గించగలిగామని తెలిపారు. భద్రతా దళాల ధైర్యం, కేంద్ర ప్రభుత్వ సంకల్పంతో దేశాన్ని 'రెడ్ టెర్రర్' నుంచి విముక్తి చేయగలిగామని అమిత్ షా పేర్కొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
22.02.2026 ఆదివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**ఇండియాలో టాప్ 10 హీరోలు**



**సల్మాన్ ఖాన్**
మాస్ ఎంటర్‌టైనర్‌గా అభిమానుల గుండెల్లో స్థానం సంపాదించాడు. యాక్షన్ సినిమాలతో బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టిస్తుంటాడు.



## సమస్త లోకములు ఆయనలోనే..

- **వటపత్ర సాయి అలంకార సేవలో నారసింహుడు**
- **దిగ్విజయంగా కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు**

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

యాదగిరి శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో శనివారం వటపత్రశాయి అలంకార సేవలో నారసింహుడు భక్తుల దర్శనార్థం తిరు వీధులలో ఊరేగాడు. ఆలయ ప్రధానార్చకులు పత్ర సాయి అలంకార విశిష్టతను భక్తులకు వివరించారు. ఈ వేడుకలలో ఉప ప్రధానార్చకులు, యజ్ఞాచార్యులు, వేద పండితులు, అర్చక బృందం, పారాయణీకులు కార్యనిర్వహణాధికారి జె.భవానీశంకర్, ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహామూర్తి, జిల్లా కలెక్టరు యం. హనుమంతరావు, యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్మన్ గుండ్లపల్లి వాణీ భరత్ గౌడ్, ఉప కార్యనిర్వహణాధికారి, సహాయ కార్యనిర్వహణాధికారులు, పర్యవేక్షకులు, ఉద్యోగ సిబ్బంది, భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

**వట పత్ర సాయి అలంకార సేవ విశిష్టత**

భగవానుడి సృష్టి ప్రారంభ దశలో సమస్త విశ్వములు బ్రహ్మాండములు అన్ని లోకములు జలములతో నిండి ఉండగా ఆ జలములపై భగవానుడు ఒక మర్రి ఆకుపై అరవిందము వంటి చేతితో పవళించి తన లీలా విలాసము ప్రకటించుచూ పదారవిందములను ముఖారవిందంలో నిలుపుదల చేసి తన కడుపులో గల 14 లోకములకు సమస్త ప్రాణములకు ప్రకృతికి అమృతమును అందించి వాటిని సంరక్షించిన తీరు ఈ వట పత్ర సాయి అలంకారంలో దర్శించవచ్చును.

**సాయంకాల కార్యక్రమాలు**

శనివారం సాయంకాలం శ్రీ స్వామివారి ఆలయంలో నిత్యారాధనల అనంతరం రాత్రి శ్రీస్వామివారిని "హంసవాహనశేవ" లో అలంకరించి తిరుమాఢవీధులలో ఊరేగింపు శేవ నిర్వహించారు. ఈ వేడుకను ఆలయప్రధానార్చకులు, ఉపప్రధానార్చకులు, యజ్ఞాచార్యులు, వేద పండితులు, అర్చక బృందం, పారాయణికులు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలో ఆలయ అధికారులు ఉద్యోగ సిబ్బంది, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**హంసవాహనశేవ ప్రత్యేకత**

భగవానుడి అనేక అవతారములలో పేరు ఎన్నిక గన్నది హంసావతారం. హంస జ్ఞానానికి ప్రతీక. బ్రహ్మదేవుడికి వేదములను ఉపదేశం చేసి భగవానుడు తన దివ్య అనుగ్రహమును హంస రూపంలో అనుగ్రహించిన తీరు ఈ అవతారంలోని ప్రత్యేకత. హంస నీటిని పాలను ఎలా వేరు చేసి చూపగలదో అలాగే భగవానుడు ఉపదేశం కూడా మనలో మంచిని పెంచి ధార్మికతలో మనల్ని నడిపించి మనలోని అజ్ఞానము తొలగించి జ్ఞానమును కలిగించే వైనం ఈ సేవలో దర్శించచ్చును.




## ఉనికి కొనసాగించలేం

- **దేవ్ జీ, మల్ల రాజిరెడ్డి త్వరలోనే అజ్ఞాతం వీడుతారు**
- **వాళ్లతో మిగతా వాళ్లూ వస్తారు**
- **మా డిమాండ్ల అమలుకు ఛత్తీస్ గఢ్ ప్రభుత్వం సిద్ధంగా ఉంది**
- **మావోయిస్టు మాజీ అగ్రనేత మల్లోజుల వేణుగోపాల్**

**ముద్ర, నేషనల్ డెస్క్:**

చైనా, రష్యా బూజు సిద్ధాంతాలపై ఉనికిని తాము కొనసాగించలేమని మావోయిస్టు మాజీ అగ్రనేత మల్లోజుల వేణుగోపాల్ అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం మావోయిస్టు ఉద్యమానికి మనుగడ లేదని స్పష్టం చేశారు. ఉద్యమంలో ఉన్నవాళ్లంతా వృద్ధులైపోయారన్న ఆయన మార్చి ఒకటో తేది లోపు దేవ్ జీ, మల్ల రాజిరెడ్డి అజ్ఞాతం వీడతారని చెప్పారు. వారితో పాటే మిగతా వాళ్లు కూడా వస్తారన్నారు. లొంగిపోయే ముందు ఛత్తీస్ గఢ్ ప్రభుత్వం ముందు డిమాండ్లు పెట్టామని.. అమలుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. శనివారం మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. మావోయిస్టు పార్టీలోకి కొత్త రక్తం రావడంలేదని చెప్పారు. 1980లో ఉన్న పరిస్థితులు ప్రస్తుతం లేవనీ అందుకే భవిష్యత్తులో మావోయిజానికి స్థానం లేదని చెబుతున్నానని చెప్పారు. అసలే అర్బన్ మావోయిజం అనేది లేదని అన్నారు. తాము కూడా నాటి ఉద్యమాన్ని తిరిగి తీసుకురాలేకపోయామని చెప్పారు. ఆదివాలసీలను అడిగితే తాము చేసిన పనుల గురించి చెబుతారని వ్యాఖ్యానించారు. వాస్తవం మాట్లాడుతున్న తనను కొంత మంది ద్రోహి అంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి కాలమే సమాధానం చెబుతుందన్నారు. తాను మాత్రం ప్రజలతోనే ఉన్నానని.. ప్రజల్లోనే ఉంటానని స్పష్టం చేశారు. ప్రజలు కోరుకుంటే రాజకీయబాట పడతానని అన్నారు. తన సహచరులు మంచి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. సోనూ దాదాగా అడవి ఉద్యమాన్ని వదిలిపెట్టానన్నారు. అజ్ఞాతంలో ఉండి తాను సాధించిన విజయాలు ఏంటనేది ప్రజల మధ్యకు వెళితే తెలుస్తుందని చెప్పారు. తాను జన్మించిన తెలంగాణకు త్వరలోనే వస్తానని అన్నారు.



## కామారెడ్డిలో ఉద్రిక్తత

- **ప్రభుత్వ డిగ్రీ కళాశాల భూముల కబ్జా?**
- **బీజేపీ ఎమ్మెల్యే కాటిపల్లి భూములు అమ్ముకున్నారని షబ్బీర్ అలీ ఆరోపణ**
- **రోడ్లపైకి కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణులు**
- **కాంగ్రెస్ నేత మహేందర్ రెడ్డి కారు ధ్వంసం**
- **పోలీసుల అదుపులో ఇరువర్గాలు**
- **తోపులాటలో పోలీసులకు గాయాలు**
- **ఎమ్మెల్యే కాటపల్లి హౌస్ అరెస్ట్**



**ముద్ర, కామారెడ్డి :**

కామారెడ్డి జిల్లాలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, అరోరా భూముల వివాదం ఉద్రిక్తతకు దారితీసింది. ఈ వ్యవహారంలో బీజేపీ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి, కాంగ్రెస్ నేత షబ్బీర్ అలీ మధ్య సవాలు ప్రతి సవాళ్లతో పొలిటికల్ హై టెన్షన్ నెలకొంది. శనివారం ఉదయం శిశు మందిర్ వద్దకు చర్చకు రావాలని షబ్బీర్ అలీకీ ఎమ్మెల్యే కాటిపల్లి సవాల్ విసిరారు. దీంతో కామారెడ్డిలో ఒక్కసారిగా కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణులు రోడ్లపైకి వచ్చాయి. ఈ క్రమంలో ఎమ్మెల్యే ఇంటి ముట్టడికి కాంగ్రెస్ నేత మహేందర్ రెడ్డి తన అనుచరులతో రాగా.. అక్కడ ఉన్న బీజేపీ కార్యకర్తలు మహేందర్ రెడ్డి కారును రోడ్డుపైనే తిరగేసి ధ్వంసం చేశారు. ఈ చర్యతో అక్కడ ఒక్కసారిగా పరిస్థితి అదుపు తప్పి ఇరు పార్టీల నేతలు దాడులు చేసుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన తోపులాటలో పోలీసులకు గాయాలయ్యాయి. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు ఇరు పార్టీల నేతలను అదుపులోకి తీసుకున్నారు. ఎమ్మెల్యే కాటిపల్లి ఇంటి నుంచి బయటకు వచ్చేందుకు ప్రయత్నించగా.. ఆయన్ను హౌస్ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా జరిగిన తోపులాటలో పలువురు పోలీసులకు గాయాలయ్యాయి. దీంతో అక్కడ టెన్షన్ వాతావరణం నెలకొంది. ఇరు పార్టీల మధ్య నెలకొన్న ఉద్రిక్తతలతో పోలీసులు అప్రమత్తమయ్యారు.

**అసలేం జరిగింది?:**

ఈ నెల 16న మీడియాతో మాట్లాడిన షబ్బీర్ అలీ.. కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల భూములపై వివాదస్పద వ్యాఖ్యలు చేశారు. ఆ భూములను ఓ ప్రైవేట్ పాఠశాల, కళాశాలకు అమ్ముకున్నది ఎవరు? రూ.6 కోట్లకు అరోరా కాలేజీకి అమ్ముకున్నది మీరు కాదా? అసలు కర్షపన్ కింగ్ వెంకటరమాణారెడ్డినేనని ఆరోపించారు. వెంకట రమణారెడ్డికి గతంలో తానే మున్సిపల్ కౌన్సిలర్‌గా అవకాశం ఇస్తే ఓడిపోయారనీ తర్వాత జడ్పీటీసీగా అవకాశం ఇస్తే గెలిచారన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్‌గా చేసినప్పుడు నాకు జన్మనిచ్చింది నా తండ్రి అయితే రాజకీయంగా నాకు జన్మనిచ్చింది షబ్బీరన్న అన్నది నువ్వు కాదా? అని ప్రశ్నించారు. 2015 ఎమ్మెల్సీ ఎన్నికల్లో తన చేతుల మీదుగా బీఫామ్ ఇస్తే చివరి నిమిషంలో టికెట్ అమ్ముకుని విత్ డ్రా చేసుకుని పారిపోయావ్ అని షబ్బీర్ అలీ ఆరోపించారు. మరుసటి రోజు ఈ వ్యాఖ్యలపై స్పందించిన ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి... షబ్బీర్ అలీపై మండిపడ్డారు. తనపై షబ్బీర్ అలీ చేసిన ఆరోపణలు ఈద్గ వద్ద కూర్చుందామా ఎక్కడైనా కూర్చుందాం రా చర్చకు అని సవాల్ చేశారు. తాను నా కుటుంబాన్ని తీసుకుని వస్తాను షబ్బీర్ కు దమ్ము ధైర్యం ఉంటే తన కుటుంబాన్ని తీసుకుని చర్చకు రావాలన్నారు. అన్యాయంగా ఎవరు మాట్లాడినా వాళ్ల వీపులు పగలగొట్టండి. ఇక్కడి నుంచి ఏ పోలీస్ స్టేషన్ కైనా నేనే నేరుగా వస్తా. ఇక చూసుకుందాం అంటూ తన అభిమానులకు పిలుపునిచ్చారు. ఇక చూస్కో షబ్బీర్.. నువ్వు బీరో.. షబ్బీరో నీ సంగతి చూడకపోతే నా పేరు వెంకటరమణా రెడ్డినే కాదు. నేను రెడ్డినో బుడ్డినే చూపిస్తానన్నారు. నా సంగతి నీకు అర్థం కావడం లేదు. నీ సంగతి చూడకపోతే నేను మీసాలు తీసేస్తానంటూ సవాల్ విసిరారు. కామారెడ్డి డిగ్రీ కాలేజీ భూములకు సంబంధించి తనపై కాంగ్రెస్ నాయకులు చేసిన ఆరోపణలపై తేల్చుకునేందుకు రావాలంటూ ఎమ్మెల్యే కాటిపల్లి నిన్న ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం ఉదయం 10 గంటలకు సాక్ష్యాలు తీసుకుని సరస్వతీ శిశుమందరి వద్దకు రావాలని ఇక్కడికి తాను స్వయంగా వస్తానని తెలిపారు. ఎమ్మెల్యే చేసిన సవాలుకు స్పందించిన కాంగ్రెస్ నేతలు తాము కూడా చర్చకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. ఈ క్రమంలో శనివారం ఉదయం నుంచే కామారెడ్డి పట్టణంలో టెన్షన్ వాతావరణం నెలకొంది.

## 1100 ఫైళ్లు బూడిద

- **నాంపల్లి ఎఫ్ఎస్ఎల్ అగ్నిప్రమాద కేసులో కీలక పరిణామాలు**
- **'ఫోన్ ట్యాపింగ్' కేసు శాస్త్రీయ సాక్ష్యాలు కూడా దగ్ధం**
- **నాగ్‌పూర్ స్పెషల్ టీమ్ రిపోర్ట్‌లో సంచలన వివరాలు**
- **డేటాను రికవర్ చేయడం అసాధ్యమని చెప్పిన నిపుణులు**
- **50 కంప్యూటర్లు, కీలక హార్డ్‌డిస్కులు అగ్నికి ఆహుతి**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

నాంపల్లి ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ అగ్నిప్రమాద కేసులో కీలక పరిణామం చేటుచేసుకుంది. ఈ ప్రమాదంలో దగ్ధమైన ఫైల్స్ పై నాగ్‌పూర్ స్పెషల్ టీమ్ కీలక ప్రకటన చేసింది. మొత్తం 1100 ఫైల్స్ దగ్ధమైనట్లు గుర్తించినట్టు పేర్కొంది. దగ్ధమైన ఫైల్స్ ను రికవరీకి ప్రయత్నించామని, డేటా రికవరీ చేయడం సాధ్యం కాదని తేల్చి చెప్పింది. ఈ నెల 7న నాంపల్లిలోని రాష్ట్ర ఫోరెన్సిక్ లాబొరేటరీ భవనం మొదటి అంతస్తులో జరిగిన అగ్నిప్రమాదంలో మొత్తం 50 కంప్యూటర్లు, తీవ్రమైన నేరాల్లో పోలీసులు సేకరించిన సాంకేతిక ఆధారాలను సీజ్ చేసిన హార్డ్ డిస్కులు దగ్ధమైనట్లు తమ రిపోర్టులో వెల్లడించింది. దగ్ధమైన ఫైల్స్‌లో ఒక కీలక కేసుకు ఆధారాలు కూడా ఉన్నట్లు సమాచారం. మరోవైపు.. రాష్ట్రంలో ప్రకంపనలు సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించిన శాస్త్రీయ ఆధారాలు కూడా ఈ ప్రమాదంలో కాలి బూడిదైనట్లు తెలిసింది. రాష్ట్రంలో జరిగే నేర పరిశోధనకు ఎఫ్ఎస్ఎల్ ల్యాబ్ సహాయం అందిస్తుంది. హత్యలు, దోపిడీలు, లైంగిక దాడులు, మోసాలు వంటి కేసులకు సంబంధించిన సాక్ష్యాధారాలు ఇక్కడే ఉంటాయి. ఫింగర్ ప్రింట్స్, బ్లడ్, హెయిర్, డీఎన్ఏ టెస్టులు, తుపాకులు, బుల్లెట్లతో పాటు విషాలు, మత్తుపదార్థాలు, గంజాయి, డ్రగ్స్, సంతకాలు, నకిలీపత్రాల పరిశీలన ఇక్కడే చేస్తారు. కాగా దగ్ధమైన ఫైల్స్ లో ఏమేమి ఉన్నాయన్న దానిపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.




## పత్తి రైతులకు ఊరట

- **ఈ నెలాఖరు వరకు పత్తి కొనుగోళ్లు**
- **ప్రకటించిన కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా**
- **పత్తి కొనుగోళ్ల పొడగింపుపై కేంద్రజౌళి శాఖకు అగ్రికల్చర్ సెక్రటరీ లేఖ**



**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా తెలంగాణ రైతులకు తీపికబురు చెప్పింది. రైతుల వద్ద నిలువ ఉన్న, లేట్ క్రాఫ్ ద్వారా సేకరిస్తున్న పత్తి కొనుగోళ్లను పొడిగిస్తున్నట్లు ప్రకటించింది. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభ్యర్థన మేరకు పత్తి కొనుగోళ్లను ఫిబ్రవరి నెలాఖరు వరకు పొడిగిస్తూ వెల్లడించింది. మంత్రి ఆదేశాలతో వ్యవసాయశాఖ జాయింట్ సెక్రటరీ ఈ నెల 20న కేంద్ర జౌళి శాఖకు లేఖ రాశారు. ఈ నేపథ్యంలో సీసీఐ ఈ నిర్ణయం తీసుకుంది. కేంద్ర ప్రభుత్వం, సీసీఐ తీసుకున్న ఈ నిర్ణయం పట్ల మంత్రి తుమ్మల సంతోషం వ్యక్తం చేశారు. పొడిగించిన గడువును వినియోగించుకొని పత్తిని అమ్ముకోవాలని పత్తి రైతులకు మంత్రి విజ్ఞప్తి చేశారు. కాగా శనివారం నుంచి రాష్ట్రంలో సీసీఐ కొనుగోలు కేంద్రాని మూసివేస్తామని సీసీఐ అధికారులు ముందు ప్రకటించారు. దీంతో రైతులు ఇక ప్రైవేట్ వ్యాపారులనే ఆశ్రయించాల్సిందేనా అనే ఆందోళన రైతుల్లో వ్యక్తం అయింది. ఈ యేడాది సీజన్ ఆరంభం నుంచి సీసీఐ తేమ పేరిట కోతలు విధించి తమను ఇబ్బందులకు గురి చేసిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మద్దతు ధర మొదట్లో రూ. 8110 ఉండగా తేమ పేరుతో కోత విధించడంతో చాలా మందికి ఎంఎంస్పీ లభించలేదని విచారం వ్యక్తం చేశారు. దీంతో తక్కువ ధరకే ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకోవాల్సి వచ్చిందన్నారు. ఇక ఈ ఏడాది దిగుబడి తగ్గడంతో పాటు పంట ఆలస్యంగా చేతికొచ్చింది. ఏటా మార్చి వరకు కొనుగోలు చేసే సీసీఐ అధికారులు ఈసారి ముందుగానే కేంద్రాల ను మూసివేసేందుకు నిర్ణయించుకోవడంతో ఆందోళన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో తాజాగా కనుగోళ్లు పొడిగించడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## పేదలందరికీ ఇళ్లు నిర్మించడమే లక్ష్యం

- **3 లక్షల ఇళ్లు మంజూరు చేయండి**
- **కేంద్ర మంత్రి మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కు మంత్రి పొంగులేటి వినతి**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

ప్రధాన మంత్రి ఆవాస్ యోజన గ్రామీణ పథకంలో భాగంగా రానున్న ఆర్థిక సంవత్సరంలో గ్రామీణ ప్రాంతాలకు 3 లక్షల ఇళ్లు మంజురు చేయాలని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి.. కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ను కోరారు. రెండేళ్ల క్రితం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఇళ్లు నిర్మాణానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. వచ్చే మూడేళ్లలో రాష్ట్రం లో అర్హులైన పేదలందరికీ ఇళ్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించిన ఆయన ఇప్పటికే ఈ ఏడాది దాదాపు నాలుగు లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజురు చేశామన్నారు. కేంద్ర ప్రభుత్వం చేయూతనిస్తే ఈ కార్యక్రమం మరింత వేగవంతం అవుతుందని చౌహాన్ దృష్టికి తీసుకువెళ్లారు. శనివారం రాష్ట్ర పర్యటనకు వచ్చిన కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తో మంత్రి పొంగులేటి హైదరాబాద్ లో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో గృహ నిర్మాణానికి సంబంధించి పలు అంశాలను ప్రస్తావించిన ఆయన కేంద్రమంత్రికి వినతి పత్రం అందజేశారు. తెలంగాణ ప్రజల ఆశలు ఆకాంక్షలకు అనుగుణంగా 201423 వరకు దాదాపు పదేండ్లలో గ్రామీణ ప్రాంతాలలో పేదల ఇళ్లు నిర్మాణం జరగలేదనీ దీంతో ఇళ్లు నిర్మాణానికి ప్రజల నుంచి భారీ ఎత్తున డిమాండ్ ఉందని శివరాజ్ సింగ్ కు వివరించారు. దీనిని దృష్టిలో పెట్టుకొని తెలంగాణకు అవసరమైన ఇళ్లను మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కేంద్రం నుంచి సానుకూల స్పందన రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం ఈ ఆర్థిక సంవత్సరంలోనైనా గ్రామీణ ప్రాంతాలకు 3 లక్షల ఇండ్లు మంజూరు చేయాలని కేంద్రాన్ని కోరారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన గ్రామీణ 1.0 పథకంలో భాగస్వామ్యం కాలేదన్న పొంగులేటి... తమ ప్రభుత్వం కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ మార్గదర్శకాల ప్రకారం పథకంలో రాష్ట్రం అధికారికంగా చేరిందన్నారు. 2024 ఆగస్టులో కేంద్ర మంత్రివర్గం పీఎం ఆవాస్ పథకం 2.0కు ఆమోదం తెలిపిందన్నారు. ఆవాస్ 2018 సర్వే నవీకరణ తర్వాత సాచురేషన్ పద్ధతిలో గృహాల మంజూరు చేయాలని నిర్ణయించినప్పటికీ, పాత డేటా ఆధారంగా 202425, 202526 సంవత్సరాలకు ఇతర రాష్ట్రాలకు 1.19 కోట్ల గృహాలను కేటాయించింది. తెలంగాణ రాష్ట్రం ఆ పథకం 1.0లో భాగస్వామ్యం కాకపోవడంతో 2018 పెండింగ్ డాటా లేదన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటికీ విస్తృత సర్వే నిర్వహించి అర్హులైన లబ్ధిదారుల డేటాబేస్‌ను సిద్ధం చేసుకుందనీ అయినప్పటికీ, కేంద్ర మార్గదర్శకాల ప్రకారం ఆవాస్ 2024 మొబైల్ యాప్ ద్వారా మరోసారి సర్వే నిర్వహించి మొత్తం 11.57 లక్షల అర్హులైన గ్రామీణ కుటుంబాలను గుర్తించామన్నారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
22.02.2026 ఆదివారం, హైదరాబాద్



నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్‌గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ 'ముద్ర' వేయండి

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

# కనులకు అందం... కవలల బంధం

ఫిబ్రవరి 22 అంతర్జాతీయ కవలల దినోత్సవం

**కవల పిల్లల కోసం చాలా మంది భార్యాభర్తలు కలలు కంటుంటారు. ఒకేసారి ఇద్దరు బిడ్డలకు జన్మనిస్తే ఆ కవలలతో ఇల్లు కళకళలాడుతుందని కొంతమంది తల్లులు భావిస్తుంటారు.ఒకే రూపంలో ఉండే ఇద్దరికి జన్మనివ్వాలని ముచ్చట పడుతుంటారు. ఎంతో అదృష్టం ఉంటే తప్ప కవల పిల్లలు పుట్టరన్న భావనలో ఉంటారు.కళ్ళను గందరగోళానికి గురిచేసే రూపం కవలల సొంతం.అమ్మ కడుపులో నుంచి కొన్ని క్షణాల వ్యత్యాసంతో పుట్టినా అనుబంధంలో తేడా తెలియని అనురాగం వారిని అల్లుకుంటోంది.**



1819లో పోలెండ్ దేశంలో మోజన్, అరన్ విల్ కాక్స్ అనే కవల సోదరులు నివసించే ఊరికి 'ట్విన్స్ బ్యాగ్' అనే పేరు పెట్టారు.వీరు అక్కాచెల్లెళ్లయిన యువతులను పెళ్లాడారు. ఒకే రకమైన వ్యాధితో బాధపడుతూ ఒకే రోజు తుదిశ్వాస విడిచారు. ఈ కవల సోదరులపై అభిమానంతో 1976 ఫిబ్రవరి 22న మొదటిసారి పోలెండ్ దేశస్థులు కవలల దినోత్సవాన్ని నిర్వహించారు. అప్పటి నుంచి ప్రపంచ వ్యాప్తంగా ఈ దినోత్సవాన్ని జరుపుకొంటున్నారు.

ఇంతకీ కొంతమందికే కవలలు ఎందుకు పుడతారు ..? కవలలు పుట్టాలంటే తల్లిదండ్రులు చేయాల్సిందేమైనా ఉందా ..? కవలలు పుట్టే అవకాశాలు మెరుగుపరచుకోవడం ఎలా..? వంటి ప్రశ్నలు అందరిలోనూ తలెత్తుతుంటాయి. ఎటువంటి దంపతులకు కవల పిల్లలు పుడతారు అనే ఉత్సుకత తల్లిదండ్రుల్లో ఉంటుంది.

ఒకే తల్లి గర్భంలో ఒకే సమయంలో లేదా కొన్ని సెకెన్ల వ్యవధిలో జన్మిస్తే కవల పిల్లలు అంటారు. ఇద్దరూ మగ పిల్లలు, ఇద్దరూ ఆడ బిడ్డలు, ఒక ఆడ బిడ్డ, ఒక మగ బిడ్డ.. ఇలా కవలలు ఎలా అయినా కావచ్చు. కవలలుగా జన్మించే పిల్లల్లో చాలా వరకు ఒకేలా ఉంటారు. శరీర నిర్మాణం, రంగు, జట్టు, ఎత్తు వంటివన్నీ దాదాపు 99 శాతం ఒకేలా ఉంటాయి. ఒకే పోలికతో ఉండే కవలలను వైద్య పరిభాషలో 'మోనోజైగోటిక్ ట్విన్స్' అని అంటారు. వేర్వేరు పోలికలతో జన్మించిన కవల పిల్లలను 'డైజైగోటిక్' ట్విన్స్' అని పిలుస్తారు.

పురుషుల్లోని ప్రత్యుత్పత్తి వ్యవస్థ నుంచి విడుదల్యే వీర్య కణాలు మహిళల్లోని అండంతో ఫలదీకరణం వల్లే పునరుత్పత్త జరుగుతుందని మనందరికీ తెలుసు. ఐతే.. మహిళల్లో కొన్నిసార్లు రెండు అండాశయాల నుంచి రెండు అండాలు విడుదల అవుతుంటాయి. ఈ అండాలను రెండు వీర్య కణాలు కలిస్తే రెండు ఫలదీకరణాలు జరుగుతాయి. ఈక్రమంలో కవల పిల్లలు జన్మిస్తారు.




**ప్రపంచ వ్యాప్తంగా 130 మిలియన్ల ట్విన్స్ ఉన్నారని ఓ సర్వే ద్వారా బయటపడింది. ఇద్దరు కవలలు జన్మించడం సాధారణమే. కానీ.. ముగ్గురు నుంచి ఏడుగురి వరకు జన్మించడం అత్యంత అరుదుగా జరుగుతుంది. కవల పిల్లలకు జన్మినిచ్చే మహిళలు ఎక్కువ కాలం జీవిస్తారని ఓ అధ్యయనం ద్వారా తేలింది.**

కవల పిల్లలు పుట్టాలంటే ఏం చేయాలి అనే విషయమై శాస్త్రీయ పద్ధతులు ఏవీ లేవు. కానీ.. తల్లిదండ్రులకు ఎటువంటి లక్షణాలుంటే కవల పిల్లలు పుడతారు ..? ఎటవంటి ఆహారం తీసుకుంటే ట్విన్స్‌కు జన్మనిచ్చే అవకావాలు ఎక్కువ..? వంటి అంశాలపై కొన్ని దేశాల్లో అధ్యయనాలు జరిగాయి. ఆ అధ్యయనాల ఆధారంగా కొన్ని చిట్కాలు పాటిస్తే కవలలకు జన్మినిచ్చే ఛాన్స్ పెరుగుతందట.

కవలలకు జన్మనివ్వడంలో జీన్స్ ప్రధాన పాత్ర పోషిస్తాయి. అంటే.. మీ వంశంలో ఇంతక ముందు ఎవరైనా కవలలకు జన్మనిచ్చి ఉంటే.. మీకూ ఆ అవకాశం ఎక్కువగా ఉంటుంది. తల్లిదండ్రులిద్దరి వంశాల్లో 'ట్విన్స్ హిస్టరీ' ఉంటే కవలలకు జన్మనిచ్చే అవకాశం మరింత పెరుగుతుందట. 'ట్విన్స్ జీన్స్' ఉన్న మహిళలు.. 30 ఏళ్ల వయసు దాటాక గర్భం ధరిస్తే కవలలు జన్మించే అవకాశం ఇంకాస్త పెరుగుతుందట.

కవలలు రూపంలో ఒకేలా ఉంటారు. కానీ.. వారి ఫింగర్ ప్రింట్స్, కళ్లు మాత్రమే వేరేలా ఉంటాయి. కొంతమంది ట్విన్స్ ముఖ కవలికలు ఒకేలా ఉన్నా శారీరక బరువు వేర్వేరుగా ఉంటుంది. కవలల ఆకృతి మాత్రమే ఒకేలా ఉంటాయి.. వారి ఆలోచనలు ఒకేలా ఉండవు. కొందరు ట్విన్స్‌లో ఒకరు ఆరోగ్యంగా ఉంటే మరొకరు వీక్‌గా ఉంటారు. అలాగే.. ఇద్దరిలో రోగ నిరోధక శక్తుల్లో చాలా వ్యత్యాసం ఉంటుంది. శరీరాలు అతుక్కుని జన్మించే పిల్లలను సయామీ కవలలు అంటారు.

ప్రతి ఊరికి ఏదో ఒక ప్రత్యేకత ఉన్నట్లే.. ఆ ఊరికీ ఓ ప్రత్యేకత ఉంది. అది మామూలు ప్రత్యేక ఏమీ కాదు. చాలా అద్భుతమైన, ఆశ్చర్యకరమైన ప్రత్యేకత. ఆ ఊరే ఖమ్మం జిల్లాలోని రఘునాథపాలెం మండలంలోని వేపకుంట్ల. ఆ ప్రత్యేకతే.. కవలల గ్రామం. అవును.. ఆ గ్రామంలో ఏకంగా తొమ్మిది మంది జంట కవలలున్నారు. అందులో ఓ మహిళ రెండు కాన్పుల్లోనూ కవలలే జన్మించారు. సాధారణంగా ఇద్దరు వ్యక్తులు ఒకే ముఖచిత్రంతో కనిపిస్తే చిత్రంగా అనిపిస్తుంది. అంతేకాదు.. ఆశ్చర్యంగా వాళ్లనే చూస్తూ ఉండిపోతాం. కానీ వేపకుంట్ల గ్రామస్తులకు ఈ దృశ్యం నిత్యం ఎదురవుతూనే ఉంటుంది. ఏదో ఒక సందర్భంలో కవలలు నిత్యం గ్రామంలో కనిపిస్తూనే ఉంటారు. కవలల్లో ఒక సోదరుడు కన్పించిన కొద్ది సేపటికే మరో సోదరుడు కన్పిస్తే అక్కడున్న వారందరూ ఆశ్చర్యపోతుంటారు. వాళ్లలో ప్రత్యేకంగా అన్న ఎవరో, తమ్ముడు ఎవరో కచ్చితంగా తెలుసుకోలేక తికమకపడుతుంటారు.

వేదాలలో అశ్వినీ దేవతలు. రామాయణంలో సీతారాముల కుమారులు లవుడు,కుశుడు. మహాభారతంలో పాండురాజు మాద్రి కుమారులు నకులుడు, సహదేవుడు కవలలే. ఆధునిక కాలంలో ఆర్కాటు రామస్వామి ముదలియర్, ఆర్కాటు లక్ష్మణస్వామి ముదలియర్, ఆస్ట్రేలియా క్రికెట్ క్రీడాకారులు స్టీవ్ వామార్క్ వా కూడా కవలలే.



సుధాకర్.ఏ.వి
రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు
స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ (STUTS)
9000674747



## వైసీపీని కట్టడి చెయ్యడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందా!

ప్రభుత్వం సకాలంలో సమర్ధమైన చర్యలు తీసుకోకపోతే ప్రతిపక్షానికి ఏవిధంగా అవకాశం లభిస్తుందో అర్థం చేసుకోవడానికి మండలిలో కల్తీ నెయ్యిపై వైసీపీ చేస్తున్న వాదనలు, హడావుడే చక్కటి నిదర్శనం. కల్తీ నెయ్యి వ్యవహారాన్ని కూటమి ప్రభుత్వం ఆషామాషీగా తీసుకోవడం వల్ల కావచ్చు. లేదా ఈ వివాదం ద్వారా రాజకీయ మైలేజ్ లభిస్తుంది కదా అనే ఆశతో కావచ్చు లేదా సిట్ విచారణ నత్తనడకన సాగుతుండటం వలన కావచ్చు. కారణాలు ఏవైనప్పటికీ కల్తీ నెయ్యి వ్యవహారం కూటమి ప్రభుత్వం చేతికి కూడా అంటుకుంది. ఇలాగే వ్యవహరిస్తుంటే రేపు సిఎం చంద్రబాబు నాయుడే స్వయంగా హెరిటేజ్ సంస్థలో కల్తీ నెయ్యి తయారు చేయించి టిటిడీకి సరఫరా చేస్తున్నారని వైసీపీ ప్రజలను నమ్మించినా ఆశ్చర్యం లేదు. ఈ కల్తీ నెయ్యి వ్యవహారంలో అడ్డంగా దొరికిపోయినా కూడా వైసీపీ ఇంత తేలికగా బయటపడగలిగింది. తిరిగి చంద్రబాబు నాయుడునే నిందిస్తూ ప్రజల ముందు దోషిగా నిలబెట్టే ప్రయత్నం చేస్తోందంటే తప్పు ఎవరిది? ఈ కల్తీ నెయ్యి వ్యవహారాన్ని మలుపు తిప్పింది సీబీఐసిట్ నివేదిక. దానిని వైసీపీ చాలా తెలివిగా, చురుకుగా అందిపుచ్చుకొని బాణాలు సందిస్తుంటే, కూటమి నేతలు కౌరవ సైన్యంలో అతిరధ మహారధులు నిశ్చేష్టులవుతున్నారు. మండలిలో వైసీపీ దాడిని వారు తిప్పి కొడుతున్నారు. కానీ జగన్మోహన్ రెడ్డి తాడేపల్లి ప్యాలస్‌లో నుంచి కాలు బయట పెట్టకుండా రోజుకో కొత్త వ్యూహం రూపొందించి మండలిలో కూటమి నేతలను ముప్పతిప్పలు పెడుతున్నారు కదా? మొన్న హెరిటేజ్ చీజ్ ప్యాకెట్ చూపి సిఎం చంద్రబాబు నాయుడుని నిలదీసిన వైసీపీ సభ్యులు నేడు తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి చిత్రపటాలతో వచ్చి స్వామివారికే అపచారం చేస్తారా? అంటూ నిలదీస్తున్నారు. స్వామివారి ప్రసాదం, పరకామణి కానుకలు, శాలువాలు, అన్య మత ప్రచారం ఇలా లెక్కలేనన్ని అపచారాలు చేసింది చాలక నేడు స్వామివారి చిత్రపటాలతో మండలికి వచ్చి రాజకీయాలు కూడా చేస్తున్నారంటే లోపం ఎవరిది? వైసీపీ ఎప్పటికప్పుడు ఇలా కొత్తకొత్త వ్యూహాలతో వచ్చి దాడి చేస్తుంటే, వారిని ఎదుర్కోవడానికే కూటమి సభ్యులకు సరిపోతోంది తప్ప వారిని దోషులుగా నిరూపించలేకపోతున్నారు. కనుక బాబాయ్ చావుకు సిఎం చంద్రబాబు నాయుడే కారణమని చెప్తున్నవారు కల్తీ నెయ్యికి సిఎం చంద్రబాబు నాయుడు కారణమని చెప్తే ఆశ్చర్యం ఏముంది?

- కనపర్తి రవి, రైటర్


# మానసిక ఒత్తిడి ఎక్కువైతే శరీరంలో జరిగే మార్పులు ఇవే

ఇపుడున్న రోజువారి పని ఒత్తిడిలో మనల్ని మనం చాలా ఒత్తిడిలోకి నెట్టేసుకుంటూ ఉంటాం. పని నుంచి సాంసారిక బంధాల వరకూ ఏదైనా కూడా ఒత్తిడికి కారణం కావొచ్చు. ప్రస్తుతం ఒత్తిడి అనేది జీవితంలో ఒక భాగమైపోయింది. దీనికి శరీరం డిఫరెంట్ వేస్‌లో రియాక్ట్ అవుతుంది. కొందరిలో హార్ట్ వేగంగా కొట్టుకుంటే.. మరికొందరు నిద్రలేని రాత్రులు గడుపుతుంటారు. ఈ లిస్ట్‌లోనే చేరిపోయింది చర్మంపై దద్దుర్ల సమస్య. స్ట్రెస్ కారణంగా వచ్చే దురద అసౌకర్యంగా ఉండటంతోపాటు మానసికంగా కుంగదీస్తుంది. అసలు ఇలా ఎందుకు జరుగుతుంది?

### స్ట్రెస్ అండ్ స్కిన్ రియాక్షన్ మధ్య సంబంధం ఏంటి?

ఒత్తిడి వల్ల శరీరంలో కార్టిసాల్, అడ్రినలిన్ సహా వివిధ రసాయనాలు, హార్మోన్లు విడుదలవుతాయి. ఈ బాడీ రియాక్షన్స్ రోగనిరోధక వ్యవస్థతోపాటు ఇతర శారీరక విధులను ప్రభావితం చేస్తాయి.ఈ పరిస్థితి కొన్నిసార్లు స్కిన్ అలెర్జీకి దారితీస్తుంది. అంటే కెమికల్స్ రిలీజ్ చేయడం ద్వారా ముప్పును ఎదుర్కోవడానికి శరీరం సిద్ధమవుతుందన్న మాట. ఇమ్యూనిటీ సిస్టమ్ స్వయంగా దాడి చేయడం వల్ల చర్మగ్రంధులు మూసుకుపోయి మొటిమలు మొదలువతాయి. ఒత్తిడి కారణంగా నిద్ర కరవై కళ్ల కింద నల్లటి మచ్చలు ఏర్పడతాయి. ఒత్తిడి తీవ్రత పెరిగితే చర్మం కింద ఉండే గ్రందులు, ప్రోటీన్ల పనితీరు దెబ్బతింటుంది. ఫలితంగా చర్మం పొడిబారిపోవడం, దురద, దద్దుర్లు వస్తాయి. ఇది ఇలాగే కొనసాగితే.. ఎగ్జిమా, సోరియాసిస్ వంటి చర్మ వ్యాధులు సైతం సోకుతాయి. ఒత్తిడిలో ఉన్నప్పుడు చర్మంపై ఎవరూ పెద్దగా శ్రద్ధ పెట్టరు.

### పరిష్కారమేంటి?



**ఏం తినాలి?**

**మీకు చర్మంపై దద్దుర్లు, దురద వేధిస్తూ ఉన్నప్పుడు ఉప్పు అధికంగా ఉండే ఆహారాలను తగ్గించాలి. ఎందుకంటే ఆ చర్మం పై వచ్చిన సమస్యలు సాధారణంగా వచ్చినవో లేక మూత్రపిండాల వ్యాధి కారణంగా వచ్చినవో తెలియదు. ఒకవేళ మూత్రపిండాల వ్యాధి కారణంగా వచ్చినవే అయితే ఉప్పు తీసుకోవడం ప్రమాదకరం. అలాగే ప్రాసెస్డ్ ఫుడ్లు తినడం మానేయాలి. ప్రోటీన్ అధికంగా ఉండే ఆహారాలను తినకూడదు. కుటుంబంలో ఎవరికైనా కిడ్నీ సమస్యలు ఉంటే, అవి వారసత్వంగా వచ్చే అవకాశం ఉంది. అలాంటివారు పొటాషియం ఎక్కువగా ఉండే ఆహారాన్ని కూడా ఎంచుకోకూడదు. వైద్యుడిని కలిపి ఆహార పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలుసుకోవాలి.**

ఒత్తిడికి గురికావడం సహజం. ఇందుకు అనేక కారణాలుండొచ్చు. అయితే, ఒత్తిడి చర్మంపై ప్రభావం చూపుతుందన్న విషయం గుర్తుంచుకొని దాన్ని తగ్గించుకునే ప్రయత్నం చేయాలి. ఒత్తిడి తగ్గాలంటే అనవసర ఆలోచనలపై మనసు వెళ్లకుండా మీకు నచ్చిన పనులుపై దృష్టి పెట్టాలి. రోజుకు రెండు, మూడు సార్లు నీళ్లతో ముఖం కడుక్కోవాలి. శరీరం పొడిబారకుండా మాయిశ్చరైజర్లు వాడాలి. ఫ్రై, స్పైసీ ఆహారానికి దూరంగా ఉండాలి. విటమిన్ ఇ, సీ చర్మానికి ఎంతో అవసరం కాబట్టి.. ఈ విటమిన్లు ఉన్న క్రీమ్స్ చర్మానికి రాసుకున్నా.. ఆహార పదార్థాలు తిన్నా సరిపోతుంది. ముఖ్యంగా చర్మం నిర్జలీకరణం కాకుండా ఉండాలి. ఇందుకోసం వీలైనంత ఎక్కువగా నీరు తాగాలి లేదా ద్రవరూప పదార్థాలు తీసుకోవాలి.

### దద్దుర్లు దురద కొన్నిసార్లు అది మూత్రపిండాల వ్యాధికి కూడా సంకేతం ఉండచ్చు..

మూత్రపిండాల వ్యాధి బారిన పడిన వ్యక్తి చర్మంపై దద్దుర్లు వచ్చి పొడిబారిపోతుంది. దురద కూడా ఎక్కువగా పెడుతుంది. ఇలా కావడానికి కారణం శరీరంలో మూత్రస్థాయిలు ఎక్కువగా ఉండడం. డయాలసిస్ పై ఉన్న రోగులు తరచూ తమకు చర్మంపై దురద కలుగుతున్నట్టు ఫిర్యాదు చేస్తూ ఉంటారు. దీని ప్రకారం రోగికి కారణం లేకుండా చర్మం పై దద్దుర్లు, దురద వస్తూ ఉంటే మూత్రపిండ పరీక్ష చేయించుకోవడం ఉత్తమం. బయటికి కనిపించకపోయినా ఆ చర్మ సమస్యకు అంతర్లీనంగా దీర్ఘకాలిక మూత్రపిండవ్యాధి తప్ప మరొకటి కారణం అయ్యే అవకాశం ఉండదు.

### చికిత్స..

మూత్రపిండాల వ్యాధి కారణంగా ఇలాంటి చర్మ సమస్యలు మొదలైతే వాటికి చికిత్స చేయడం కొంత కష్టమే. ఎందుకంటే అంతర్లీనంగా ఉన్న దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధికి చికిత్స చేసి దాన్ని నయం చేస్తే తప్ప ఈ చర్మ సమస్యలు రావడం తగ్గదు. కిడ్నీ ఆరోగ్యం మెరుగైతే చర్మం కూడా తదనగుణంగా దురదను దద్దుర్లను తగ్గించుకుంటుంది. లేకుంటే ఎలాంటి క్రీములు రాసినా కూడా ఫలితం ఉండదు.



డా.కౌశల్ గోవర్ధన
ఎం.బి.బి.ఎస్, (ఎం.డి, ఇంటర్నల్ మెడిసిన్)
వైస్ చైర్మన్
శ్రీ రామానుజ సేవా ట్రస్ట్,
డా.ధనుంజయ హాస్పిటల్, హైదరాబాద్

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
22.02.2026 ఆదివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews
5
దక్షిణ తెలంగాణ
హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్
Hyderabad, Rangareddy, Mahabubnagar

ఇండియాలో టాప్ 10 హీరోలు
ఆమిర్ ఖాన్
'పర్ఫెక్షనిస్ట్'గా ప్రతి సినిమా కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటాడు. కథా వైవిధ్యంతో సామాజిక సందేశాలు అందిస్తాడు.


# సద్గురు ఆశయాలను కొనసాగిద్దాం : ఎమ్మెల్యే

**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి :**



సంత్ సద్గురు సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి సందర్భంగా మహబూబ్‌నగర్ నగరంలోని అయ్యప్ప కొండ, పద్మావతి కాలనీలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి, సేవాలాల్ మహారాజ్ విగ్రహానికి పూలమాల వేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సేవాలాల్ మహారాజ్ గిరిజన, బంజారా సమాజానికి మార్గదర్శకునిగా నిలిచారన్నారు. సమాజంలో నైతిక విలువలు, సేవాభావం, ఐక్యత, సామరస్యం, ధర్మబద్ధత వంటి సద్గుణాలను పెంపొందించడానికి చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. సేవాలాల్ మహారాజ్ జీవితం నుంచి యువత స్ఫూర్తి పొంది సమాజ అభ్యున్నతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. బలహీన వర్గాల అభివృద్ధి, విద్యా ప్రోత్సాహం, సామాజిక సమానత్వం వంటి అంశాలు సేవాలాల్ మహారాజ్ ఆశయాల్లో కీలకమని, ఆ దిశగా ప్రభుత్వం, స్థానిక ప్రజాప్రతినిధులు కట్టుబడి ఉన్నారన్నారు. అంతకుముందు ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ విద్యుత్ దీపాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ కార్పొరేషన్ మేయర్ మమత, డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, కార్పొరేటర్లు సువర్ణ, దేప్లీ, సీబీ పూజిత, నాయకులు శేఖర్ నాయక్, ఆర్.శేఖర్ నాయక్, అంతిరాం నాయక్, ప్రతాప్, తిరుపతి నాయక్, రఘురామిరెడ్డి, ఆనంద్ కుమార్, అనిల్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలు ప్రారంభం

**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి :**



మహబూబ్‌నగర్ పట్టణంలోని క్రీడా మైదానంలోని ఇండోర్ స్టేడియంలో 2వ ఎడిషన్ రాష్ట్ర స్థాయి సీఎం కప్2025 పోటీలు (బాక్సింగ్ & నెట్ బాల్) ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు,ప్రభుత్వ సలహాదారు(క్రీడలు) ఏపి జితేందర్ రెడ్డి, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏపి మిథున్ రెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా జితేందర్ రెడ్డి మాట్లాడుతూ.. క్రీడలు కేవలం శారీరక దృఢత్వానికే పరిమితం కాకుండా, మానసిక స్థైర్యం, నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, సమయపాలన, సహనశక్తి వంటి విలువలను పెంపొందించే సాధనమని తెలిపారు. రాష్ట్ర స్థాయి సీఎం కప్ 2025 పోటీలు యువ క్రీడాకారులకు తమ ప్రతిభను ప్రదర్శించుకునే గొప్ప వేదికగా నిలుస్తాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అపారమైన ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉన్నారని, వారికి సరైన మార్గదర్శకత్వం,ప్రోత్సాహం లభిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మహబూబ్‌నగర్ జిల్లా పేరును గర్వంగా నిలబెట్టగలరన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్ల రెడ్డి, ప్రతాప్ రెడ్డి, ధనుంజయ్ గౌడ్, నర్సింహులు, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత, గోపాల్ యాదవ్, చిన్న వీరయ్య, డివైఎస్ఓ శ్రీనివాస్, క్రీడా అధికారులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# జ్ఞానసంపద పెంచుకుంటేనే భవిష్యత్

- విద్యార్థులు కొత్త ఆలోచనలతో ముందుకు సాగాలి
- కలెక్టర్ హరిచందన దాసరి

**ముద్ర, హైదరాబాద్ :**






విద్యార్థులు నిరంతర జ్ఞానసంపద పెంచుకుంటే భవిష్యత్తులో ఉత్తమ పౌరులుగా ఎదుగుతారని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి అన్నారు. అంశాలపై విశ్లేషణ, ప్రశ్నించే తత్త్వం అలవర్చుకోవాలని సూచించారు. కొత్త ఆలోచనలు, ఆవిష్కరణలతో జీవితంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. శనివారం అబిడ్స్ లోని స్టాన్లీ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రపంచ ఆలోచనా దినోత్సవం (వరల్డ్ థింకింగ్ డే)లో కలెక్టర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతియేటా ఫిబ్రవరి 22న స్కౌట్ ఉద్యమం స్థాపకుడు లార్డ్ రాబర్ట్ స్టీఫెన్సన్ స్మిత్ బాడెన్ పోవెల్ జన్మదినం రోజును ప్రపంచ ఆలోచన దినోత్సవంగా జరుపుకుంటామన్నారు. మానవ జీవనశైలిలో ఆలోచన అత్యవసరమైన నైపుణ్యమని తెలుపుతూ చదువుతోపాటు, శారీరక, మానసిక, సామాజిక సర్వతోముఖాభివృద్ధి ఎంతో ముఖ్యమన్నారు. క్రమశిక్షణ, నాయకత్వం, ఐక్యత, సమాజసేవ వంటి విలువలను పెంచేదిశగా స్కౌట్స్ అండ్ గైడ్స్ సంస్థ చేస్తున్న కృషిని అభినందించారు. ఇలాంటి కార్యక్రమాల్లో ఎక్కువ మంది విద్యార్థులు చేరేలా చూడాలని ప్రిన్సిపాల్ కు సూచిస్తూ విద్యార్థులు తమ స్నేహితులను పాల్గొనేలా ప్రేరేపించాలని ప్రోత్సహించాలన్నారు. అనంతరం వివిధ పోటీల్లో పాల్గొన్న విజేతలకు కలెక్టర్ మెమెంటోలు అందించి ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆర్గనైజర్, స్కౌట్ మాస్టర్ రాములు నాయక్, వివిధ పాఠశాలల స్కౌట్ మాస్టర్లు, స్కౌట్ విద్యార్థులు పాల్గొన్నారు.

# యథావిధిగా ప్రజావాణి కార్యక్రమం

**ముద్ర, ఉమ్మడిరంగారెడ్డి జిల్లా ప్రతినిధి :**

ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ఈనెల 23వ తేదీ (సోమవారం) నుంచి యథావిధిగా నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉండడం వల్ల ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేయడం జరిగిందన్నారు. ప్రస్తుత మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ ముగిసినందున ప్రజావాణి కార్యక్రమం తిరిగి యథావిధిగా కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు.






# పార్టీ బలోపేతానికి కార్యకర్తలకు శిక్షణ కీలకం

- సంఘటన సృజన్ అభియాన్ సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**

పార్టీ బలోపేతానికి కార్యకర్తలకు శిక్షణ అత్యంత అవసరమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. శనివారం వికారాబాద్ అనంతగిరిలో ఏపీ, తెలంగాణ డిసిసి అధ్యక్షులకు పది రోజుల శిక్షణా శిబిరం ప్రారంబాన్ని ఆయన ప్రారంభించారు. "సంఘటన సృజన్ అభియాన్" కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల జిల్లా కాంగ్రెస్ కమిటీ డిసిసి అధ్యక్షుల కోసం నిర్వహిస్తున్న పది రోజుల ప్రత్యేక శిక్షణా శిబిరం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఎం రేవంత్ రెడ్డి హాజరయ్యారు. టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, సీడబ్ల్యూసీ సభ్యులు చల్లా వంశీ చందర్ రెడ్డి, ఏఐసీసీ ఇన్చార్జి కార్యదర్శి సచిన్ సావంత్, మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కేడర్ శిక్షణ అత్యంత అవసరమని తెలిపారు. జిల్లా అధ్యక్షులు పార్టీ సిద్ధాంతాలను గ్రామస్థాయికి తీసుకెళ్లే వారధులని, ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను సమర్థంగా ప్రజలకు చేరవేయడంలో కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ "సంఘటన సృజన్" కార్యక్రమం కాంగ్రెస్ పార్టీకి నూతన దిశా నిర్దేశం చేస్తుందన్నారు. సమన్వయం, క్రమశిక్షణ, కార్యాచరణతో ముందుకు సాగితేనే పార్టీ మరింత బలపడుతుందన్నారు. ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మాట్లాడుతూ.. రెండు రాష్ట్రాల కాంగ్రెస్ నేతలు పరస్పర అనుభవాలను పంచుకుంటూ బలమైన సంస్థాగత నిర్మాణం దిశగా కృషి చేయాలని సూచించారు. సంఘటన సృజన్ ప్రోగ్రామ్ చైర్మన్ ఆధ్వర్యంలో, ఆర్గనైజింగ్ సెక్రటరీ వంశీ చందర్ రెడ్డి, చైర్మన్ ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి నేతృత్వంలో ఈ శిక్షణా శిబిరం నిర్వహించబడుతోంది. పది రోజులపాటు జరిగే ఈ శిబిరంలో నాయకత్వ నైపుణ్యాలు, ప్రజా సమస్యల పరిష్కార విధానాలు, ఎన్నికల వ్యూహాలు, మీడియా నిర్వహణ తదితర అంశాలపై సమగ్ర శిక్షణ అందించనున్నారు. ఈ శిబిరం ద్వారా ఏపీ, తెలంగాణ కాంగ్రెస్ సంస్థాగతంగా మరింత పటిష్టమవుతుందని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# బిజ్వార్ జడ్పీహెచ్ఎస్‌కు రూ.40లక్షల బస్సు విరాళం

- స్వామీజీ సేవను కొనియాడిన కలెక్టర్ సిక్త పట్నాయక్

**ముద్ర, నారాయణపేట :**



ఉట్కూరు మండలం బిజ్వార్ గ్రామంలోని అంబాత్రయ క్షేత్రం వ్యవస్థాపకులు శ్రీ శ్రీ ఆదిత్య పరాశ్రీ స్వామీజీ తమ సేవా దృక్పథాన్ని చాటుకున్నారు. గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం రూ.40లక్షల వ్యయంతో పాఠశాల బస్సును ఉచితంగా అందజేశారు. శనివారం జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ సిక్త పట్నాయక్ బస్సును స్వామీజీతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. దూర ప్రాంత గ్రామాల నుంచి పాఠశాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్న విద్యార్థులకు ఈ రవాణా సౌకర్యం ఎంతో ఉపయోగకరంగా నిలుస్తుందన్నారు. మండలంలోని కొత్తపల్లి, పాతపల్లి, మొగ్దుంపూర్ గ్రామాలకు చెందిన మొత్తం 63మంది విద్యార్థులు ఈ బస్సు ద్వారా ప్రత్యక్ష లబ్ధి పొందనున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులకు విద్య అందుబాటులో ఉండేందుకు రవాణా సౌకర్యం కీలకమని చెప్పారు. స్వామీజీ మాట్లాడుతూ.. తాను చిన్నప్పుడు ఇదే పాఠశాలలో చదువుకున్నానని, ఆ పాఠశాల పట్ల ఉన్న కృతజ్ఞతాభావంతోనే ఈ బస్సు సేవను ప్రారంభించానన్నారు. తాను చేసింది సేవ కాదని, బాధ్యతగా భావించానని చెప్పారు. తాను చదువుకునే రోజుల్లో ఇంటి పనులు ముగించుకుని ఆలస్యంగా పాఠశాలకు వచ్చేవాడినని, అలాంటప్పుడు పక్క గ్రామాల నుంచి విద్యార్థులు నడుచుకుంటూ రావడం ఎంత కష్టమో తనకు తెలుసని అన్నారు. ప్రతిరోజూ ఆశ్రమం ముందు నుంచి విద్యార్థులు నడుచుకుంటూ వెళ్లడం చూసి కలిగిన బాధతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈవో గోవిందరాజులు, ఆర్డీవో మేఘా గాంధీ, తహసీల్దార్ చింత రవి, ఎంపీడీవో కిషోర్ కుమార్, ఆయా గ్రామాల సర్పంచులు అంజయ్య, నర్సిములు, తిరుమలేష్, పాఠశాల హెచ్ఎం కిషోర్ కుమార్, తపస్ జిల్లా అధ్యక్షుడు నరసింహ, నాయకులు శేర్ కృష్ణారెడ్డి, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



# అదనపు కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన ప్రతిమా సింగ్

**ముద్ర, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రతినిధి :**

రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ గా(స్థానిక సంస్థలు) ప్రతిమా సింగ్ శుక్రవారం తిరిగి బాధ్యతలు స్వీకరించారు. రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ గా కొనసాగిన ప్రతిమాసింగ్ ప్రసూతి సెలవులపై వెళ్లారు. ఈ సెలవులు ముగియడంతో ఆమె శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్ గా(స్థానిక సంస్థలు) బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ప్రతిమా సింగ్ ను పలువురు అధికారులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

# ప్రజల విశ్వాసానికి తగిన పరిపాలన అందించాలి

- కలెక్టర్ సిక్త పట్నాయక్

**ముద్ర, నారాయణపేట :**



నూతనంగా ఎన్నికైన సర్పంచులు ప్రజల అంచనాలకు అనుగుణంగా గ్రామ పరిపాలన అందించాలని కలెక్టర్ సిక్త పట్నాయక్ సూచించారు. శనివారం జిల్లా కేంద్రానికి సమీపంలోని సింగారం మలుపు దారి వద్ద ఉన్న వృత్తి నైపుణ్య శిక్షణా కేంద్రంలో నిర్వహించిన సర్పంచుల మూడవ, నాల్గవ విడత శిక్షణా కార్యక్రమం ముగింపులో ఆమె పాల్గొని మాట్లాడారు. గతేడాది డిసెంబర్ 17నాటికి జిల్లాలో మూడు విడతల్లో సర్పంచుల ఎన్నికలు పూర్తయ్యాయని తెలిపారు. వేసవి, వర్షాకాలాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తాగునీటి సమస్యలు వంటి అంశాలపై పూర్తి అవగాహనతో పని చేయాలని సూచించారు. శిక్షణలో నేర్చుకున్న విషయాలను కార్యాచరణలో అమలు చేయాలని అన్నారు. గ్రామాల్లో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి చెత్త నిల్వ ప్రాంగణానికి తరలించాలని, పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న పనులను పర్యవేక్షిస్తూ హాజరయ్యే కూలీల వివరాలు తెలుసుకోవాలని తెలిపారు. బాల్యవివాహాల నిర్మూలనలో సర్పంచులు ముందుండాలని పిలుపునిచ్చారు. ఎస్పీ వినీత్ కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణలో సర్పంచుల పాత్ర అత్యంత కీలకమన్నారు. గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. బాల్య వివాహాలను పూర్తిగా అరికట్టడంలో గ్రామ నాయకత్వం చురుకుగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమం అనంతరం సర్పంచులకు ధృవపత్రాలు అందజేశారు.



# సీఎంను కలిసిన మున్సిపల్ చైర్ పర్సన్, కౌన్సిలర్లు

**ముద్ర, తాండూర్ :**

వికారాబాద్ జిల్లాలోని హరిత రిసార్టులో ఉభయ రాష్ట్రాల డీసీసీ అధ్యక్షుల సంఘటన సృజన్ అభియాన్ శిక్షణ కార్యక్రమ శిబిరానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఎం రేవంత్ రెడ్డిని తాండూర్ నేతలు కలిశారు. ఈ కార్యక్రమానికి తాండూర్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో తాండూరు చైర్పర్సన్ పట్లోళ్ల నీరజ బాల్రెడ్డి, వైస్ చైర్ పర్సన్ అబ్దుల్ రజాక్, వార్డ్ కౌన్సిలర్లు మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మాట్లాడుతూ తాండూర్ ప్రాంత అభివృద్ధికి సహకరించాలని ముఖ్యంగా రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, మౌలిక సదుపాయాల కల్పన తదితర సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. అందుకు సీఎం సానుకూలంగా స్పందిస్తూ తన సహాయ సహకారాలు ఉంటాయని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్లు, పార్టీ ముఖ్య నేతలు తదితరులు ఉన్నారు.

# కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన

**ముద్ర, శేరిలింగంపల్లి :**




గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని సాయి వైభవ్ కాలనీలో రూ.20లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఎస్‌డీఎఫ్ నిధులతో చేపట్టనున్న ఈ నిర్మాణానికి పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ముఖ్య అతిథిగా హాజరై, మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి భూమి పూజ చేశారు. ఈసందర్భంగా పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం జరగడం సంతోషకరమని తెలిపారు. హాల్ నిర్మాణం పూర్తయితే కాలనీ వాసులు చిన్న సమావేశాలు, సభలు, జన్మదిన వేడుకలు వంటి కార్యక్రమాలు సౌకర్యవంతంగా నిర్వహించుకోవచ్చన్నారు. నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ ఎక్కడా రాజీ పడకుండా అన్ని సౌకర్యాలతో హాల్‌ను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను సూచించారు. కాలనీ అభివృద్ధికి తనవంతు కృషి కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, కాలనీ వాసులు పద్మ, సుజిత్, శ్రీనివాస్, సత్యనారాయణ, పవన్, సిద్ధార్థ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

**విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ..**

హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని నిజాంపేట్ రోడ్డులో ఉన్న జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో క్షత్రియ యువజన సమాఖ్య ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు పరీక్షల సన్నద్ధత కోసం అవసరమైన సామగ్రిని పంపిణీ చేశారు. పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ, మాజీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావుతో కలిసి జ్యామితి పెట్టె, రాయడానికి పలక, కలాలు తదితర సామగ్రిని విద్యార్థులకు అందజేశారు. ఈసందర్భంగా చైర్మన్ గాంధీ మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య సంగ్రామంలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడిన మహనీయుడు అల్లూరి సీతారామ రాజు అని కొనియాడారు. విద్యార్థులు అందించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని క్రమశిక్షణతో చదివి మంచి ఫలితాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సాయి కుమార్, క్షత్రియ సేవ సమితి అధ్యక్షుడు సుధీర్ వర్మ, ఉపాధ్యక్షుడు సురేష్ వర్మ, సంయుక్త కార్యదర్శి చైతన్య వర్మ, సభ్యులు రవితేజ వర్మ, యశ్వంత్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

**ఇండియాలో టాప్ 10 హీరోలు**



ప్రభాస్
'బాహుబలి'తో పాన్ ఇండియా స్టార్‌గా ఎదిగాడు. భారీ బడ్జెట్ సినిమాల్లో తన స్టైల్‌తో ఆకట్టుకుంటాడు.



# గల్ఫ్ వలస కార్మికుల సంక్షేమానికి చర్యలు

- **ఎన్ఆర్ఐ అడ్వైజరీ కమిటీ చైర్మన్ వినోద్ కుమార్**

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**

ఉపాధి కోసం వెళ్లిన గల్ఫ్ వలస కార్మికుల సంక్షేమానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎన్ఆర్ఐ అడ్వైజరీ కమిటీ చైర్మన్ బి.ఎం వినోద్ కుమార్ పేర్కొన్నారు. ఎన్ఆర్ఐ అడ్వైజరీ కమిటీ, గల్ఫ్ ఎన్ఆర్ఐ పాలసీ రూపకల్పనకు సంబంధించి సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో వినోద్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రం నుంచి వివిధ గల్ఫ్ దేశాలకు వలస వెళ్తున్న కార్మికుల సంక్షేమం కొరకు ప్రభుత్వం సమగ్ర ఎన్ఆర్ఐ పాలసీని రూపొందించేందుకు కృషి చేస్తోందన్నారు. ఇందులో భాగంగా తమ కమిటీ నిర్మల్ జిల్లాలో పర్యటించిందని తెలిపారు. గల్ఫ్ దేశాలకు వలస వెళ్తున్న కార్మికులకు విధివిధానాలు ఎలా రూపొందించాలన్న విషయంపై క్షేత్రస్థాయిలో సమగ్రంగా తెలుసుకునేందుకు ఈ కమిటీ కృషి చేస్తుందని అన్నారు. గల్ఫ్ వలస కార్మికులు, వారి కుటుంబాలతో వివరాలు తెలుసుకునేందుకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు. జిల్లా నుంచి గల్ఫ్ దేశాలకు వలసలు అధికంగా ఉన్నాయని, గల్ఫ్ దేశాలకు వెళ్లే కార్మికులకు ఆయా దేశాల చట్టాలు, కార్మిక చట్టాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందనన్నారు. లైసెన్సు ఉన్న ఏజెన్సీల ద్వారానే కార్మికులు విదేశాలకు వెళ్లేలా చొరవ తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రభుత్వ పక్షాన 'టామ్ కామ్' ద్వారా కార్మికులకు విదేశాలలో ఉపాధి అవకాశాలు కల్పించబడతాయన్నారు. ఐతే దీనిపై గ్రామీణ స్థాయిలో విస్తృత అవగాహన అవసరమని అభిప్రాయపడ్డారు. గల్ఫ్ దేశాలలో సమస్యల్లో చిక్కుకున్న కార్మికులకు సహాయ సహకారాలు అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అన్నారు. జిల్లాలో గల్ఫ్ కార్మికుల కోసం హెల్ప్ లైన్ ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఎన్ఆర్ఐ అడ్వైజరీ కమిటీ వైస్ చైర్మన్ మంద భీమ్ రెడ్డి, సభ్యులు చెన్నమనేని శ్రీనివాసరావు, సింగిరెడ్డి నరేష్‌రెడ్డి, స్వదేశ్ పరికిపండ్ల, ఏఎస్పీ ఉపేంద్ర రెడ్డి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక న్యాయం కోసమే చట్టాలు

- **డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ తనకు మహేష్**

**ముద్ర, కరీంనగర్:**




సామాజిక న్యాయం అందించేందు కోసమే చట్టాలు ఉన్నాయని డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ తనకు మహేష్ పేర్కొన్నారు. ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం సందర్భంగా శనివారం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి ఆదేశాల మేరకు కరీంనగర్ లోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తనకు మహేష్ మాట్లాడుతూ లింగ, ధనిక, పేద, మత ఏ ఇతర వాటితో సంబంధం లేకుండా అందరికీ సామాజిక న్యాయం అందించేలా చట్టాలు రూపొందించబడ్డాయని, చట్టం ముందు అందరూ సమానులే అని తెలిపారు. న్యాయవాదిని నియమించుకునే ఆర్థిక స్తోమత లేని వారికి ఉచిత న్యాయ సహాయం అందించేందుకు జాతీయ న్యాయ సేవాధికార సంస్థ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం ద్వారా న్యాయసహాయం అందిస్తుందని తెలిపారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. చట్టపరమైన సమస్య పైన, సలహాల కోసం టోల్ ఫ్రీ నెంబర్ 15100 ను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో షీ టీం పోలీస్ కానిస్టేబుల్స్ స్వప్న, కళాశాల వైస్ ప్రిన్సిపల్ అరుణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# డిగ్రీ విద్యార్థుల క్షేత్ర పర్యటన

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**

జిజ్ఞాస కార్యక్రమంలో భాగంగా నిర్మల్ డిగ్రీ కళాశాల విద్యార్థులు శనివారం క్షేత్ర పర్యటన చేశారు. ప్రిన్సిపాల్ సుధాకర్ ఆధ్వర్యంలో అధ్యాపకుడు వెంకట్ రెడ్డితో కలిసి కలెక్టరేట్ లో ఉన్న లీడ్ బ్యాంక్ లో పర్యటించారు. మేనేజర్ రామ్ గోపాల్ ను కలిసి బ్యాంకింగ్ కార్యకలాపాలపై సందేహాలను నివృత్తి చేసుకున్నారు. బ్యాంకింగ్ కార్యకలాపాలను అనుసంధానం చేయటంపై వివరాలు సేకరించారు.



# రాష్ట్ర స్థాయి తైక్వాండ్ పోటీల్లో జిల్లాకు కాంస్య పతకాలు

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**

రాష్ట్రస్థాయి తైక్వాండో సీఎం కప్ పోటీల్లో శనివారం నిర్మల్ జిల్లా క్రీడాకారులు ప్రతిభను చాటారు. జిల్లాకు చెందిన నేహాల్, శ్రీయాంశ్, జోయా ప్రతిభను చాటి కాంస్య పతకాలు సాధించారు. తైక్వాండో కోచ్ వంశీ కృష్ణను, క్రీడాకారులను పలువురు అభినందించారు.

# అంగరంగ వైభవంగా బ్రహ్మోత్సవాలు నిర్వహించాలి

- **భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా చర్యలు తీసుకోవాలి..**
- **ఉత్సవాలు పూర్తయ్యే వరకు జిల్లా అధికారులు అందుబాటులో ఉండాలి..**
- **మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

**ముద్ర, ధర్మపురి:**




బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించాలని, వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై శనివారం రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జిల్లా కలెక్టర్ తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల సందర్భంగా గోదావరి నదిలో పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. తాగునీటి విషయంలో ఎక్కడా ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కల్యాణం జరిగే చోట ఉన్న స్తంభాలను తొలగించాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా రాత్రి, పగలు తేడా లేకుండా ఆర్టీసీ బస్సులు నడిపించాలని అన్నారు. బ్రహ్మోత్సవాలకు అవసరమైన నిధులు సమకూర్చడానికి సిద్ధంగా ఉన్నామని మంత్రి హామీ ఇచ్చారు. బ్రహ్మోత్సవాలు పూర్తయ్యే వరకు జిల్లా అధికారులు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. వచ్చే ఏడాది జరిగే పుష్కరాలకు ప్రభుత్వం ఇప్పటి నుంచే కసరత్తు చేస్తోందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో మేడారం జాతరకు పెద్ద ఎత్తున నిధులు విడుదల చేశారని, గోదావరి పుష్కరాలకు సైతం నిధుల విడుదలకు ప్రణాళిక సిద్ధం చేశామని మంత్రి తెలిపారు. గోదావరి పుష్కరాలను విజయవంతం చేయడానికి సలహాలు, సూచనలు అందించాలని మంత్రి కోరారు. ధర్మపురిలో సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బీఈడీ, డీఈడీ కళాశాల ఏర్పాటు చేస్తానని తెలిపారు. అనంతరం కలెక్టర్ సత్య ప్రసాద్ మాట్లాడుతూ వచ్చే ఏడాది జరిగే పుష్కరాలకు బ్రహ్మోత్సవాలు సెమీ ఫైనల్ గా భావించాలని అన్నారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ధర్మపురి మున్సిపల్ చైర్మన్ వేముల నాగలక్ష్మి మాట్లాడుతూ గోదావరి పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో గెలిచిన కౌన్సిలర్లతో పాటు ఎన్ ఎస్ ఎస్, ఎన్ సీసీ వాలంటీర్ల సేవలు వినియోగించుకోవాలని సూచించారు. బాలింతలు చిన్నారులకు పాలు ఇవ్వడానికి ఫీడింగ్ రూం ఏర్పాటు చేయాలని కోరారు. శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్ మాట్లాడుతూ ఈసారి బ్రహ్మోత్సవాలకు పెద్ద ఎత్తున భక్తులు హాజరవుతారని అన్నారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులు లక్ష మందికి అన్నదానం చేయడానికి వ్యాపారులు ముందుకు వచ్చారని తెలిపారు. తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ 350 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఆలయం, గోదావరి నది తదితర ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తారని తెలిపారు. 70 సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షణ చేస్తామని, షీ టీంతో పాటు ప్రత్యేక పోలీసులు బందోబస్తు నిర్వహిస్తారని ఎస్పీ తెలిపారు. దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుప్రియ మాట్లాడుతూ ధర్మపురి ప్రజలు బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు సహాయం అందిస్తారని ఇదే పద్ధతి కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి మున్సిపల్ కౌన్సిలర్లతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఏసియన్ పెయింట్ డ్రైవర్ల సమ్మెకు.. కరీంనగర్ పట్టణ లారీ డ్రైవర్ల యూనియన్ మద్దతు

**ముద్ర, కరీంనగర్:**




కరీంనగర్ జిల్లా ఏసియన్ పెయింట్ డ్రైవర్స్ యూనియన్ (సిఐటియు) చేపట్టిన సమ్మె శనివారం 5వ రోజుకు చేరింది. శాంతియుతంగా నిర్వహిస్తున్న సమ్మెకు కరీంనగర్ పట్టణ లారీ డ్రైవర్ల యూనియన్ మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా పబ్లిక్ ప్రైవేటు రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పున్నం రవి మాట్లాడుతూ ఏసియన్ పెయింట్ గోదాంలో 10 సంవత్సరాల నుండి పనిచేస్తున్న డ్రైవర్ల పొట్ట కొడుతున్న యాజమాన్యం వెంకట్ లాజిస్టిక్, భూషణం ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీ, ట్రాన్స్‌పోర్టు యజమానికి, వాహనాల ఓనర్లు, డ్రైవర్లకు అగ్రిమెంటు లేకపోవడం సిగ్గుచేటని అన్నారు. వారి సమస్యలు పరిష్కారం అయ్యే వరకు సిఐటియు అండగా ఉంటుందని, వారి సమస్యల పట్ల రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. లేబర్ ఆఫీసు, కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నాలు చేపడతామని హెచ్చరించారు. యాజమాన్యం ప్రోద్బలంతో బయట వాహనాలను అడ్డుకుంటే కేసులు నమోదు చేస్తామని డ్రైవర్లను, యూనియన్ నాయకులను పోలీసులు బెదిరిస్తున్నారని అన్నారు. అసలు ఇక్కడ జరుగుతున్న సమ్మెలో పోలీసుల జోక్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. అనంతరం యూనియన్ అధ్యక్షుడు కామల్ల మహిపాల్ మాట్లాడుతూ ఏషియన్ పెయింట్ గోదాములో 60 మంది డ్రైవర్లు కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని, నాలుగు సంవత్సరాల నుండి మా బాధలు చెబుతున్న పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏదైనా ప్రమాదం జరిగితే మా కుటుంబాలు రోడ్డు పాలవుతున్నాయని, డీలర్ షిప్ యజమాని, ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీ డ్రైవర్లకు ఐదు లక్షల ఇన్సూరెన్స్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి కీసర మల్లేశం, కోశాధికారి ఉత్తమల్ల వెంకటేశ్, ఉపాధ్యక్షుడు వెంకటరెడ్డి, సహాయ కార్యదర్శి మూగ తిరుపతి, లారీ డ్రైవర్స్ యూనియన్ పట్టణ అధ్యక్షుడు ఎండి ఆరిఫ్ మొయినొద్దీన్, ప్రధాన కార్యదర్శి ఎలుకపెల్లి రమేష్, కోశాధికారి సముద్రాల రాజకుమార్, ఉపాధ్యక్షుడు షకీల్ అహ్మద్ హుస్సేన్, దమ్మక్కల నారాయణ, సహ కార్యదర్శి ఎండి అమీన్, జలీల్, భాయ్, రాజు, నజీర్ ఖాన్, వహీద్, సల్లు, జహంగీర్ ఏఎల్ టి మదనయ్య, శర్మ, అజయ్ తదితరులు పాల్గొన్నారు.



# 8 నుంచి రాష్ట్ర స్థాయి కుంగ్ ఫూ, కరాటే పోటీలు

- **పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

**ముద్ర, ధర్మపురి:**

డ్రాగన్ స్వార్డ్ కుంగ్ ఫూ అకాడమీ ఆధ్వర్యంలో మార్చి 8వ తేది నుంచి ధర్మపురి పట్టణంలోని అమ్మ గార్డెన్స్ లో రాష్ట్రస్థాయి కుంగ్ ఫూ, కరాటే పోటీలు జరుగనున్నాయి. ఈ పోటీలకు సంబంధించిన పోస్టర్ ను మంత్రి లక్ష్మణ్ కుమార్ ధర్మపురిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజా ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. ధర్మపురి పట్టణంలో రాష్ట్రస్థాయి క్రీడలు జరుగనుండడం అభినందనీయమన్నారు. టోర్నమెంట్ నిర్వాహకుడు కస్తూరి ప్రవీణ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి 700 మందికి పైగా క్రీడకారులు టోర్నమెంట్ లో పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ భాదినేని రాజేందర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# డైట్ లో ఉన్నతీకరణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

**ముద్ర, కరీంనగర్:**

కరీంనగర్ ఎల్ఎండీ కాలనీలో ఉన్న ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్) లో రూ.13.39 కోట్లతో చేపట్టే ఉన్నతీకరణ పనులకు ఎమ్మెల్యే, డా. కవ్వంపల్లి సత్యనారాయణ, అడిషనల్ కలెక్టర్ స్థానిక సంస్థలు అశ్విని తానాజీ వాకడే, జిల్లా విద్యాశాఖ అధికారితో కలిసి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఇచ్చే గొప్ప వృత్తి ఉపాధ్యాయ వృత్తి అన్నారు. ఎన్నో వృత్తుల నైపుణ్యాలను అభివృద్ధిపరిచే వృత్తి ఉపాధ్యాయ వృత్తి అని అభివర్ణించారు. సమాజానికి అనుగుణమైన, అవసరమైన పౌరులను తయారు చేసేది కేవలం ఉపాధ్యాయులేనని ఉద్ఘాటించారు ఈ కార్యక్రమంలో సంస్థ ప్రిన్సిపాల్ శ్రీరాం మొండయ్య, మహాత్మా నగర్ సర్పంచ్ పొన్నాల సంపత్, తిమ్మాపూర్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి మల్హోత్ర, డీఈఈ కృష్ణకుమార్, ఏఈ మక్దుమ్, కాంట్రాక్టర్ డి. శ్రీనివాస్ రెడ్డి, సంస్థ సిబ్బంది, ఛాత్రోపాధ్యాయులు పాల్గొన్నారు.



# పీహెచ్సీలలో బాలింతల సంరక్షణపై ఒకరోజు ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమం

**ముద్ర, కరీంనగర్:**

జిల్లా కలెక్టర్ సూచన మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయ మీటింగ్ హాల్లో డీఎంహెచ్వో డాక్టర్ వెంకటరమణ అధ్యక్షతన శనివారం గర్భవతుల, బాలింతల సంరక్షణ పై ఒకరోజు ఓరియంటేషన్ మరియు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల, పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, ఎమ్ఎల్ హెచ్ పీలు, నర్సింగ్ ఆఫీసర్లకు శిక్షణ ఇచ్చారు. గర్భవతుల, బాలింతల సంరక్షణ పై ఎసెన్షియల్ నవజాత శిశువుల సంరక్షణ మరియు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో డెలివరీలను బలోపేతం చేయడం గురించి వారికి శిక్షణనిచ్చారు. ఈ కార్యక్రమంలో స్త్రీ వైద్య నిపుణులు జిజిహెచ్ డాక్టర్ నిర్మల, పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ సతీష్, డాక్టర్ సంధ్య, పిఓ ఎంహెచ్ఎన్ డాక్టర్ సన జవేరియా పాల్గొన్నారు.

# ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా మణికంఠ రెడ్డి

**ముద్ర, కరీంనగర్:**



అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏ ఐ ఎ స్ ఎ ఫ్) తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలు నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఫిబ్రవరి 18 నుండి 20 వరకు జరిగాయి. ఈ మహాసభల్లో రాష్ట్ర నూతన కౌన్సిల్ సభ్యుల ఎన్నిక జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడిగా రెండో సారి కరీంనగర్ పట్టణానికి చెందిన కసిరెడ్డి మణికంఠ రెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మణికంఠ రెడ్డి మాట్లాడుతూ రానున్న రోజుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలపై అవిశ్రాంతంగా పోరాటాలు నిర్వహిస్తూ, విద్యార్థుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తానని తెలిపారు.

# హిందూ మహాసభ సమ్మేళనాన్ని జయప్రదం చేయండి

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**

వీరశైవ లింగాయత్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 26న ముధోల్ మండల కేంద్రంలో నిర్వహించే మహాసభ సంత్ సమ్మేళనం (హిందూ జూడో మహాసభ) విజయవంతం చేయాలని జిల్లా గౌరవ అధ్యక్షుడు గంగాధర్ పటేల్, అధ్యక్షుడు శంకర్ పటేల్ కోరారు. నిర్మల్ పట్టణంలోని వీరశైవ లింగాయత్ సంఘ భవనంలో జిల్లా కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. హిందూ ధర్మ పరిరక్షణ, లింగ ధర్మ ప్రచారం, మహాత్మ బసవేశ్వర ఆశయాల ఆచరణ, సమాజంలో శాంతి స్థాపన కొరకు ఈ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ముధోల్ మండల కేంద్రంలో నిర్వహించే ఈ సమ్మేళనానికి దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన సాధువులు హాజరవుతున్నారన్నారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున వీరశైవ లింగాయత్ బంధువులు ప్రజలు హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు గంగాధర్ పటేల్, జిల్లా బాధ్యులు సాప్రా పటేల్ మాధవ్ పటేల్, సాయి పటేల్, దత్తు పటేల్, రామేశ్వర్ పటేల్ చంద్రకళ, నర్సప్ప తదితరులు పాల్గొన్నారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
22.02.2026 ఆదివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**ఇండియాలో టాప్ 10 హీరోలు**



అల్లు అర్జున్ డ్యాన్స్, స్టైల్‌తో యూత్‌లో విపరీతమైన ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించాడు. 'పుష్ప'తో నేషనల్ లెవెల్లో క్రేజ్ పెంచుకున్నాడు.

# విజ్ఞాన్‌లో ఐఏఎస్, ఐపీఎస్ ఫౌండేషన్

- ప్రారంభించిన భువనగిరి అదనపు కలెక్టర్ భాస్కర్ రావు

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**




యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణంలోని విజ్ఞాన్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ పగిడాల జలందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఐఏఎస్, ఐపీఎస్ ఫౌండేషన్ ప్రోగ్రాంను శనివారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ సంయుక్తంగా ప్రారంభించారు.
ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో మొట్ట మొదటిసారిగా ఇలాంటి ఫౌండేషన్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించడం అభినందనీయమని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలకు చేరాలని ఆకాంక్షించారు. కార్యక్రమాన్ని నిర్వహించిన విజ్ఞాన్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ డా. పగిడాల జలంధర్ రెడ్డిని అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థల చైర్మన్ అవేజ్ చిస్తి, జిల్లా విద్యాధికారి సత్యనారాయణ, మండల విద్యాధికారి నాగవర్ధన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్, వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజుల వెంకటేశ్వరు, స్వర్ణగిరి ఆలయ చైర్మన్ మానేపల్లి రామారావు, లింగ నరసింహారావు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ రామ్ రెడ్డి, కరస్పాండెంట్ పగిడాల పురేందర్ రెడ్డి, ప్రిన్సిపాల్స్ అపర్ణ, స్వాతి, పక్కిరు కొండల్ రెడ్డి, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# హక్కుల సాధనకు ఉద్యమించాలి


**ముద్ర ప్రతినిధి, భువనగిరి:**

రాష్ట్ర ప్రభుత్వం వికలాంగులకిచ్చిన హామీల అమలు కోసం, హక్కుల సాధన కోసం ఉద్యమించాలని ఎన్ పిఆర్ డి రాష్ట్ర అధ్యక్షులు కె.వెంకట్ పిలుపునిచ్చారు. శనివారం భువనగిరిలో సంఘం కార్యాలయం వద్ద ఎన్ పిఆర్ డి 16వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా వికలాంగులను ఐక్యం చేయడానికి 2010 ఫిబ్రవరి 2122 తేదీల్లో ఎన్ పి ఆర్ డి కలకత్తా పట్టణంలో ఏర్పడిందని, ఆత్మగౌరవం, హక్కుల సాధన కోసం వికలాంగులను సమీకరించి పోరాటాలు చేస్తుందని అన్నారు. పెన్షన్ రూ.6 వేలకు పెంచడంతో పాటు స్థానిక సంస్థల్లో, నామినేటెడ్ పదవుల్లో రిజర్వేషన్స్ సాధన కోసం పోరాటాలు ఉధృతం చేస్తామని అన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న వికలాంగుల బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీ కోసం ప్రత్యేక నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 21 నుండి 28వరకు రాష్ట్ర వ్యాప్తంగా సంఘం ఆవిర్భావ దినోత్సవ వారోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ పి ఆర్ డి జిల్లా అధ్యక్షులు సురుపంగా ప్రకాష్, జిల్లా ప్రధాన కార్యదర్శి వనం ఉపేందర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బోల్లేపల్లి స్వామి, జిల్లా కోశాధికారి కొత్త లలిత, నాయకులు కేతావత్ మురళి, శ్రీనివాస్ రెడ్డి, నాగు నరసింహ, పున్న శ్రీధర్, కర్ర కిషన్ పాల్గొన్నారు.

# శోభాయమానంగా శ్రీవారి వసంతోత్సవం

- జల నారాయణ స్వామి వారికి మంగళహారతులు

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**



కలియుగ ప్రత్యక్ష దైవమైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీవారి వసంతోత్సవం శోభాయమానంగా అర్చక స్వాములు ఘనంగా నిర్వహించారు. శనివారం ఆలయంలో సుప్రభాత సేవ మొదలుకొని నిత్య కైంకర్యాలు జరిగాయి. పుష్పమాలలతో తోమాల సేవను నయన మనోహరంగా నిర్వహించారు. సహస్ర నామార్చన సేవ లోక కళ్యాణం కోసం సుదర్శన నారసింహ హవనంను గావించారు. స్వామి వారికి పట్టు పీతాంబరాలు ధరింపజేసి, సుగంధ భరిత పుష్పమాలలతో అలంకరించి స్వామివారి నిత్య కళ్యాణ మహోత్సవాన్ని శ్రీవారి వైభవోత్సవ మండపంలో వేద మంత్రాలతో మంగళ ధ్వనుల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. సాయంత్రం శ్రీ స్వామివారి తిరు వీధి ఉత్సవ సేవ అనంతరం జల నారాయణ స్వామి వారికి మంగళ హారతులు సమర్పించారు.

# ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల సేవలు బేష్

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల సేవలు బేష్ అని తుక్కాపురం సర్పంచ్ జనగాం పాండు అన్నారు. మండలంలోని తుక్కాపురం గ్రామంలో భువనగిరి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ I వాలంటీర్స్ జాతీయ సేవా పథకం శీతాకాల శిబిరంలో భాగంగా రెండో రోజు పచ్చదనం పరిశుభ్రతలో రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్లను తొలగించారు. గ్రామ పంచాయతీలోని 1,2 వార్డులలో చెత్త సేకరణ, స్కూలు ఆవరణలో చెత్త సేకరణ, శివాలయంలోని మట్టి తీసివేత వంటి కార్యక్రమాలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ తోటకూరి రామకృష్ణ, ఉప సర్పంచ్ రాసాల లింగస్వామి యాదవ్, మాజీ సర్పంచ్ నోముల మహేందర్ రెడ్డి, పుట్ట వీరేష్ యాదవ్, మాజీ ఎంపీటీసీ నల్లమాస సత్యనారాయణ గౌడ్, వార్డు మెంబెర్స్ జనగాం ఇందిరమ్మ, రత్నాపురం శ్రీకాంత్ ,జనగాం మహేష్, రాసాల శరత్ యాదవ్, ముంత కృష్ణవేణి, రమేష్, దొమ్మటి భాగ్య లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.




# సేవలందించడమే లక్ష్యం

- భద్రాద్రి జిల్లా ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ సైదేశ్వరరావు
- మీసేవ సర్టిఫికెట్ వెరిఫికేషన్ మొబైల్ యాప్‌పై జిల్లాస్థాయి శిక్షణ

**ముద్ర, భద్రాద్రి:**




జిల్లాలో మీసేవ సేవలను మరింత సమర్థవంతంగా అమలు చేసి, ప్రజలకు సమయ పాలనతో సేవలు అందించడమే లక్ష్యంగా ఐడీఓసి కార్యాలయం సమావేశ మందిరంలో శనివారం జిల్లాలోని నయాబ్ తహశీల్దార్లు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, జీపీవోలకు మీ సేవ సర్టిఫికెట్ వెరిఫికేషన్ మొబైల్ యాప్ వినియోగంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని జిల్లా ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ సైదేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ మాట్లాడుతూ, మీ సేవ కేంద్రాల్లో స్వీకరించే దరఖాస్తులను వేగవంతంగా మరియు పారదర్శకంగా పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన మీసేవ ఫీల్డ్ వెరిఫికేషన్ మొబైల్ యాప్ వినియోగం అత్యంత కీలకమని తెలిపారు. యాప్ ద్వారా క్షేత్రస్థాయిలోనే ధృవీకరణ ప్రక్రియను పూర్తి చేసి తక్షణమే పోర్టల్‌కు అప్‌డేట్ చేయవచ్చని వివరించారు. క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా అధికారులు దరఖాస్తుదారుల నివాసానికి వెళ్లి సంబంధిత వివరాలను యాప్‌లో నమోదు చేయడం, జియోట్యాగ్‌తో కూడిన లైవ్ ఫోటోలను అప్‌లోడ్ చేయడం వల్ల నకిలీ దరఖాస్తులకు అవకాశం లేకుండా పారదర్శకత తెలిపారు. భౌతిక ఫైళ్ల కదలిక అవసరం లేకుండా పూర్తిగా డిజిటల్ విధానంలోనే పరిశీలన పూర్తయ్యే విధంగా వ్యవస్థ ఉండటంతో, ముఖ్యంగా కల్యాణ లక్ష్మి, షాదీ ము బా ర క్ వం టి పథకాల దరఖాస్తులు త్వరితగతిన ఆమోదం పొందే అవకాశం ఉంటుందని తెలిపారు . యాప్ ద్వారా సేకరించిన సమాచారం నేరుగా మీసేవ పోర్టల్‌కు అనుసంధానమై డేటా తక్షణమే అప్‌డేట్ అవుతుందని తెలిపారు. ఈ శిక్షణ తరగతులకు జిల్లాలోని సుమారు 160 మంది జీపీవోలు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, 40 మంది నయాబ్ తహసీల్దార్లు మరియు 15 మంది ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు. యాప్ డౌన్‌లోడ్ విధానం, లాగిన్ ప్రక్రియ, ఫీల్డ్ వెరిఫికేషన్ నమోదు, ఫోటో అప్‌లోడ్, రిపోర్ట్ సమర్పణ తదితర అంశాలపై ప్రదర్శనతో కూడిన సమగ్ర అవగాహన కల్పించారు. అధికారుల సందేహాలకు వివరణాత్మక సమాధానాలు అందించి, యాప్ వినియోగాన్ని తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు.

# టెన్త్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

- నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలి
- బీచ్మహళ్ల స్కూల్ ను ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్

**ముద్ర ప్రతినిధి, భువనగిరి:**



విద్యార్థి దశలో పదో తరగతి అనేది మొదటి మెట్టు కాబట్టి విద్యార్థులు కష్టపడి చదివి మెరుగైన ఫలితాలు సాధించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు.శనివారం భువనగిరి పట్టణంలోని బీచ్మహళ్ల జిల్లా పరిషత్ హై స్కూల్ ని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య మొత్తం ఎంత మంది ఉన్నారని అడిగి తెలుసుకొని అందులో పదవ తరగతి చదివే విద్యార్థులు ఎంతమంది ఉన్నారు అని అడిగి తెలుసుకున్నారు. పదవ తరగతి విద్యార్థులు అందరూ ప్రతిరోజు క్రమం తప్పకుండా పాఠశాల కి వస్తున్నారా.. లేదా ఎవరైనా గైర్హాజరు అవుతున్నారా అని ఆరా తీశారు. విద్యార్థులతో మాట్లాడుతూ పరీక్షల సమయం దగ్గర పడుతున్నందున కష్టపడి చదవాలన్నారు. సెలవులో వాగుల్లో, చెరువుల్లో ఈత కు వెళ్లి ప్రమాదాలు తెచ్చుకోకుండా, పరీక్షల మధ్యలో రెండు రోజులు కూడా పాఠశాలకు వచ్చి ప్రిపేర్ అవ్వాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులకి కలెక్టర్ స్వయంగా భోజనం వడ్డించారు. రైస్ క్వాలిటీ సరిగా లేక పోవడంతో వెంటనే సంబంధిత సివిల్ సప్లయ్ అధికారులకు పోన్ చేసి బియ్యం వెంటనే మంచి బియ్యం సరఫరా చేయాలని, మెనూ ప్రకారం విద్యార్థులకు రుచి కరమైన ఆహారం అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# న్యూ జనరేషన్ లో ఘనంగా స్వయం పాలన

**నల్గొండ, ముద్ర :**




నల్గొండ జిల్లా కేంద్రంలోని న్యూ జనరేషన్ ఉన్నత పాఠశాల విద్యార్థులు స్వయం పాలన దినోత్సవాన్ని శనివారం ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి సహచర విద్యార్థులకు పాఠాలు బోధించారు. విద్యార్థులు బోధనతో పాటు పాఠశాల నిర్వహణ బాధ్యతలను స్వయంగా నిర్వహించడం విశేషంగా నిలిచింది. తమ పాత్రల్లో పూర్తిగా లీనమై, ఆనందోత్సాహాలతో కర్తవ్య నిర్వహణ చేయడం అందరినీ ఆకర్షించింది. రోజంతా చిన్నారుల ఆటపాటలు, కార్యక్రమాలతో పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని తలపించింది. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ జానకీరాం రెడ్డి మాట్లాడుతూ.. పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించేలా కార్యక్రమాలను రూపొందిస్తున్నామన్నారు. విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దుతున్నామని వెల్లడించారు. విద్యార్థులు క్రమశిక్షణ , తోటి విద్యను అభ్యసించాలని ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. స్వయంపాలన కార్యక్రమంలో చిన్న వయసులోనే బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించడం భవిష్యత్ జీవితానికి ఎంతో ఉపయోగకరమని చెప్పారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ అలక జానకీరాం రెడ్డి, పాఠశాల ఇన్ ఛార్జీ శ్వేత పాల్గొన్నారు.

# లోపాలు లేకుండా సేవలందించాలి

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్

**ముద్ర, భద్రాద్రి కొత్తగూడెం:**



జిల్లాలో నడుస్తున్న 108 అంబులెన్స్ వాహనాలపై జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ శనివారం సమగ్ర తనిఖీ, ఆడిట్ నిర్వహించారు. ప్రజలకు అత్యవసర వైద్య సేవలు సమర్థవంతంగా, వేగవంతంగా అందుతున్నాయా అనే దానిపై ప్రత్యేక దృష్టి సారించారు. తనిఖీ సందర్భంగా వాహనాల బయటి లోపలి పరిస్థితి, టైర్లు (స్టెప్నీ సహా), హెడ్‌లైట్లు, ఇండికేటర్లు, సైరన్, పీఏ సిస్టమ్ పనితీరు, జీపీఎస్ వ్యవస్థ పని స్థితి, ఇంధన స్థాయి, లాగ్‌బుక్ నిర్వహణను పరిశీలించారు. అదేవిధంగా ఆర్సీ, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికేట్ల చెల్లుబాటు స్థితిని ధృవీకరించారు. వైద్య పరికరాలలో ఆక్సిజన్ సిలిండర్ ప్రెషర్ స్థాయి, బీవీఎం (పయోజనులు పిల్లల కోసం), సక్షన్ యంత్రం, బీపీ యంత్రం, స్టెతస్కోప్, గ్లూకోమీటర్, పల్స్ ఆక్సీమీటర్, స్ట్రెచర్, స్పైన్ బోర్డ్, సర్వైకల్ కాలర్లు, డెలివరీ కిట్ మరియు ఇతర అత్యవసర పరికరాలను తనిఖీ చేశారు. అలాగే ఔషధ కిట్‌లో అడ్రినలిన్, అట్రోపిన్, డెక్స్ట్రోస్, ఐవీ ద్రావణాలు తదితర అత్యవసర మందుల లభ్యత, గడువు తేదీలను పరిశీలించారు. అంబులెన్స్‌ల శుభ్రత, లీనెన్ పరిస్థితి, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ విధానం, పీపీఈ కిట్లు మరియు హ్యాండ్ శానిటైజర్ల లభ్యతను కూడా ధృవీకరించారు. ప్రజలకు అత్యవసర సేవలు ఎటువంటి లోపాలు లేకుండా అందించాలనే ఉద్దేశంతో ఇలాంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ తెలిపారు.

# 'బెస్ట్ అవైలబుల్' దరఖాస్తుల ఆహ్వానం

**ముద్ర, ఖమ్మం:**

మార్చి 25 లోగా బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ ఎంపికకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ నిర్వహించే బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ క్రింద పాఠశాలల ఎంపిక కోసం 202627 విద్యా సంవత్సరానికి ప్రసిద్ధ, గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. దరఖాస్తు చేసుకునే పాఠశాలలు స్టేట్ లేదా సెంట్రల్ బోర్డు ద్వారా గుర్తింపు పొంది ఉండాలని, గత 5 సంవత్సరాల్లో 7వ, 10వ తరగతిలో 90 శాతం కంటే ఎక్కువ ఉత్తీర్ణత, 50 శాతం కంటే అధిక విద్యార్థులకు ఫస్ట్ క్లాస్ ఉత్తీర్ణత సాధించి ఉండాలని అన్నారు. పాఠశాలలకు విశాలమైన గదులు, క్రీడా ప్రాంగణం, విద్యార్థులకు మెరుగైన సదుపాయాలు, లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబ్, అనుభవజ్ఞులైన అర్హత కలిగిన బోధనా సిబ్బంది, 50 శాతం కంటే ఎక్కువ సాధారణ సిబ్బంది ఉండాలని అన్నారు. ఆసక్తి, అర్హత కల్గిన ప్రైవేట్ పాఠశాలల ప్రతినిధులు తమ సర్టిఫికెట్లతో డిప్యూటీ డైరెక్టర్, షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ, ఎస్ 34, కలెక్టరేట్ సముదాయం, వి. వెంకటాయపాలెం, ఖమ్మం కార్యాలయంలో మార్చి 25 లోగా సమర్పించాలని అన్నారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ ఎంపిక కలెక్టర్/చైర్మన్ అధ్యక్షతన జిల్లా ఎంపిక కమిటీ ద్వారా జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

రాష్ట్ర క్రీడా పాఠశాలలో 4వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా యువజన, క్రీడల అధికారి కె.ధనంజనేయులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వీసీ & ఎండీ .సతగ్ & డైరెక్టర్ , టీజీఎస్ఎస్ , హకీంపేట్ వారి ఆదేశాల ప్రకారం, మండల స్థాయి/ జిల్లా స్థాయిలో ఎంపికలు నిర్వహించబడునని తెలిపారు.నాల్గో తరగతి లో ప్రవేశాల కోరకు విద్యార్థినీ విద్యార్థుల వయస్సు తేది.01.09.2017 నుండి 31.08.2018 వరకు జన్మించిన వారై వుండాలన్నారు. వివరాలకు 8309992451 ను సంప్రదించాలాన్నారు.

# జిల్లా ఎస్పీకి ఘన సన్మానం

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ అక్షాంష్ యాదవ్ ని భువనగిరి నూతన మున్సిపల్ చైర్ పర్సన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవి కుమార్ శనివారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భువనగిరి మున్సిపాలిటీ అభివృద్ధి కృషి చేయాలని కోరారు. ఎస్పీ అక్షాంష్ యాదవ్ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకై పోలీస్ శాఖ నుండి ఎలాంటి సహాయ సహకారాలై అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
22.02.2026 ఆదివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



ఇండియాలో టాప్ 10 హీరోలు



రామ్ చరణ్ 'ఆర్ఆర్ఆర్'తో అంతర్జాతీయ గుర్తింపు పొందాడు. యాక్షన్, డ్యాన్స్‌లో సమానంగా రాణిస్తున్నాడు.



## సర్పంచ్ లు అంకిత భావంతో పనిచేయాలి

- **కలెక్టర్ పి. ప్రావీణ్య**

**సంగారెడ్డి, ముద్ర ప్రతినిధి:**

పల్లెల సర్వతోముఖాభివృద్ధే ప్రధాన లక్ష్యంగా సర్పంచ్ లు అంకిత భావంతో పనిచేయాలని కలెక్టర్ పి. ప్రావీణ్య పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని మహిళా ప్రాంగణంలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న నూతన సర్పంచ్ ల శిక్షణ శనివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని సర్పంచ్ లను ఉద్దేశించి మాట్లాడారు. శిక్షణలో పొందిన అవగాహనను గ్రామాల అభివృద్ధికి సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రజలకు సమర్థవంతమైన, పారదర్శక పాలన అందించడం సర్పంచ్ ల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. నిధులు, విధులను సక్రమంగా వినియోగిస్తూ, అన్ని వర్గాల సమన్వయంతో గ్రామాల సమగ్రాభివృద్ధి సాధించాలన్నారు.

ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు ప్రజల అవసరాలను గుర్తించి స్పందించాలని సూచించారు. తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రజలతో మమేకమై బాధ్యతాయుతంగా వ్యవహరించాలని హితవు పలికారు. గ్రామ పంచాయతీలను ఆదర్శవంతమైన స్థానిక సంస్థలుగా తీర్చిదిద్దేందుకు సర్పంచ్ లునాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలన్నారు. పారదర్శకత, బాధ్యతాయుత వైఖరి పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో, ఇంచార్జి జిల్లా పంచాయతీ అధికారి జానకి రెడ్డి, డీఎల్పీవోలు, ఎంపీడీవోలు, మాస్టర్ ట్రైనర్లు తదితరులు పాల్గొన్నారు.




## పెన్షనర్ల బకాయిలు చెల్లించాలి

- **రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్**

**సిద్దిపేట, ముద్ర ప్రతినిధి :**

పెన్షనర్ల బకాయిలను వెంటనే చెల్లించాలని రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పోనమల్ల రాములు, ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం వారు సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. మార్చి 2024 నుంచి రిటైర్డు అయిన పెన్షనర్లకు ఇంతవరకు బకాయిలు రాలేదన్నారు. దీంతో తీవ్ర మానసిక ఒత్తిడి గురై ఇప్పటివరకు 68 మంది పెన్షనర్లు మృతి చెందారన్నారు. కొంతమంది పెన్షనర్లు కోర్టు ఉత్తర్వులు తెచ్చుకున్నా ప్రభుత్వం బకాయిలు విడుదల చేయకపోవడం శోచనీయమన్నారు. ఒకవేళ ప్రభుత్వం మార్చి ఒకటో తారీకు లోగా బకాయిలు చెల్లించకుంటే 2 నుంచి ఇందిరా పార్క్ వద్ద కుటుంబ సభ్యులతో నిరాహార దీక్ష చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో అసోసియేషన్ నాయకులు రాజిరెడ్డి, శంకర్ రావు, భగవాన్ రెడ్డి, ఎండీ కుదరత్ అలీ, సురేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## హోరాహోరీగా సాఫ్ట్ బాల్ పోటీలు

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

మెదక్ పట్టణంలో సాఫ్ట్ బాల్ రాష్ట్ర స్థాయి పోటీలు హోరా హోరీగా జరుగుతున్నాయి. సూపర్ లీగ్ విభాగంలో భూపాలపల్లి, మహబూబ్ నగర్, మెదక్, రంగారెడ్డి, వరంగల్, నిజామాబాద్ జట్లు అర్హత సాధించాయి. సూపర్ లీగ్ విభాగంలో నిజామాబాద్, హైదరాబాద్, మహబూబ్ నగర్, మెదక్, హనుమకొండ, ఆదిలాబాద్, వరంగల్, సిద్దిపేట జట్లు అర్హత సాధించాయి.

## పాఠశాలలో మాక్ అసెంబ్లీ

**ముద్ర, హైదరాబాద్:**

శాసనసభ కార్యకలాపాలను విద్యార్థులకు మరింత అవగతం చేసేందుకు సిద్దిపేట జిల్లాలోని రాయపోల్ ఉన్నత పాఠశాలలో శనివారం మాక్ అసెంబ్లీ నిర్వహించారు. గవర్నర్, ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత పాత్రలను పోషించిన విద్యార్థులు.. అచ్చం అసెంబ్లీ తరహాలోనే కార్యక్రమాలు నిర్వహించి అందర్నీ ఆలోచింపజేశారు. మాక్ అసెంబ్లీలో గవర్నర్‌గా సమంత, ముఖ్యమంత్రిగా రేణుక, ప్రతిపక్ష నాయకుడిగా ధ్రువాక్షిత్ రెడ్డి ఆకట్టుకున్నారు. ప్రజా సమస్యలపై చర్చలు, సంక్షేమ బిల్లుల ప్రవేశపెట్టడం వంటి అంశాలను సమర్థంగా ప్రదర్శించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ..నేటి బాలలు రేపటి దేశ నాయకులు, శాసనకర్తలని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఉన్నత పదవులు అలంకరించే స్థాయికి ఎదగాలని విద్యార్థులను ఆయన ఆశీర్వదించారు. చదువుతో పాటు రాజకీయాలపై.. అసెంబ్లీ సమావేశాలపై కూడా అవగాహన కల్పించిన మాక్ అసెంబ్లీ నిర్వహణను అందరూ ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగరాజు, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయురాలు సావిత్రి, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సమయాన్ని వృథా చేయొద్దు

- **కలెక్టర్ రాహుల్ రాజ్**

**ముద్ర ప్రతినిధి, మెదక్:**



పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో సమయాన్ని వృథా చేయకుండా జాగ్రత్తగా ఉపయోగించుకోవాలని విద్యార్థులకు కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. శనివారం చిన్నశంకరంపేట్ మండలం సూరారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించారు. ఏఏ సబ్జెక్టును ఏ విధంగా చదువాలో వివరించారు. పదో తరగతి విద్యార్థులకు మ్యాథ్స్, సైన్స్, వివిధ భాష సామర్థ్యాలను పరిశీలించి, పలు గణిత సమస్యలను పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లితండ్రులు తప్పనిసరిగా పదో తరగతి విద్యార్థులను పాఠశాలకు హాజరయ్యే విధంగా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. తల్లిదండ్రుల భాగస్వామ్యంతో ఇంటి వద్ద కూడా సాధన కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థుల ప్రగతిపై నిరంతర పర్యవేక్షణ అవసరమన్నారు. జిల్లాలో పదో తరగతి పరీక్షల్లో గరిష్ట ఉత్తీర్ణత సాధించడం, గుణాత్మక అభ్యాస ప్రమాణాలు పెంపొందించడం లక్ష్యంగా ముందుకు పోతున్నట్లు వెల్లడించారు. అందరూ ప్రత్యేక తరగతులకు క్రమం తప్పకుండా హాజరు కావాలని సూచించారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించి జిల్లాకు మంచి పేరు తేవాలని కోరారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాలు విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు.

**జాతీయ వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపిక..**

జాతీయ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు అత్యధికంగా మెదక్ జిల్లా నుంచి నాలుగు ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. జనవరి 7 నుంచి 9 వరకు మూడు రోజులపాటు కామారెడ్డి విద్యానికేతన్ పాఠశాలలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో జిల్లా విద్యార్థులు ప్రతిభను చాటారు. సీనియర్ విభాగంలో పాల్గొన్న నాలుగు ప్రాజెక్టులను జాతీయ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు రాష్ట్రం నుంచి జాతీయ స్థాయికి 21 ప్రాజెక్టులు ఎంపిక చేయగా అత్యధికంగా మెదక్ జిల్లా నుంచి నాలుగు ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. ఎంపికైన విద్యార్థులను గైడ్ టీచర్ లను కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ నగేష్ అభినందించారు.. ఎంపికైన ప్రాజెక్టుల్లో.. బి.మహతి, గీతా హైస్కూల్ తూప్రాన్ వ్యర్థాల నిర్వహణ ప్లాస్టిక్ లకు ప్రత్యామ్నయం అనే అంశం.అక్షయ్, సిద్ధార్థ రూరల్ హైస్కూల్ మాచవరం ఎమర్జింగ్ టెక్నాలజీ అనే అంశం. ఎస్. గణేష్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చికోడ్ లింగాయపల్లి నీటి సంరక్షణ, నిర్వహణ అంశం. ఆఫీఫా, సరస్వతీ కాన్వెంట్ హై స్కూల్ మెదక్ వినోద భరిత గణితం. జాతీయ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొనే విద్యార్థులు ఇదే స్ఫూర్తితో జాతీయ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో రాణించి జిల్లాకు పేరు తేవాలని సూచించారు. సౌత్ ఇండియా సైన్స్ ఎగ్జిబిషన్ లో టీచర్ విభాగంలో ప్రథమ స్థానం పొందిన కొడపాక ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు వెంకట రమణను కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఏఎస్ ఓ నవీన్, గైడ్ టీచర్లు పాల్గొన్నారు.

## ప్రణాళిక బద్ధంగా పరీక్షలు నిర్వహించాలి

**ముద్ర ప్రతినిధి, మెదక్:**




జిల్లాలో జరిగే పదో తరగతి పరీక్షలు పకడ్బందీ ప్రణాళికతో నిర్వహించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. శనివారం కలెక్టరేట్ ఆడిటోరియంలో పదో తరగతి పరీక్షలు నిర్వహించే చీఫ్ సూపరెండెంట్, డిపార్ట్ మెంటల్ అధికారులకు శిక్షణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. స్టోరేజ్ పాయింట్ నుంచి పరీక్ష కేంద్రానికి ప్రశ్న పత్రాలు తీసుకుపోయే సమయంలో జాగ్రత్తలు వహించి పరీక్ష కేంద్రానికి చేరవేయాలని సూచించారు. పరీక్షల నిర్వహణ సమయంలో ప్రతి విద్యార్థిని తనిఖీ నిర్వహించిన అనంతరం పరీక్ష కేంద్రంలోనికి పంపించాలని తెలిపారు. పరీక్షల మధ్య సమయం ఎక్కువగా ఉన్నందున మరుసటి రోజు వచ్చే పరీక్షకు విద్యార్థులను పూర్తిస్థాయిలో సంసిద్ధం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ శిక్షణలో అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా విద్యాశాఖ అధికారి విజయ, పరీక్షల విభాగం అధికారి కరుణాకర్, జిల్లా సైన్స్ ఆఫీసర్ రాజిరెడ్డి, మండల విద్యాధికారి శంకర్ తదితరులు పాల్గొన్నారు.



## 23న ప్రజావాణి

**సంగారెడ్డి, ముద్ర ప్రతినిధి:**

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో తాత్కాలికంగా నిలిపివేసిన ప్రజావాణిని ఈ నెల 23న సోమవారం నుంచి యధావిధిగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ పి. ప్రావీణ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తమ సమస్యల పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొనాలని కలెక్టర్ సూచించారు.

## మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించాలి

- **కలెక్టర్ హైమావతి**

**సిద్దిపేట, ముద్ర ప్రతినిధి :**



ప్రభుత్వ విద్యా సంస్థల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనంలో మెనూ తప్పకుండా పాటించాలని కలెక్టర్ హైమావతి ఆదేశించారు. దుబ్బాక మండలం రామక్కాపేట తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను శనివారం కలెక్టర్ తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన ప్రక్రియను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అన్నం, గుడ్డు, బెండకాయ కూర, టమాటా పప్పు, రసం, పెరుగు లను పరిశీలించారు. బెండకాయ కూర, టమాటా పప్పు సాంబారు నీళ్లాల ఉందని, రసం మాత్రం పచ్చి పులుసు మాదిరి ఉండడం చూస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుంచి అన్ని సరుకులు, కూరగాయలు అందిస్తుంటే పిల్లలకు మెనూ ప్రకారం నాణ్యమైన కూరలతో కాకుండా భోజనం ఇలా పెడతారా అని కేర్‌టేకర్, ఉపాధ్యాయులపై మండిపడ్డారు. 500కు పైగా విద్యార్థులకు సరిపడా వండకుండా 237 మంది విద్యార్థులకు సరిపోయే విధంగా ఉన్నాయన్నారు. 132 మంది విద్యార్థులకు గుడ్లు ఎందుకు తక్కువ వండారని వంట సిబ్బందిని ఆరా తీశారు. సగం మంది విద్యార్థులకు కూరలు సరిపోలేదని దగ్గరుండి టమాటా కూర వండించారు. కూరను రుచిగా చేయడానికి పలు సూచనలు చేశారు. కూర వండించి మిగిలిన విద్యార్థులకు పెట్టించారు. స్టాక్ రిజిస్టర్ వెరిఫై చేస్తూ రాసిన సరుకులకు చేసిన వంటకు పొంతనే లేదని అసహనం వ్యక్తం చేశారు. విద్యార్థుల హాజరు ప్రకారం ఆహార పదార్థాలు అందించాలని వంట సిబ్బందిని ఆదేశించారు. ఇంత అధ్వానంగా భోజనం పెడుతున్నందుకు గాను కేర్‌టేకర్ ఇ,తర అధికారులైన కఠిన చర్యలు తీసుకోవాలని జోనల్ అధికారికి ఫోన్ ద్వారా ఆదేశించారు. విద్యార్థులకు భోజనం, వసతి, చదువు విషయంలో రాజి పడవద్దన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న ఫలాలను విద్యార్థులకు చేరవేయడంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది హెచ్చరించారు. విధులు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు.

## ఉచిత శిక్షణ కోసం దరఖాస్తుల ఆహ్వానం

**సంగారెడ్డి, ముద్ర ప్రతినిధి:**

టీజీ ఎస్సీ స్టడీ సర్కిల్ లో గ్రూప్ 1,2,3,4, ఆర్ ఆర్ బీ, ఎస్ఐ, కానిస్టేబుల్ తదితర పోటీ పరీక్షల ఉచిత శిక్షణకు ఈ నెల 22 లోగా దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా ఎస్సీ డిప్యూటీ డైరెక్టర్ అధికారి అఖిలేష్ రెడ్డి, టీజీ ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. పోటీ పరీక్షలకు ఐదు నెలల ఫౌండేషన్ కోర్సు ద్వారా ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. డిగ్రీ పూర్తి చేసి 3 లక్షల లోపు ఆదాయం కలిగిన ఎస్సీ, బీసీ, ఎస్టీ అభ్యర్థులు ఆన్ లైన్ లో tsstudycircle . co.in లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మార్చి 1న స్థానిక ప్రతిభ డిగ్రీ కళాశాలలో ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. మెరిట్ ఆధారంగా 100 మంది అభ్యర్థులను ఎంపిక చేసి ఐదు నెలల పాటు ఉచిత రెసిడెన్షియల్ తో కూడిన శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 91822 20112 ఫోన్ నంబర్ కు సంప్రదించాలని సూచించారు,

# తంజీమ్ సమస్యలు పరిష్కరిస్తాం

- **సిద్దిపేట తంజీమ్ సుప్రీం బాడీ సభ్యులు**

**సిద్దిపేట, ముద్ర ప్రతినిధి:**



రెండేళ్లుగా సిద్దిపేట తంజీమ్ ఉల్ మసాజిద్ లో నెలకొన్న సమస్యలను త్వరలోనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తంజీమ్ ఉల్ మసాజిద్ కమిటీ సుప్రీం బాడీ ప్రెసిడెంట్ జుబెర్ హుస్సేన్, తంజీమ్ కమిటీ ప్రెసిడెంట్ జియావుద్దీన్ అసిఫ్ తెలిపారు. శనివారం వారు మీడియా తో మాట్లాడుతూ సిద్దిపేట తంజీమ్ ఉల్ మసాజిద్ సొసైటీ పాత రిజిస్ట్రేషన్ నంబర్ 414/2010 పూర్తిగా రద్దైనట్లు చెప్పారు. దాని బదులుగా 284/2023 లో చేసిన సొసైటీ రిజిస్ట్రేషన్ అధికారికంగా అమలులో ఉందన్నారు. సిద్దిపేట కమిటీ లో ఉన్న సుప్రీం బాడీ మెంబర్లు తంజీమ్ లో కార్యకలాపాలు కొనసాగిస్తున్నారని తెలిపారు. సిద్దిపేట తంజీమ్ కు చెందిన షాపింగ్ కాంప్లెక్స్ లోని కిరాయిదారులు కిరాయిని సిద్దిపేట తంజీమ్ లో డిపాజిట్ చేయాలని కోరారు. సిద్దిపేట తంజీమ్ గుర్తింపు లేని వ్యక్తులు వస్తే వారికి కిరాయి ఇవ్వొద్దన్నారు. ఈ విషయమై కోర్టు నుంచి ఫయాజ్, మహమూద్ పై ఇంటీరిమ్ ఇంజక్షన్ ఆర్డర్ వచ్చిందని తెలిపారు. వారు కిరాయి వసూలు చేసే అధికారం లేదన్నారు. అధికారిక తంజీమ్ నుంచి బాధ్యత గల వ్యక్తులకు మాత్రమే కిరాయి చెల్లించాలన్నారు. 2010లో రిజిస్ట్రేషన్ అయిన తంజీమ్ కమిటీ లో ముఖ్య సుప్రీం బాడీ సభ్యులు మృతి చెందడంతో ఆ రిజిస్ట్రేషన్ రద్దు చేశామన్నారు. 2023 లో చట్ట ప్రకారం చేసిన రిజిస్ట్రేషన్ ను అమలులోకి తెచ్చామన్నారు. ఇక సిద్దిపేట తంజీమ్ లో ఎలాంటి సమస్యలు లేవని, పారదర్శక పాలనే ధ్యేయంగా ముందడుగు వేస్తున్నామన్నారు. సిద్దిపేట ముస్లిం సమాజం సహకరించాలని కోరారు. ఈ సమావేశం లో సుప్రీం బాడీ సభ్యులు, తంజీమ్ ఉల్ మసాజిద్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
22.02.2026 ఆదివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**ఇండియాలో టాప్ 10 హీరోలు**

**ఎన్టీఆర్ (జూనియర్)**
పవర్‌ఫుల్ డైలాగ్స్, నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంటాడు. 'ఆర్ఆర్ఆర్'తో గ్లోబల్ స్థాయిలో పేరు తెచ్చుకున్నాడు.



# బీజేపీ ఆందోళనలు

- యూత్ కాంగ్రెస్ నిరసనపై ఆగ్రహం
- ఏఐసీసీ కార్యాలయం, సోనియా నివాసం ముట్టడికి యత్నం
- భివండీలో రాహుల్ కు నిరసన సెగ
- గాంధీభవన్ ముట్టడికి యత్నం




**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

ఈ నెల 20న ఢిల్లీలో ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ ప్రాంగణంలో యూత్ కాంగ్రెస్ చేసిన నిరసనకు వ్యతిరేకంగా బీజేపీ దేశ వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టింది. ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయం, కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ నివాసం ముట్టడికి బీజేపీ నేతలు యత్నించారు. భారీ సంఖ్యలో చేరుకున్న బీజేపీ నాయకులు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ బారికేడ్లను దాటి వెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. దేశ ప్రజలకు రాహుల్ గాంధీ క్షమాపణలు చెప్పాలని ఆయనపై దేశద్రోహం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ ఆందోళనలతో అప్రమత్తమైన పోలీసులు నిరసనకారులను అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు రాహుల్ గాంధీకి ముంబయిలో నిరసన సెగ తగిలింది. 2014 లో ఆర్ఎస్ఎస్ వేసిన పరువు నష్టం కేసులో శనివారం ఆయన భివాడీ అదనపు సెషన్స్ కోర్టు ఎదుట హాజరయ్యారు. ఆయన ముంబయి ఎయిర్ పోర్టు నుంచి కోర్టుకు వెళ్లే దారి పొడుగునా బీజేపీ శ్రేణులు నల్ల జెండాలతో నిరసన వ్యక్తం చేశారు. అలాగే హైదరాబాద్ నాంపల్లిలోని గాంధీభవన్ వద్ద బీజేపీ నేతలు నిరసనలు వ్యక్తం చేశారు. గాంధీ భవన్ ముట్టడికి బీజేవైఎం నేతలు, కార్యకర్తలు విఫలయత్నం చేశారు. కాంగ్రెస్ కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ గాంధీ భవన్ వైపు దూసుకొచ్చారు. దాంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వెంటనే అప్రమత్తమైన పోలీసులు నిరసనకారులను అదుపులోకి తీసుకుని స్థానిక పోలీసు స్టేషన్లకు తరలించారు.

# కోడ్ ఉల్లంఘనలపై చర్యలు తీసుకోవాలి

- ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ విజ్ఞప్తి




**ముద్ర, హైదరాబాద్:**

రాష్ట్రంలో ఇటీవల జరిగిన పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో భారీగా డబ్బు పంపకాలు, కోడ్ ఉల్లంఘనలు జరిగినప్పటికి రాష్ట్ర ఎన్నికల సంఘం చర్యలు తీసుకోలేదని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ అధ్యక్షుడు ఎం.పద్మనాభరెడ్డి విమర్శించారు. ఈ మేరకు శనివారం రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 243K, 243ZA ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించే పూర్తి అధికారాలు ఎన్నికల సంఘానికి ఉన్నాయన్నారు. కాని అమలులో లోపాలు ఉన్నాయని తెలిపారు.

రాష్ట్రంలోని 12,769 గ్రామపంచాయతీల్లో సుమారు 10 వేల పంచాయతీల్లో అభ్యర్థులు సగటున కోటి రూపాయల వరకు ఖర్చు చేశారని ఆరోపించారు. మొత్తం ఎన్నికల్లో దాదాపు రూ.10 వేల కోట్లు ఖర్చయ్యాయని వాపోయారు. ఎన్నికల ముందు గ్రామాల్లో బహిరంగంగా డబ్బులు, వస్తువులు పంపిణీ చేశారని చెప్పారు. కొన్ని చోట్ల ఓటర్లు డబ్బు ఇవ్వలేదని నిరసన వ్యక్తం చేశారన్నారు. ఎన్నికల ఫలితాల తర్వాత ఓడిన అభ్యర్థులు ఓటర్లను ఒట్టు వేయించి డబ్బులు తిరిగి ఇవ్వాలని అడగడం వంటి ఘటనలు కూడా చోటుచేసుకున్నాయని చెప్పారు. ఈ చర్యలు చట్టవిరుద్ధమని, డబ్బు ఇచ్చిన అభ్యర్థులపై, తీసుకున్న ఓటర్లపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

మున్సిపల్ ఎన్నికల్లో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఎవరూ పాటించలేదని ఆరోపించారు. ఓటర్లకు లంచాలు ఇవ్వడం, ప్రభుత్వ వసతులను ప్రచారానికి వినియోగించడం, మంత్రులు అధికారిక పర్యటనల పేరుతో ఎన్నికల ప్రచారం చేయడం, కొత్త పథకాలు ప్రకటించడం వంటి ఉల్లంఘనలు బహిరంగంగా జరిగాయని స్పష్టం చేశారు.

ఇలాంటి కోడ్ ఉల్లంఘనలు జరుగుతున్నా ఎన్నికల సంఘం స్పందించకపోవడం విచారకరమని ఆవేద వ్యక్తం చేశారు. ఇప్పటికైనా మీడియా వద్ద ఉన్న ఆధారాల ప్రకారం తప్పు చేసిన వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. రాబోయే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో డబ్బు పంపకాలు, ఉల్లంఘనలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని కోరింది.



# అభివృద్ధి కార్యక్రమాల్లో రాజకీయాలకు తావు లేదు

- తెలంగాణపై కేంద్రానికి వివక్ష ఉండదు
- కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహన్

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

అభివృద్ధి కార్యక్రమాల్లో రాజకీయాలకు తావు ఉండదని కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమం, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహన్ తెలిపారు. కేంద్రం, రాష్ట్రం కలిసి పని చేయాల్సిందేనన్న ఆయన తెలంగాణతో కేంద్రానికి ఎటువంటి వివక్ష ఉండదని హామీ ఇచ్చారు. రాష్ట్ర, కేంద్ర సహకారం భారత పురోగతికి అవసరమని పేర్కొన్నారు. శనివారం హైదరాబాద్‌లోని హోటల్ కాకతీయలో జాతీయ ఆర్థిక సాక్షరత సదస్సు, 25వ కేంద్ర స్థాయి సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ అభివృద్ధి కోసం రాజకీయాలు పక్కన పెట్టి తెలంగాణ ప్రభుత్వ కలిసి వస్తుందని చెప్పారు. అందుకు తెలంగాణ ప్రభుత్వానికి అభినందిస్తున్నట్లు పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా లక్ పతి దీదీ కార్యక్రమం ద్వారా మహిళలను ఆర్థికంగా బలపరుస్తున్నామని శివరాజ్ సింగ్ తెలిపారు. ఇప్పటికే కోట్లాది మహిళలు స్వయం సహాయక సంఘాల ద్వారా బ్యాంకింగ్ వ్యవస్థలో భాగస్వాములయ్యారని చెప్పారు. తర్వాత లక్ష్యం మరింత విస్తరణేనని చెప్పారు. బ్యాంకర్లు కేవలం రుణదాతలుగా కాకుండా భాగస్వాములుగా మారాలని సూచించారు. కాగా ఈ సదస్సు వేదికపై రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క.. కేంద్ర మంత్రి కి పలు వినతిపత్రాలు సమర్పించారు. గ్రామపంచాయతీ ఎన్నికలు పూర్తైన నేపథ్యంలో 15వ ఆర్థిక సంఘం నిధులను తక్షణమే విడుదల చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. అలాగే మహిళా స్వయం సహాయక సంఘాలు స్థాపిస్తున్న సోలార్ ప్లాంట్లకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న రాయితీల గడువును రాబోయే ఆర్థిక సంవత్సరాల వరకు పొడిగించాలని కోరారు. ఈ అంశాలపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు.

# ఉపాధి కల్పించడమే లక్ష్యం

- విద్య, వైద్య రంగాల హబ్ గా ఆందోల్.
- సింగూర్ ద్వారా లక్ష ఎకరాలకు సాగునీరు అందించేందుకు కృషి
- మంత్రి దామోదర్ రాజనర్సింహ



**సంగారెడ్డి, ముద్ర ప్రతినిధి:**

యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలను కల్పించడమే లక్ష్యంగా పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. శనివారం ఆందోల్ మండలం లోని పోసానిపేట్ గ్రామ శివారులో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్ఆర్ డీ డిస్టలరీని మంత్రి ప్రారంభించారు. డిస్టలరీని ఏర్పాటుచేసిన యాజమాన్యాన్ని అభినందించారు. పరిశ్రమలోని అన్ని విభాగాలను పరిశీలించారు . పరిసర ప్రాంతాల్లో ఉన్న వారికి ఈ పరిశ్రమలో ఉపాధి కల్పించడాన్ని స్వాగతించారు. మంత్రి మాట్లాడుతూ ఈ పరిశ్రమ మరింత విస్తరించాలని కోరారు. రానున్న రోజుల్లో మరో ఐదు వందల మందికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు దోహద పడాలని ఆకాంక్షించారు. నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే కంపెనీలకు ప్రోత్సాహం అందించేందుకు తన వంతు కృషి చేస్తామని స్పష్టం చేశారు. అందోళ్ నియోజకవర్గం పరిశ్రమలో ఏర్పాటుకు అనువైన ప్రదేశమన్నారు. నూతనంగా పరిశ్రమలు ఏర్పాటు చేసే వారికి తన వంతు సహాయ సహకారం అందిస్తానని ప్రకటించారు.

ఆందోల్ నియోజక వర్గాన్ని ఎడ్యుకేషనల్, హెల్త్ హబ్ గా తీర్చిదిద్దామని పేర్కొన్నారు. సింగూర్ ప్రాజెక్టు ద్వారా నియోజకవర్గంలో 40 వేల ఎకరాల ఆయకట్టకు సాగునీరు అందిస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలో మరో లక్ష ఎకరాల ఆయకట్టకు సాగునీరు అందించేందుకు ప్రణాళికలు రూపొందించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి పేర్ని నాని, ఎమ్మెల్సీ భాను ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ భూపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు, ఆర్ఆర్ డీ డిస్టలరీ ఎండీ కొండల నిపుణ్ రెడ్డి, కంపెనీ డైరెక్టర్ త్రిష, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అందోల్ జగన్మోహన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ కృష్ణారెడ్డి, జోగిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జగన్మోహన్ రెడ్డి, బండ అభిలాష్ రెడ్డి, తీగల నర్సిరెడ్డి, సుధాకర్ రెడ్డి, వైస్ చైర్మన్ చిట్టిబాబు, కౌన్సిలర్ తోట్ల రామకృష్ణ, మాజీ కోఆప్షన్ సభ్యులు శ్రీకాంత్, మాజీ కౌన్సిలర్ శంకర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శివరాజ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శేషరెడ్డి, మాజీ కౌన్సిలర్ శరత్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# వైద్యం వికటించి వ్యక్తి మృతి

- ఆస్పత్రి ఎదుట బంధువుల ఆందోళన




**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**

నిర్మల్ పట్టణంలోని దేవేందర్ రెడ్డి ఆస్పత్రిలో వైద్యం వికటించి వ్యక్తి మృతి చెందినట్లు బాధిత కుటుంబ సభ్యులు ఆరోపించారు. శనివారం మృతుడి బంధువులు ఆస్పత్రి ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాల ప్రకారం నిర్మల్ నియోజకవర్గం గాజుల నర్సాపూర్ గ్రామానికి చెందిన రాజేందర్ (60) అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స నిమిత్తం స్థానిక దేవేందర్ రెడ్డి ఆస్పత్రిలో చేరాడు. ఆయనకు పరీక్షలు నిర్వహించిన వైద్యులు గుండె సంబంధ సమస్య ఉందని నిర్ధారించి స్టంట్ వేశారు. మరుసటి రోజు మరో స్టంట్ వేసినట్లు మృతుడి బంధువు సునీల్ తెలిపారు. అయినా సమస్య తగ్గక పోవడంతో నిజామాబాద్ కు తరలించాలని వైద్యులు తెలిపారన్నారు. దీంతో నిజామాబాద్ కు తరలించగా ఆసుపత్రిలో చికిత్స చేస్తుండగానే రాజేందర్ మృతి చెందాడని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్మల్ లో దేవేందర్ రెడ్డి ఆస్పత్రిలో సరైన వైద్యం చేయకపోవడం వల్లే చనిపోయాడని సునీల్ ఆరోపించారు. నిజామాబాద్ లో చికిత్స పొందుతున్న ఆస్పత్రికి డాక్టర్ దేవేందర్ రెడ్డి వచ్చి వైద్యం ఖర్చులు తానే భరిస్తానని చెప్పారని సునీల్ పేర్కొన్నారు. వారి తప్పు లేకపోతే అలా చెప్పాల్సిన అవసరం ఏముందని ఆయన ప్రశ్నించారు.. వారి తప్పిదాన్ని గుర్తించి నిజామాబాద్ ఆస్పత్రికి వచ్చారని ఆరోపించారు. దేవేందర్ రెడ్డి ఆస్పత్రిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. మృతుడికి భార్య సత్యగంగవ్వ, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

**ఆస్పత్రి నిర్లక్ష్యం లేదు: డా. దేవేందర్ రెడ్డి**

సంఘటన విషయమై 'ముద్ర ప్రతినిధి' తో వైద్యుడు దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ తమ ఆసుపత్రి నిర్లక్ష్యం లేదని తెలిపారు. తమ ఆస్పత్రిలో స్టెంట్ వేశాక త్రాంబస్ సమస్య ఏర్పడిందని చెప్పారు. వైద్యంలో ఎలాంటి లోపం లేదని స్పష్టం చేశారు.



## 'మేడిన్ ఇండియా చిప్' రావాలి ప్రధాని మోదీ

**ముద్ర, డెస్క్:**

భారత్ అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలంటే స్వావలంబన సాధించడం అవసరమని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. దీనికోసం సెమీకండక్టర్ చిప్‌ల తయారీ సామర్థ్యాన్ని కలిగి ఉండటం ఎంతో ముఖ్యమని తెలిపారు. హెచ్‌సీఎల్ గ్రూప్, ఫాక్స్‌కాన్ కలిసి ఉత్తర్‌ప్రదేశ్‌లోని జేవర్‌లో ఏర్పాటు చేయనున్న సెమీకండక్టర్ పరిశ్రమకు ప్రధాని మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ''వికసిత భారతానికి 'మేడ్ ఇన్ ఇండియా' చిప్‌లు ఎంతో ముఖ్యం. కరోనా సమయంలో చిప్‌ల సరఫరా వ్యవస్థ దెబ్బ తినడంతో.. అనేక ఆర్థిక వ్యవస్థల అభివృద్ధి నిలిచిపోయింది. వివిధ కర్మాగారాల్లో పనులు ఆగిపోయాయి. ఈ నేపథ్యంలో చిప్‌ల తయారీలో స్వావలంబన సాధించాల్సిన అవసరం ఉంది. ప్రస్తుత దశాబ్దంలో సాంకేతికపరంగా మనం తీసుకుంటున్న చర్యలు.. 21వ శతాబ్దంలో దేశ శక్తిసామర్థ్యాలకు పునాదులు అవుతాయి'' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

# కుల గణన డబ్బుల మాటేమిటి?

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**

ప్రభుత్వ కార్యక్రమాలు పూర్తి చేసినా డబ్బులు ఎపుడు అందుతాయో తెలియదన్నది జగమెరిగిన సత్యం. ఇదే క్రమంలో తాము చేసిన కుల గణన సర్వే ఎంట్రీ డబ్బుల మాటేమిటని బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు. గతంలో ప్రభుత్వం కులగణన సర్వే నిర్వహించింది. ఈ సర్వే అనంతరం వివరాలను డిజిటలైజ్ చేసే కార్యక్రమాన్ని నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు ఇవ్వాలని నిర్ణయించారు. డేటా ఎంట్రీ కోసం విద్యార్థులకు పారితోషికం ఇచ్చేందుకు అంగీకరించారు. తాము చదువుకునే సమయంలోనే డబ్బులు సంపాదించుకోవచ్చని ఆనందించారు. ట్రిపుల్ ఐటీలో చదువుతున్న దాదాపు 1,600 మంది విద్యార్థులు 1.90 లక్షల ప్రతుల డేటా ఎంట్రీ చేశారు. ఒక్కో ప్రతి ఎంట్రీ చేసినందుకు గాను రూ.30 చొప్పున ఇస్తామని ప్రకటించారు. నమోదు ప్రక్రియ పూర్తై ఏడాది కావస్తున్నా ఇప్పటికీ డబ్బుల ఊసే లేదు. ఇందుకు సంబంధించి ఎవరూ నోరు మెదపకపోవటంతో తాము రోజుల తరబడి శ్రమించి చేసిన పనికి ప్రతిఫలం ఇవ్వాలని విద్యార్థులు కోరుతున్నారు.



# ఈసారైనా క్లారిటీ వస్తుందా !

- వైసీపీ ఎమ్మెల్సీల రాజీనామాలపై చర్చ
- 25, 26న విచారణకు రావాలి
- నోటీసులు జారీ చేసిన శాసన మండలి చైర్మన్




**ముద్ర, న్యూస్:**


వైసీపీకి రాజీనామా చేసిన ఐదుగురు ఎమ్మెల్సీలకు శాసన మండలి చైర్మన్ మోషెన్ రాజు తాజాగా నోటీసులు జారీ చేశారు. ఈ ఐదుగురు తమ సమక్షంలో జరిగే విచారణకు హాజరు కావాలని ఆ నోటీసులో పేర్కొన్నారు. ఈ నెల 25న విచారణకు హాజరు కావాలని జయ మంగళం వెంకటరమణకు నోటీసులు ఇచ్చారు. ఈ నెల 26న హాజరు కావాలని కళ్యాణ్ చక్రవర్తి, కర్రి పద్మశ్రీ, పోతుల సునీత, మర్రి రాజశేఖర్ లకు నోటీసులు ఇచ్చారు. ఇదిలా ఉంటే ఈ ఐదుగురు ఎమ్మెల్సీలు వైసీపీ ఎన్నికల్లో ఓటమి పాలు కాగానే 2024 లో వరుసగా రాజీనామాలు చేశారు. అంతే కాదు పార్టీకి సైతం గుడ్ బై చెప్పారు. ఇక నాటి నుంచి వీరి రాజీనామాలు అన్నీ చైర్మన్ వద్ద పెండింగులో ఉన్నాయి. తమ రాజీనామాలు ఆమోదించాలని వీరంతా కోరుతూ వచ్చారు. ఇక జయ మంగళం వెంకట రమణ లాంటి వారు అయితే కోర్టుకు సైతం వెళ్లారు. దాంతో కోర్టు కూడా వీరి విషయం చూడాలని కోరింది. అయితే వీరిని విచారించేందుకు స్పీకర్ పిలుస్తున్నారు. వీరు విచారణలో ఏమి చెబుతారో చూడాల్సి ఉంది. వీరు తాము మన స్ఫూర్తిగా రాజీనామాలు చేశామని ఎన్నో సార్లు మీడియా ముందు చెప్పారు. అయితే ఇటీవల జయమంగళం వెంకట రమణ అయితే జగన్ తనకు దేవుడు అన్నట్లుగా మాట్లాడారు. దాంతో అది సంచలనం అయింది. మరి ఆయన మనసు మార్చుకున్నారా లేదా అన్నది చూడాల్సి ఉంది. అలాగే మరి కొందరి విషయనికొస్తే కూటమిలో సరైన ఆదరణ లేదని అంటున్నారు. దాంతో వారు ఏమైనా ఆలోచిస్తున్నారా అన్నది కూడా చర్చకు వస్తోంది. ఇక చైర్మన్ వారిని విచారించి వారి రాజీనామాల విషయంలో కీలక నిర్ణయం తీసుకుంటారా అన్న చర్చ కూడా ఉంది. అదే జరిగితే ఈ ఐదు సీట్లు ఖాళీ అవుతాయి. అప్పుడు వాటిలో ఎన్నికలు పెడితే తిరిగి కూటమికే ఆ సీట్లు వెళ్తాయి. ఎందుకంటే కూటమికే బలం ఉంది కాబట్టి అని అంటున్నారు. మరి ఈ విషయంలో ఇంత కాలం ఆగిన తరువాత ఇప్పుడు విచారణ అంటున్నారు. అంటే వీరి విషయంలో తుది నిర్ణయం తీసుకోవాలని చూస్తున్నారా అని కూడా విశ్లేషిస్తున్నారు. ఒకవేళ వీరి రాజీనామాలు ఆమోదిస్తే కనుక మరింత మంది కూడా వైసీపీ నుంచి వెళ్లిపోతారనే ప్రచారం కూడా ఉంది. అలా శాసన మండలిలో వైసీపీని తగ్గించి తాము బలం పెంచుకోవాలని కూడా టీడీపీ కూటమి చూస్తోందని అంటున్నారు. మొత్తం మీద ఈ నెల 25, 26 తేదీల్లో ఏమి జరగబోతోంది అన్నది మాత్రం ఆసక్తికరంగానే ఉంది. ఏమి జరుగుతుందో చూడాలి మరి కనపర్తి రవి

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
22.02.2026 ఆదివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



ఇండియాలో టాప్ 10 హీరోలు

మహేష్ బాబు
సూపర్ స్టార్‌గా కుటుంబ ప్రేక్షకుల మనసులు గెలుచుకున్నాడు.
క్లాస్ మరియు మాస్ పాత్రల్లో సమతుల్యత చూపుతాడు.



## కాషాయపు విజయంతో కాంగ్రెస్‌కు కౌంట్‌డౌన్ ప్రారంభం

- **కరీంనగర్ సెంటిమెంట్ గుబులు మొదలైంది...**
- **రాష్ట్రంలో కాంగ్రెస్ పని అయిపోయింది... భవిష్యత్తు అంతా బిజెపిదే...**
- **వచ్చే నెలలో జరిగే శిక్షణా తరగతులను విజయవంతం చేయాలి**
- **బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు శాంతి కుమార్**



**ముద్ర, కరీంనగర్ :**

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అనంతరం ప్రప్రథమంగా కరీంనగర్ గడ్డపై తొలిసారిగా మేయర్ స్థానాన్ని కైవసం చేసుకోవడం శుభ పరిణామమని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు శాంతి కుమార్ అన్నారు. శనివారం కరీంనగర్‌లోని సాయి మహాలక్ష్మి గార్డెన్స్‌లో పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ శిక్షణ మహా అభియాన్-2026 కరీంనగర్ జిల్లా కార్యశాల కార్యక్రమం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కరీంనగర్ గడ్డ నుంచే రాష్ట్ర చరిత్రను మార్చే అనేక ఘటనలు జరిగాయని అన్నారు. కరీంనగర్ సెంటిమెంట్‌ను ఎంతోమంది బలంగా విశ్వసిస్తారని, సెంటిమెంట్ గుబులు అన్ని పార్టీలకు మొదలైందన్నారు. చరిత్ర తిరగరాసే విధంగా బల్దియాపై కాషాయ జెండా ఎగరవేసిన బీజేపీకి ఇక తిరుగులేదని శాంతి కుమార్ అన్నారు. కాంగ్రెస్ పాలన పట్ల తీవ్ర ప్రజా వ్యతిరేకత మొదలైందని, రాష్ట్రంలో కాంగ్రెస్ పని అయిపోయిందని, భవిష్యత్తు అంతా బిజెపిదేనన్నారు. ఉచితాలు, హామీలు, ఆరు గ్యారెంటీల పేరిట కాంగ్రెస్ గారడీ చేసి ప్రజలను తీవ్రంగా మోసం చేసిందన్నారు. రెండున్నర ఏళ్లలో కాంగ్రెస్ పూర్తిగా ప్రజా విశ్వాసాన్ని కోల్పోయిందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమాన్ని మరిచి సీఎం కుర్చీని కాపాడుకోవడానికి పడరాని పాట్లు పడుతున్నారని విమర్శించారు. వచ్చే నెల జరగబోయే శిక్షణ మహా అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వ్యక్తి నిర్మాణం ద్వారా సంస్థ నిర్మాణం, సంస్థ నిర్మాణం ద్వారా దేశ నిర్మాణం సాధ్యమని చాటి చెప్పిన పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ చూపించిన మార్గంలో పార్టీ శ్రేణులు నడవాలన్నారు. శిక్షణలో అనేక విషయాలను తెలుసుకునే అవకాశం ఉంటుందని, ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి శిక్షణ కార్యక్రమానికి సంబంధించి పార్టీ శ్రేణులకు మార్గదర్శనం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర రెడ్డి, రాష్ట్ర మహిళా నాయకురాలు నిర్మలారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు మాడ వెంకటరెడ్డి, బత్తుల లక్ష్మీనారాయణ, పార్లమెంటు కన్వీనర్, కార్పొరేటర్ బోయిన్పల్లి ప్రవీణ్ రావు, ఉపాధ్యక్షులు సాయిని మల్లేశం, సీనియర్ నాయకులు గుజ్జ శ్రీనివాస్‌లతోపాటు వివిధ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థుల కోసం 'స్టూడెంట్స్ ప్రొటెక్షన్ ఫోరం' హెల్ప్ లైన్

**ముద్ర, కూకట్‌పల్లి :**

ఎంసెట్, ఐసెట్, పాలిసెట్ తదితర ప్రవేశ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ప్రవేశాల సలహా ప్రక్రియలో ఎదురయ్యే సందేహాలను నివృత్తి చేయడానికి స్టూడెంట్స్ ప్రొటెక్షన్ ఫోరం(ఎస్పీఎఫ్) సేవలను ప్రారంభించింది. శనివారం జవహర్లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం(జెఎన్టీయూ)లో నిర్వహించిన సమావేశంలో ఈ సేవలకు సంబంధించిన గోడపత్రాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఫోరం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించినప్పటికీ సరైన అవగాహన లేక అభిరుచుల నమోదులో పొరపాట్లు చేస్తున్నారని తెలిపారు. దీంతో వారు కోరుకున్న కళాశాలల్లో సీట్లు కోల్పోతున్నారన్నారు. ఫీజు తిరిగి చెల్లింపు నిబంధనలపై స్పష్టత లేక చాలామంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అలాంటి వారికి మార్గనిర్దేశం చేయడమే ఈ హెల్ప్ లైన్ ముఖ్య ఉద్దేశ్యమని చెప్పారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్, వెబ్ ఆప్షన్లు, ఫీజు రీయింబర్స్మెంట్ వంటి విషయాల్లో సందేహాలు ఉన్న విద్యార్థులు 7801009838, 9392868221, 9392325790 నెంబర్లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

## రంజాన్ వేళ పటిష్ట భద్రత

ముద్ర, కూకట్‌పల్లి : రంజాన్ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కేపీహెచ్‌బీ ఇన్‌స్పెక్టరు రాజశేఖర్ రెడ్డి కోరారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ముస్లిం మత పెద్దలు, మసీదు కమిటీ ప్రతినిధులతో ఆయన శనివారం శాంతి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ.. పవిత్ర రంజాన్ మాసంలో ప్రార్థనలకు వచ్చే వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ క్రమబద్ధీకరణతోపాటు పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఎక్కడైనా సమస్యలు తలెత్తితే తక్షణమే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ మసీదుల కమిటీ సభ్యులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## నూతన కౌన్సిలర్లకు ఎంపీ మార్గదర్శనం

**ముద్ర, తాండూర్ :**

తాండూర్ పట్టణంలో ఇటీవల గెలుపొందిన బిజెపి కౌన్సిలర్లు శనివారం చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యు. రమేష్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ భేటీలో కౌన్సిలర్లు ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రజలు విశ్వాసంతో ఎన్నుకున్న ప్రతినిధులుగా వారి నమ్మకాన్ని వమ్ము చేయకూడదని సూచించారు. తమ తమ వార్డుల అభివృద్ధి కోసం ప్రజల పక్షాన నిలబడి కృషి చేయాలని, అవసరమైన సహకారం తన వంతు అందిస్తానని హామీ ఇచ్చారు. ఎంపీని కలిసిన వారిలో పట్టణ అధ్యక్షుడు, 28వ వార్డు కౌన్సిలర్ నాగారం మల్లేశం, 23వ వార్డు కౌన్సిలర్ అంతారం కిరణ్, 33వ వార్డు కౌన్సిలర్ శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చూడాలి

**ముద్ర, కూకట్‌పల్లి :**

కూకట్‌పల్లి నియోజకవర్గంలో జరగనున్న నగర పాలక సంస్థ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధిస్తుందని టీపీసీసీ ఉపాధ్యక్షులు, నియోజకవర్గ బాధ్యులు బండి రమేష్ విశ్వాసం వ్యక్తం చేశారు. శనివారం నియోజకవర్గ పరిధిలోని అన్ని విభాగాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలు, పార్టీ బలోపేతంపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రతి విభాగంలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి, వాటి పరిష్కారానికి అధికారులతో, ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని చెప్పారు. ప్రజలకు సంక్షేమ పథకాలు సక్రమంగా అందేలా చూడాల్సిన బాధ్యత విభాగాల అధ్యక్షులపై ఉందని స్పష్టం చేశారు.

# ఎస్ఎల్బీసీ పునరుద్ధరణ ఎన్నడో..?

- **నల్లగొండ జిల్లా కు సాగు, తాగునీరు అందించే బృహత్తర పథకం ఎస్ఎల్బీసీ**
- **2005 లో మొదలై నేటికీ కొనసాగుతున్న సొరంగం పనులు**
- **ప్రమాదం వల్ల నిలిచిపోయిన పనులు**
- **రెండేళ్లలో పూర్తి చేస్తామని సీఎం ప్రకటన**
- **పనులు పూర్తయితే 4.18 లక్షల ఎకరాలకు సాగు, 516 ఫ్లోరైడ్ పీడిత గ్రామాలకు తాగునీరు**




**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి :**

శ్రీశైలం ఎడమ గట్టు కాలువ (ఎస్ఎల్బీసీ ) పనులు ఎప్పుడు పూర్తవుతుందోనని నల్లగొండ రైతాంగం, ఫ్లోరైడ్ పీడిత గ్రామాల ప్రజలు ఎదురు చూసి విసిగిపోయారు. ఈ ప్రాజెక్టు పనులు ప్రారంభమై రెండు దశాబ్దాలు గడిచినా ఇంకా పనులు ముందుకు సాగడం లేదు. శ్రీశైలం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ నుంచి సొరంగ మార్గం ద్వారా నల్లగొండ జిల్లాకు నీరందించే ఈ బృహత్తర ప్రాజెక్టు కు 2005లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. 2010 నాటికి ఈ ప్రాజెక్టు పనులు పూర్తి చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ఈ సొరంగ( టన్నెల్) మార్గాన్ని రెండు విధాలుగా చేపట్టాలని అధికారులు ప్రణాళిక రూపొందించారు. శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి టన్నెల్ బోరింగ్ మిషన్ (టీబీఎం) ద్వారా సొరంగం తవ్వి వాటి ద్వారా నీటిని తరలించాలని అధికారుల అంచనా. టీబీఎం ద్వారా 43.5 కిలోమీటర్లు సొరంగం తవ్వాల్సి ఉంటుంది. నల్లగొండ వైపు నుంచి డ్రిల్లింగ్, బ్లాస్టింగ్ పద్ధతిలో 7.25 కిలోమీటర్లు సొరంగ మార్గం తవ్వాల్సి ఉంటుంది. ఈ రెండు పద్ధతుల ద్వారా సొరంగ మార్గం పూర్తి చెయ్యాలన్నది ప్రభుత్వ ఉద్దేశ్యం. అభయారణ్యం లో సొరంగ మార్గం తవ్వాలంటే అతి కష్టంతో కూడుకున్న పని. సొరంగ మార్గం టీ బీ ఎం మిషన్ తవ్వుతున్నప్పుడు ఎన్నో అవాంతరాలు జరిగాయి. మిషన్లు పాడవడం, టెక్నికల్ సమస్యలతో సొరంగ మార్గం పనులు ముందుకు సాగలేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో వైఎస్ హయాంలో పనులు చురుకుగా సాగినా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ఈ ప్రాజెక్టు పనులను అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ పట్టించుకోలేదు. వైఎస్ హయాంలో ఈ సొరంగ మార్గం దాదాపు 52శాతం పనులు పూర్తయ్యాయని అప్పటి నీటిపారుదల శాఖ అధికారులు ప్రకటించారు. కెసిఆర్ ముఖ్య మంత్రి గా బాధ్యతలు చేపట్టిన తరువాత ఈ ప్రాజెక్టు కు తగినంత నిధులు కేటాయించలేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో రూ. 2,647 కోట్లు ఈ ప్రాజెక్టు కు ఖర్చు చేసింది. కెసిఆర్ పదేళ్ల పాలనలో ఈ ప్రాజెక్టుకు కేవలం రూ. 500కోట్లు కేటాయింపులు చేసింది. కానీ నిధులు పూర్తి మొత్తంలో ఖర్చు చేయలేదనే విమర్శలున్నాయి. ఈ పదేళ్ల కాలంలో కేవలం 23 శాతం పనులు మాత్రమే జరిగాయి. 2019, 20, 21 ఈ మూడేళ్ళలో ఈ సొరంగ మార్గం పనులకు కెసిఆర్ ప్రభుత్వం కేవలం రూ. 10 కోట్లు కేటాయించిందని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. 2023 లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి రావడం ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన వెంటనే ఈ ఎస్ఎల్బీసీపై దృష్టి పెట్టారు. టీబీఎం మిషన్ ద్వారా ప్రాజెక్టు పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎన్ని నిధులైన ఖర్చు చేసి నల్లగొండ జిల్లాకు నీరందిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఇంకా 25 శాతం పనులు పూర్తవుతే సొరంగం పూర్తిగా అందుబాటులోకి వచ్చి నీటిని తరలించే అవకాశం ఉంటుందని సీఎం ప్రకటించారు. పెండింగ్ లో 25 పనులు పూర్తి చేస్తామని సీఎం పేర్కొనడం తో ప్రాజెక్టు పనులు ఓ కొలిక్కి వచ్చే అవకాశం ఉంది.

**- సొరంగం పనుల్లో ప్రమాదం**

రేవంత్ రెడ్డి అధికారం లోకి వచ్చిన వెంటనే ఎస్ ఎల్ బీ సీ పనులు మళ్ళీ మొదలయ్యాయి. ఇక ప్రాజెక్టు పూర్తవుతుందని అందరూ అనుకున్నారు. కానీ కెసిఆర్ పదేళ్ల కాలం లో ఈ ప్రాజెక్టును పట్టించుకోక పోవడం తో సొరంగ మార్గంలో నీటి ఊట అధికంగా ఉండడం, బురద ఏర్పడం వంటివి సొరంగంలో ఏర్పడడం తో టీబీఎం మిషన్ కు పనులు చేయడం లో ఇబ్బంది పడింది. అలాగే పనులు కొనసాగుతుండడం తో నీటి ఊట ఎక్కువై గత ఏడాది ఫిబ్రవరి లో టన్నెల్లో ప్రమాదం సంభవించింది. టీబీఎం మిషన్ సొరంగం తవ్వుతున్న సమయం లో ఒక్కసారిగా బురద మట్టి టన్నెల్ మొత్తం కప్పేసింది. దీంతో టన్నెల్ మొత్తం బురద తో నిండిపోవడం తో టీబీఎం మిషన్ పూర్తిగా మునిగి పోయింది. పనిచేస్తున్న కార్మికులు బురద లో చిక్కుకుని ప్రాణాలు వదిలారు. మిషన్ ఆపరేటర్ తో పాటు ఎనిమిది మంది కార్మికులు ఈ ప్రమాదం లో చనిపోయారు. దీంతో టన్నెల్ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఇప్పటికి ఈ ప్రమాదం జరిగి ఏడాది కావస్తోంది. మళ్ళీ ఇప్పటి వరకు పనులు మొదలు పెట్టడం లేదు. బురద లోకూరుకుపోయిన టీబీఎం మిషన్ భాగాలను బయటకు తీసివేస్తే పనులు కొనసాగడానికి వీలుంటుందని నీటిపారుదల శాఖ అధికారులు అంటున్నారు.

**- సీఎం ప్రకటనతో చిగురించిన ఆశలు**

శ్రీశైలం ఎడమ గట్టు కాలువ సొరంగం పనులు రెండేళ్లలో పూర్తిచేసి నల్లగొండ జిల్లాకు సాగు, తాగునీరు అందిస్తామని ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించడంతో పనులు పూర్తవుతాయనే ఆశలు చిగురించాయి. ప్రాజెక్టు లో భాగంగా టన్నెల్ పనులు పూర్తి చేసేందుకు ప్రయత్నం జరుగుతుంటే కెసిఆర్ చేసిన తప్పిదానికి టన్నెల్ లో ప్రమాదం జరిగిందని, టన్నెల్ లో ఉన్న టీబీఎం మిషన్ వ్యర్థాలను తొలగించి వెంటనే పనులు ప్రారంభిస్తామని సీఎం పేర్కొన్నారు. రెండేళ్లలో ప్రాజెక్టు పనులు పూర్తి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని సీఎం ప్రకటించారు. సీఎం ప్రకటన తో ఎస్ ఎల్ బీసీ పనులు ముందుకు సాగే అవకాశం ఉంది.

**నల్లగొండ కు వరం**

ఎస్ఎల్బీసీ టన్నెల్ పనులు పూర్తవుతే ఉమ్మడి నల్లగొండ జిల్లా రూపురేఖలు మారుతాయి. జిల్లాలోని పలు ప్రాంతాలను ఈ ప్రాజెక్టు ద్వారా 30టీఎంసీల నీరు అందుతుంది. నల్లగొండ జిల్లా లోని సూర్యాపేట, యాదాద్రి భువనగిరి ప్రాంతాల్లో 4.18 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఇదే జిల్లాలో 516 ఫ్లోరైడ్ పీడిత గ్రామాలకు కృష్ణ నది మంచి నీరు అందుతుంది. ఈ జిల్లాలో ఫ్లోరైడ్ బాధితుల సంఖ్య అధికంగా ఉంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు కెసిఆర్ ఉద్యమ సమయంలో నల్లగొండ జిల్లా ఫ్లోరైడ్ గ్రామాలను ఆంధ్ర పాలకులు పట్టించుకోలేదని విమర్శలు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత సీఎంగా కెసిఆర్ బాధ్యతలు చేపట్టిన పదేళ్ల కాలంలో నల్లగొండ జిల్లా ఫ్లోరైడ్ ప్రాంతాలకు మంచి నీరు అందించే ఎస్ఎల్బీసీ ప్రాజెక్టును పట్టించుకోలేదు. కానీ రేవంత్ రెడ్డి సీఎం అయ్యాక ఈ ప్రాజెక్టును పూర్తి చేసి నల్లగొండ జిల్లా నుంచి ఫ్లోరైడ్ ను శాశ్వతంగా రూపుమాపాలని కంకణం కట్టుకున్నారు. ఐదేళ్ల లో పూర్తి కావాల్సిన ఈ ప్రాజెక్టు రెండు దశాబ్దాల కాలమైనా పూర్తి కాలేదు. సీఎం రేవంత్ రెడ్డి ప్రకటన తో ఈ రెండేళ్లలో పూర్తి అవుతుందని ఈ ప్రాంత ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## వ్యతిరేకత ఏంటో నాకు తెలుసు

- **సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు**

**(మొదటి పేజీ తరువాయి)**

కార్యక్రమాన్ని ప్రారంభించిన రేవంత్ రెడ్డి.. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీకి సంబంధించి ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు.

కాంగ్రెస్ పార్టీలో ఉన్న నాయకులకు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేసే హక్కు ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. పార్టీ మొదటి నుంచి.. భిన్నాభిప్రాయాలు వ్యక్తపరిచే హక్కు ఉందని తెలిపారు. వేర్వేరు అభిప్రాయాలు చెప్పినంత మాత్రాన.. అలాంటి నేతలను వేధించే సంస్కృతి కాంగ్రెస్ పార్టీది కాదని స్పష్టం చేశారు. ఇది గతంలో మహాత్మాగాంధీ ఉన్నప్పటి నుంచి కొనసాగుతోందని చెప్పారు.

**ఘర్షణ పడవద్దు**

కాంగ్రెస్ పార్టీ లో ఉన్న నేతలం మనలో మనం ఘర్షణలకు దిగితే.. పార్టీని కాపాడటం కోసం కష్టపడుతున్న లక్షల మంది కార్యకర్తలకు అన్యాయం చేసినట్లు అవుతుందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల సన్నద్ధత, ప్రజలతో అనుసంధానం కోసం కాంగ్రెస్ పార్టీ తాజాగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన జిల్లా కాంగ్రెస్ కమిటీ (డిస్ట్రిక్ట్ కాంగ్రెస్ కమిటీ-డీసీసీ) అధ్యక్షులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా తాను ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ) అధ్యక్షుడిని అయ్యే సమయానికి కాంగ్రెస్ పార్టీ పరిస్థితి క్లిష్టంగా ఉండేదని ఈ రేవంత్ రెడ్డి గుర్తు చేసుకున్నారు. తాను పార్టీలో ఉన్న కొందరు నేతల నుంచి తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొన్నానని తెలిపారు. తన ఆలోచనలను పార్టీలోని అందరి నేతలను కలిసి చెప్పి అందర్నీ ఒప్పించానని వెల్లడించారు. కార్యకర్తలు, నేతలు అందరూ కలిసి కృషి చేయడంతోనే పార్టీకి ఓటింగ్ పెరిగిందని తెలిపారు. గతంలో డీసీసీ అధ్యక్షులుగా మంచిగా పనిచేసిన వారికి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ఇచ్చామని గుర్తు చేశారు.

కాంగ్రెస్ పార్టీ కోసం కృషి చేసిన మరో 60 మంది నేతలకు కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు ఇచ్చామని రేవంత్ రెడ్డి వెల్లడించారు. నేతలందరి పనితీరుపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉంటుందని పేర్కొన్న సీఎం.. మెరిట్ ఉన్నవారికి కచ్చితంగా న్యాయం జరుగుతుందని హామీ ఇచ్చారు. కాంగ్రెస్‌లో ఎలాంటి లిస్టులకు చోటు లేదని.. కేవలం మెరిట్ లిస్ట్ ప్రకారమే అవకాశాలు వస్తాయని స్పష్టం చేశారు. డీసీసీ పదవి చాలా విలువైందని.. వచ్చిన అవకాశం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డీసీసీ పదవి ఎన్నో పదవులకు తలుపులు తెరుస్తుందని.. పీసీసీ, ఎమ్మెల్యే, ఎంపీ, సీఎం కూడా కావొచ్చని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఇక గాంధీ కుటుంబంపై వస్తున్న ఆరోపణలపై స్పందించిన రేవంత్ రెడ్డి.. దేశం కోసం ఆస్తులు, ప్రాణాలు త్యాగం చేసిన గొప్ప కుటుంబం గాంధీలది అని గుర్తు చేశారు. దేశం కోసం రూ.వేల కోట్ల ఆస్తులను మోతీలాల్ నెహ్రూ త్యాగం చేశారని.. ఎన్నో ఏళ్లు జవహర్‌లాల్ నెహ్రూ జైలులో ఉన్నారని గుర్తు చేశారు. భారతదేశం కోసం ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ ప్రాణాలు అర్పించారని పేర్కొన్నారు. దేశంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు రాహుల్ గాంధీ పాదయాత్ర చేశారని.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాదయాత్ర చేసి ప్రజల మధ్య నడిచారని పేర్కొన్నారు. గాంధీల కుటుంబంపై అవినీతి ఆరోపణలు గట్టిగా తిప్పికొట్టాలని కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు రేవంత్ రెడ్డి సూచించారు.

**పార్టీని విచ్ఛిన్నం చేసే కుట్ర**

దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన 140 ఏళ్ల చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీని విచ్ఛిన్నం చేసేందుకు బీజేపీ కుట్ర చేస్తోందని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. గాంధీ, ఇందిరా, రాజీవ్ గాంధీలు దేశ సమగ్రత కోసం ప్రాణాలు అర్పించారని, అటువంటి త్యాగధనుల కుటుంబానికి చెందిన సోనియా, రాహుల్ గాంధీలను అక్రమ కేసులతో ఇబ్బంది పెట్టడం దుర్మార్గమని పేర్కొన్నారు.

అందరినీ కలుపుకుపోవడమే విజయం

కష్టం తెలియకుండా పదవులు పొందే అవకాశం ఉన్నా, ప్రజల కోసం రాహుల్ గాంధీ 4000 కిలోమీటర్ల పాదయాత్ర చేశారని, అలాగే వైఎస్ షర్మిల కూడా వారసత్వ పదవులను ఆశించకుండా తెలంగాణలో 3000 కిలోమీటర్ల పాదయాత్ర చేసి ఇప్పుడు ఏపీలో పార్టీ కోసం శ్రమిస్తున్నారని వారి అంకితభావాన్ని ప్రశంసించారు. డీసీసీ అధ్యక్షులు తమను తాము జిల్లాకు అధిపతులుగా భావించవద్దని, వ్యతిరేకించిన వారిని అణచివేసే ప్రయత్నం చేయవద్దని రేవంత్ రెడ్డి సూచించారు. తాను పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ప్రతి నాయకుడి ఇంటికి వెళ్లి మద్దతు కోరానని, ఆ ఐక్యత వల్లే పార్టీ ఓటు బ్యాంకు 2 శాతం నుండి 40 శాతానికి పెరిగి అధికారం దక్కిందని గుర్తు చేశారు. 119 నియోజకవర్గాల్లో 42 లక్షల డిజిటల్ సభ్యత్వాలను నమోదు చేయించడం పార్టీ పట్ల ప్రజల్లో ఉన్న నమ్మకానికి నిదర్శనమని, బాగా పనిచేసిన డీసీసీ అధ్యక్షులకు ఎమ్మెల్యేలుగా, అనుబంధ విభాగాల నేతలకు కార్పొరేషన్ పదవుల్లో అవకాశం కల్పించామని స్పష్టం చేశారు.

**కుట్రలను తిప్పికొట్టాలి.. మెరిట్ కోటాకే ప్రాధాన్యం**

రాజ్యాంగాన్ని మార్చేందుకు జరుగుతున్న కుట్రలను తిప్పికొట్టాల్సిన సమయం ఆసన్నమైందని, ఈ శిక్షణా తరగతులను అధ్యక్షులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాంగ్రెస్ పార్టీలో ఏ కోటా ఉండదని, కేవలం మెరిట్ కోటా మాత్రమే ఉంటుందని, పైరవీలకు తావులేకుండా ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేయాలని ఆదేశించారు. తెలంగాణలో 100 ఏళ్ల తర్వాత కులగణన చేపట్టామని, ఎస్సీ వర్గీకరణ అమలు చేసి దేశానికి ఆదర్శంగా నిలిచామని, సర్పంచ్ ఎన్నికల్లో 49.83 శాతం బీసీలు, మున్సిపల్ ఎన్నికల్లో 63 శాతం ఓబీసీలు ఎన్నికవ్వడం కాంగ్రెస్ సాధించిన సామాజిక విజయమని ఆయన వివరించారు.

**రెండు రాష్ట్రాల అభివృద్ధి - కాంగ్రెస్ లక్ష్యం**

వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, పార్టీ విశ్వాసాన్ని దెబ్బతీయకుండా బాధ్యతగా మెలగాలని రేవంత్ రెడ్డి హితవు పలికారు. తాను ఏనాడూ పైరవీలు చేయలేదని, 16 ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో జెడ్పీటీసీ నుంచి ముఖ్యమంత్రి వరకు కాంగ్రెస్ తనకు అన్ని అవకాశాలు ఇచ్చిందని గుర్తు చేసుకున్నారు. తెలుగు రాష్ట్రాలు రెండుగా విడిపోయినా, రెండు చోట్లా కాంగ్రెస్ బలోపేతం కావాలని, రెండు రాష్ట్రాలు కలిసికట్టుగా అభివృద్ధి చెందాలన్నదే తన ఆకాంక్షని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.



## గ్రామాభివృద్ధిలో సర్పంచులది కీలకపాత్ర

- **ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి**

**ముద్ర, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రతినిధి :**

గ్రామాల అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకమని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. పంచాయతీ రాజ్ చట్టాలు నిర్దేశించిన విధులు, బాధ్యతలు, అధికారాలపై సరైన అవగాహన పెంచుకొని గ్రామాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని సర్పంచ్ లకు సూచించారు. శనివారం ముచ్చింతల్ స్వర్ణ భారతి ట్రస్టులో ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, రాజేంద్రనగర్ నియోజకవర్గం శంషాబాద్ మండల నూతన సర్పంచ్ లకు శిక్షణా ముగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. నూతనంగా ఎన్నికైన సర్పంచ్ లు బాధ్యతలు విధులను విస్మరించరాదన్నారు. గ్రామాభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర అత్యంత కీలకమన్నారు. ప్రభుత్వ పథకాలను సమర్ధవంతంగా అమలు చేసి గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే రంగారెడ్డి సూచించారు. అనంతరం శిక్షణ పూర్తి చేసిన సర్పంచ్‌లకు సర్టిఫికెట్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్ మాట్లాడుతూ.. పంచాయతీ పరిపాలన, ఆర్థిక నిర్వహణ, ఉపాధి హామీ పథకం అమలు తదితర అంశాలపై సర్పంచ్ లు పూర్తిగా అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో శిక్షకులుగా ముగ్గురు డీఎల్పీవోలు, ఇద్దరూ ఎంపిడీవోలు, ఇద్దరూ ఎంపీవోలు, ఒక ఈజీఎస్ ఈసీ, టీఎలు పాల్గొని శిక్షణను సమర్ధవంతంగా నిర్వహించారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
22.02.2026 ఆదివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



ఇండియాలో టాప్ 10 హీరోలు

విజయ్ (తలపతి)
తమిళ ఇండస్ట్రీలో మాస్ హీరోగా భారీ ఫ్యాన్ బేస్ కలిగి ఉన్నాడు. కమర్షియల్ సినిమాలతో బాక్సాఫీస్ వద్ద సక్సెస్ సాధిస్తాడు.





# "ప్రపంచంలో అందరికంటే లక్కీ గర్ల్ నేనే"

టీమిండియా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యాతో ఉన్న బంధంపై మహీక శర్మ ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. తన పుట్టిన రోజు సందర్భంగా హార్దిక్‌తో కలిసి దిగిన ఫొటోలను పంచుకుంటూ, "నా జీవితంలో ఇదే అత్యుత్తమ పుట్టినరోజు. ప్రపంచంలో అందరికంటే లక్కీ గర్ల్ నేనే" అంటూ భావోద్వేగంగా స్పందించింది. హార్దిక్ కూడా ఆమెను తన జీవితంలో ప్రత్యేక వ్యక్తిగా పేర్కొంటూ శుభాకాంక్షలు తెలిపాడు. ఈ జంట పోస్టులు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.



# ఆసీస్ గడ్డపై చరిత్ర సృష్టించిన మహిళా జట్టు

ఆస్ట్రేలియా పర్యటనలో భారత మహిళల క్రికెట్ జట్టు చరిత్రాత్మక విజయాన్ని నమోదు చేసింది. మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను 21 తేడాతో కైవసం చేసుకుని, ఆస్ట్రేలియా నేలపై తొలిసారి టీ20 సిరీస్‌ను గెలిచింది. అడిలైడ్ వేదికగా జరిగిన నిర్ణయాత్మక మూడో మ్యాచ్‌లో భారత్ 17 పరుగుల తేడాతో విజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన భారత జట్టు 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 176 పరుగులు సాధించింది. స్మృతి మంధాన 82 పరుగులతో ఇన్నింగ్స్‌కు బలమైన పునాది వేసింది. జెమీమా రోడ్రిగ్స్ 59 పరుగులతో కీలక భాగస్వామ్యం అందించింది. ఈ ఇద్దరూ రెండో వికెట్‌కు 121 పరుగులు జోడించి మ్యాచ్‌పై పట్టు సాధించారు. చివర్లో రిచా ఘోష్ వేగంగా ఆడి స్కోరును పెంచింది. అయితే వరుస రనౌట్లు కారణంగా ఆశించిన దానికంటే ఎక్కువ స్కోరు సాధించలేకపోయింది. 177 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆస్ట్రేలియా జట్టు 159/9కే పరిమితమైంది. ఆష్లే గార్డెనర్ 57 పరుగులతో పోరాడినా ఫలితం మారలేదు. భారత బౌలర్లలో శ్రేయాంక పాటిల్ మూడు వికెట్లు తీసి కీలకంగా నిలిచింది. శ్రీ చరణి కూడా మూడు వికెట్లు సాధించింది. అరుంధతి రెడ్డి రెండు వికెట్లు తీసింది. రేణుకా సింగ్ ఠాకూర్ ఒక వికెట్ దక్కించుకుంది. మ్యాచ్‌లో అద్భుత ప్రదర్శన చేసిన స్మృతి మంధానకు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. సిరీస్‌లో తొలి మ్యాచ్ భారత్ గెలవగా, రెండో మ్యాచ్ ఆస్ట్రేలియా దక్కించుకుంది. చివరి పోరులో గెలిచి సిరీస్‌ను భారత్ సొంతం చేసుకుంది.

# ఇక సూపర్-8 సమరం

- **తొలి మ్యాచ్ న్యూజిలాండ్ తో పాక్ ఢీ**
- **రేపు సౌతాఫ్రికాతో టీమిండియా ఢీ**
- **లంకలో లంకను ఎదుర్కోబోతున్న ఇంగ్లండ్**
- **దిగ్గజాల పోరుతో పొట్టికప్ రక్తికట్టడం ఖాయం**

టీ20 వరల్డ్‌కప్‌లో లీగ్ దశ ముగియడంతో ఇప్పుడు అసలు పోరు మొదలుకానుంది. సూపర్ 8 దశలో ప్రపంచ క్రికెట్ దిగ్గజాలు పరస్పరం తలపడేందుకు సిద్ధమయ్యాయి. ప్రతి మ్యాచ్ సెమీఫైనల్‌కు దారితీసే కీలక పోరుగా మారడంతో టోర్నీ మరింత రక్తికట్టడం ఖాయంగా కనిపిస్తోంది.

**న్యూజిలాండ్‌తో పాక్ తొలి సమరం**

సూపర్ 8లో మొదటి మ్యాచ్‌లో పాకిస్థాన్ న్యూజిలాండ్‌ను ఎదుర్కొంటోంది. ఇరుజట్లు లీగ్ దశలో నిలకడైన ప్రదర్శనతో ముందుకు వచ్చాయి. కీలక ఆటగాళ్ల ఫామ్ ఈ మ్యాచ్ ఫలితాన్ని ప్రభావితం చేసే అవకాశముంది. నాకౌట్ తరహా ఒత్తిడిలో ఎవరు మెరుగ్గా ఆడతారన్నదే ఆసక్తికరంగా మారింది.

**రేపు సౌతాఫ్రికాతో భారత్ పోరు**

భారత్ సూపర్ 8లో తొలి మ్యాచ్‌ను సౌతాఫ్రికాతో ఆడనుంది. గ్రూప్ దశలో అజేయంగా నిలిచిన టీమిండియా ఉత్సాహంగా బరిలోకి దిగుతోంది. మరోవైపు సౌతాఫ్రికా కూడా సమతూక జట్టుతో సవాల్ విసరడానికి సిద్ధంగా ఉంది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో సమాన బలం ఉన్న ఈ రెండు జట్ల మధ్య పోరు ఉత్కంఠభరితంగా ఉండే అవకాశం ఉంది.

**లంకలో లంకను ఎదుర్కొనున్న ఇంగ్లండ్**

ఇంగ్లండ్ జట్టు శ్రీలంకను వారి సొంత నేలపై ఢీకొనబోతోంది. పరిస్థితులకు అలవాటు ఉన్న లంక జట్టుకు ఇది ప్రయోజనకరమవుతుందా, లేక ఇంగ్లండ్ దూకుడు ఆతిథ్య జట్టును మట్టికరిపిస్తుందా అన్నది చూడాలి. ఇరుజట్లకు ఇది కీలక మ్యాచ్‌గా మారింది.

**సెమీస్ దారిలో కీలక పోరులు**

సూపర్ 8 దశలో ప్రతి జట్టు మూడు మ్యాచ్‌లు ఆడనుంది. పాయింట్ల పట్టికలో మొదటి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు సెమీఫైనల్‌కు చేరతాయి. చిన్న తప్పిదం కూడా టోర్నీ నుంచి నిష్క్రమణకు దారితీసే అవకాశం ఉండటంతో ప్రతి బంతి, ప్రతి పరుగుకు ప్రాధాన్యం పెరిగింది.

దిగ్గజాల మధ్య జరుగుతున్న ఈ సూపర్ 8 సమరం టీ20 వరల్డ్‌కప్‌ను మరింత ఉత్కంఠభరితంగా మార్చనుంది. అభిమానులకు ఇకపై ప్రతి రోజు హై వోల్టేజ్ పోరులే.



# సూపర్8 సమరం ప్రారంభం..

- **సెమీస్‌కు ఎన్ని విజయాలు అవసరం?**


న్యూఢిల్లీ: టీ20 ప్రపంచకప్2026లో సూపర్8 దశ పోటీలు మొదలయ్యాయి. పాకిస్తాన్-న్యూజిలాండ్ మ్యాచ్‌తో ఈ దశకు శ్రీకారం చుట్టారు. మొత్తం ఎనిమిది జట్లు సూపర్8కు చేరుకోగా, వాటిని నాలుగు జట్ల చొప్పున రెండు గ్రూపులుగా విభజించారు. గ్రూప్1లో భారత్, దక్షిణాఫ్రికా, జింబాబ్వే, వెస్టిండీస్ ఉన్నాయి. గ్రూప్2లో శ్రీలంక, న్యూజిలాండ్, పాకిస్తాన్, ఇంగ్లాండ్ జట్లు చోటు దక్కించుకున్నాయి.

**ప్రతి జట్టుకు మూడు మ్యాచ్‌లు**

సూపర్8 దశలో ప్రతి జట్టు తమ గ్రూప్‌లోని మిగతా మూడు జట్లతో ఒక్కసారి చొప్పున తలపడుతుంది. అంటే ఒక్కో జట్టు మొత్తం మూడు మ్యాచ్‌లు ఆడుతుంది. గ్రూప్ దశ ముగిసిన తర్వాత పాయింట్ల పట్టికలో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు సెమీఫైనల్‌కు అర్హత సాధిస్తాయి. సెమీస్‌లో గ్రూప్1లో అగ్రస్థానంలో నిలిచిన జట్టు, గ్రూప్2లో రెండో స్థానంలో నిలిచిన జట్టుతో తలపడుతుంది. అలాగే గ్రూప్2 టాప్ జట్టు, గ్రూప్1 రన్నరప్‌తో పోటీపడుతుంది.

**సెమీఫైనల్‌కు మార్గం ఎలా?**

మూడు మ్యాచ్‌లన్నింటినీ గెలిస్తే ఏ జట్టుకైనా సెమీస్ బెర్త్ ఖాయం. రెండు విజయాలు సాధించినా అవకాశాలు బలంగా ఉంటాయి. అయితే ఒకే గ్రూప్‌లో మూడు జట్లు రెండేసి మ్యాచ్‌లు గెలిస్తే, నెట్ రన్‌రేట్ ఆధారంగా అర్హత నిర్ణయించబడుతుంది. వర్షం కారణంగా మ్యాచ్‌లు రద్దు కాకపోతే సాధారణంగా కనీసం రెండు విజయాలు సెమీఫైనల్ దిశగా కీలకం అవుతాయి. దీంతో ప్రతి మ్యాచ్ జట్లకు అత్యంత ప్రాధాన్యంగా మారింది.



# టీమిండియాపై ఒత్తిడి ఎక్కువే..: కర్స్టన్

సౌతాఫ్రికా క్రికెట్ జట్టు హెడ్ కోచ్ షుక్రి కన్రాడ్ టీమిండియాను ఉద్దేశించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. భారీ అంచనాలు ఉండటంతో భారత్ జట్టు ఎప్పుడూ ఒత్తిడిలోనే ఉంటుందని, ఆ పరిస్థితిని తమకు అనుకూలంగా మలుచుకుంటామని తెలిపారు. గతంలో టీ20 ప్రపంచకప్2024 ఫైనల్లో సౌతాఫ్రికాను ఓడించి భారత్ టైటిల్ సాధించిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు.



**అజేయంగా సూపర్-8లో భారత్**

టీ20 ప్రపంచకప్2026లో సొంత గడ్డపై హాట్ ఫేవరెట్‌గా బరిలోకి దిగిన భారత్ గ్రూప్ దశలో ఒక్క మ్యాచ్ కూడా కోల్పోకుండా సూపర్8కు చేరింది. మరోవైపు సౌతాఫ్రికా కూడా వరుస విజయాలతో తదుపరి దశకు అర్హత సాధించింది. ఈ నేపథ్యంలో ఆదివారం అహ్మదాబాద్ వేదికగా ఇరు జట్లు తలపడనున్నాయి.

**అంచనాలే ఒత్తిడికి కారణం**

కన్రాడ్ మాట్లాడుతూ, భారత్ వంటి జట్టుపై ఎప్పుడూ భారీ అంచనాలు ఉంటాయని పేర్కొన్నారు. సెమీఫైనల్, ఫైనల్ లక్ష్యంగా ముందుకు సాగే క్రమంలో ఆ జట్టుపై పరిశీలన, విమర్శలు అధికంగా ఉంటాయని అన్నారు. అదే ఒత్తిడి మ్యాచ్‌లలో ప్రభావం చూపుతుందని, దానిని తమ జట్టు సద్వినియోగం చేసుకునే ప్రయత్నం చేస్తుందని వెల్లడించారు. అయితే పటిష్ట భారత జట్టుతో పోటీపడటం తమకూ సవాలే అని స్పష్టం చేశారు.

**గత రికార్డులు భారత్ వైపు**

ఇటీవల భారత్ పర్యటనకు వచ్చిన సౌతాఫ్రికా టీ20 సిరీస్‌లో 31 తేడాతో ఓటమి చవిచూసింది. అయినప్పటికీ ప్రపంచకప్ వంటి మెగా టోర్నీల్లో గత ఫలితాలు పెద్దగా ప్రభావం చూపవని కన్రాడ్ అభిప్రాయపడ్డారు. ఇప్పటివరకు టీ20 ప్రపంచకప్‌లో భారత్‌సౌతాఫ్రికా జట్లు ఏడుసార్లు ఎదురెదురయ్యాయి. అందులో భారత్ ఐదు మ్యాచ్‌లు గెలవగా, సౌతాఫ్రికా రెండు విజయాలు సాధించింది.

# రాజకీయ నిర్ణయాలే కారణం..

- **బంగ్లాదేశ్ వైదొలగడంపై కోచ్ ఆవేదన**

టీ20 ప్రపంచకప్2026 నుంచి బంగ్లాదేశ్ జట్టు తప్పుకోవడం ఆ దేశ క్రికెట్‌లో తీవ్ర చర్చకు దారి తీసింది. భద్రతా కారణాలను చూపిస్తూ భారత్‌లో ఆడేందుకు నిరాకరించిన నిర్ణయంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో బంగ్లాదేశ్ సీనియర్ అసిస్టెంట్ కోచ్ మహమ్మద్ సలాహుద్దీన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మాజీ క్రీడా సలహాదారు ఆసిఫ్ నజ్రుల్ను ఉద్దేశించి పరోక్షంగా విమర్శలు గుప్పించారు.

**ఆటగాళ్ల కలలు ఛిన్నాభిన్నం**

బంగ్లాదేశ్ క్రికెట్ లీగ్‌కు ముందు నిర్వహించిన మీడియా సమావేశంలో సలాహుద్దీన్ భావోద్వేగంగా స్పందించారు. వరల్డ్‌కప్ వంటి మెగా టోర్నీలో ఆడాలనే లక్ష్యంతో ఆటగాళ్లు దశాబ్దాల పాటు కష్టపడతారని పేర్కొన్నారు. అలాంటి ఆశయాన్ని రాజకీయ నిర్ణయాలతో ఒక్కసారిగా దెబ్బతీయడం బాధాకరమని అన్నారు.ఈ నిర్ణయం జట్టుపై తీవ్ర మానసిక ప్రభావం చూపిందని ఆయన వెల్లడించారు. ఇద్దరు కీలక ఆటగాళ్లు కొన్ని రోజులు తీవ్ర దిగ్భ్రాంతిలోకి వెళ్లారని చెప్పారు. దేశం కోసం ప్రాణాలు పెట్టే క్రీడాకారుల కలలు ఇలా చెదిరిపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.



**వ్యవస్థ బాధ్యత ఎవరిది?**

ఆటగాళ్లు తమ వంతు త్యాగాలకు సిద్ధంగా ఉంటారని, కానీ వ్యవస్థ తీసుకున్న నిర్ణయాల వల్ల వారికి జరిగిన నష్టాన్ని ఎవరూ పూడ్చలేరని సలాహుద్దీన్ అన్నారు. ఈ ఘటన బంగ్లాదేశ్ క్రికెట్ చరిత్రలో మర్చిపోలేని అధ్యాయంగా మిగిలిపోతుందని వ్యాఖ్యానించారు.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
22.02.2026 ఆదివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



## గ్లామ్ మీటర్ బ్రేక్ చేసిన కల్యాణి ప్రియదర్శన్






గతేడాది 'లోక చాప్టర్ 1లో నటనతో ఆకట్టుకున్న కల్యాణి ప్రియదర్శన్ ఇప్పుడు గ్లామర్ లుక్‌తో ట్రెండ్ అవుతోంది. ది హానర్స్ బై హాలీవుడ్ రిపోర్టర్ ఇండియా కోసం చేసిన తాజా ఫోటోషూట్ చిత్రాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. షిమ్మరింగ్ గోల్డెన్ ఆఫ్‌షోల్డర్ గౌన్‌లో కల్యాణి ఎలిగెంట్‌గా మెరిసింది. బేజ్ సోఫాపై రిలాక్స్‌డ్ పోజ్‌తో కూర్చున్న ఆమె లుక్ క్లాసీగా కనిపించింది. సాఫ్ట్ మేకప్, న్యూడ్ లిప్స్, లూజ్ వేవీ హెయిర్ స్టైల్ మొత్తం స్టైలింగ్‌కు రిచ్ టచ్ ఇచ్చాయి. సింపుల్‌గా ఉన్నా గ్లామర్ డోస్ మాత్రం హైగా కనిపిస్తోంది. ప్రస్తుతం ఆమె తమిళంలో చిత్రాలు 'జీని, 'మార్షల్ చిత్రాలతో జీగా ఉంది.

## అల్లు పార్టీలో మెగా కుటుంబం సందడి

అల్లు ఇంట పెళ్లి శుభవార్తలతో సందడి నెలకొంది. అల్లు శిరీష్–నయనికల వివాహం మార్చి 6న జరగనుండగా, వేడుకల ఏర్పాట్లు వేగంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా అల్లు అర్జున్ తన నివాసంలో గ్రాండ్ పార్టీ ఏర్పాటు చేశారు. ఈ వేడుకకు రామ్ చరణ్ దంపతులతో పాటు మెగా కుటుంబ సభ్యులు, టాలీవుడ్ ప్రముఖులు హాజరై సందడి చేశారు. పార్టీకి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతూ అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. ఇటీవల దుబాయ్‌లో ఫ్రెండ్స్‌తో బ్యాచిలర్ పార్టీ జరగగా, ఇప్పుడు కుటుంబ సభ్యులు, సినీ స్నేహితుల కోసం ప్రత్యేక విందు ఏర్పాటు చేశారు. గత ఏడాది అక్టోబర్‌లో శిరీష్–నయనికల నిశ్చితార్థం జరిగింది. తొలి శుభలేఖను శిరీష్ తన మావయ్య, మెగాస్టార్ చిరంజీవికు అందించి ఆశీస్సులు తీసుకున్న విషయం తెలిసిందే.

## 46 ఏళ్ల తర్వాత చేతులు కలిపిన స్టార్స్

### రజనీకమల్ మూవీ ప్రోమో రిలీజ్ చేసిన మేకర్స్



భారతీయ సినీ చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించిన ఇద్దరు మహానటులు — కమల్ హాసన్ మరియు రజనీకాంత్ — మరోసారి ఒకే ఫ్రేమ్‌లో కనిపించబోతుండటం అభిమానుల్లో అపార ఉత్సాహాన్ని రేకెత్తిస్తోంది. దాదాపు 46 ఏళ్ల తర్వాత ఈ లెజెండరీ కాంబినేషన్ రీయూనియన్ కావడం విశేషం. ఈ భారీ మల్టీస్టారర్ ప్రాజెక్ట్‌ను మేకర్స్ అధికారికంగా ప్రకటించడంతో పాటు ప్రత్యేక గ్లింప్స్ విడుదల చేసి అంచనాలను మరింత పెంచేశారు. ప్రస్తుతం 'KHxRK' అనే వర్కింగ్ టైటిల్‌తో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. ఆయనకు 'జైలర్'తో వచ్చిన విజయానంతరం ఈ ప్రాజెక్ట్‌పై సహజంగానే భారీ క్రేజ్ ఏర్పడింది. సంగీతాన్ని యువ సంచలనం అనిరుధ్ రవిచందర్ అందిస్తుండగా, నిర్మాణ బాధ్యతలను రెడ్ జెయింట్ మూవీస్ చేపట్టింది. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రం ఇప్పటికే ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. విడుదలైన గ్లింప్స్‌లో కమల్-రజనీ ఇద్దరూ తమదైన స్టైల్‌లో మెరిసిపోయారు. ఎవరి రూమ్‌లోకి ముందుగా వెళ్లాలనే చిన్నపాటి సందిగ్ధతలో దర్శకుడు కనిపించడం, సంగీతం కోసం అనిరుధ్ వినూత్నంగా ట్యూన్ సెలెక్ట్ చేసుకోవడం వంటి సన్నివేశాలు సరదాగా ఆకట్టుకుంటాయి. కాస్ట్యూమ్స్ నుంచి కళ్లద్దాల వరకు ప్రతి అంశంలో ఇద్దరి వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించేలా విజువల్స్ డిజైన్ చేశారు. ప్రత్యేకంగా ఇద్దరూ ఎదురెదురుగా నిలబడే షాట్ గ్లింప్స్‌కు హైలైట్‌గా నిలిచింది. రజనీ తనదైన మానరిజంతో కారు కీ విసరడం, దాన్ని కమల్ అందుకుని డ్రైవర్ సీట్‌లో కూర్చోవడం అభిమానులకు పండగ వాతావరణాన్ని సృష్టిస్తోంది. చివర్లో 'హీరో ఎవరు?' అన్న ప్రశ్నను ఇద్దరూ సరదాగా అడిగే సన్నివేశం సినిమాపై ఆసక్తిని రెట్టింపు చేస్తోంది. ఈ చిన్న వీడియోతోనే మేకర్స్ భారీ అంచనాలకు నాంది పలికారనే చెప్పాలి. టెక్నికల్ విభాగంలో నూ బలమైన టీమ్‌ను తీసుకున్నారు. సినిమాటోగ్రఫీ బాధ్యతలను రాజీవ్ మీనన్ నిర్వహించగా, ఎడిటింగ్‌ను ఆర్. నిర్మల్ చూసుకుంటున్నారు. ఆర్ట్ డైరెక్షన్ డీఆర్కే కిరణ్ ఆధ్వర్యంలో సాగుతోంది. త్వరలో పూర్తి నటీనటులు, కథా నేపథ్యం వంటి వివరాలు వెల్లడించే అవకాశముంది. మొత్తానికి, 46 ఏళ్ల తర్వాత కమల్ హాసన్-రజనీకాంత్ కలయిక భారతీయ సినిమాకు మరో గుర్తుండిపోయే అధ్యాయంగా మారే సూచనలు కనిపిస్తున్నాయి. అభిమానులు ఈ రీయూనియన్‌ను తెరపై చూడటానికి ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు.

## మూడు రోజులు నిద్ర పోలేదు

### శివాజీ



మహిళల దుస్తులపై చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో మరోసారి స్పందించిన నటుడు శివాజీ, ఆ సందర్భంలో ఉపయోగించిన రెండు పదాలపై ఇప్పటికీ బాధగా ఉందని అన్నారు. మహిళలు ఎలా దుస్తులు ధరించారన్న కారణంతో వారి వ్యక్తిత్వాన్ని నిర్ణయించడం సరైంది కాదని స్పష్టం చేశారు. ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, "ఆ రోజు నేను వాడిన రెండు పదాలు అవసరం లేనివి. అవి చెప్పకూడదు. అదే విషయాన్ని అప్పుడే ఒప్పుకున్నాను. కానీ ఇప్పటికీ ఆ విషయం గుర్తొస్తే బాధేస్తుంది. నేను ఎప్పుడూ కంట్రోల్ కోల్పోయి మాట్లాడను. ఎన్నో చర్చల్లో పాల్గొన్నా మాట జారలేదు. కానీ ఆ రోజు ఎందుకో అలా జరిగిపోయింది" అని తెలిపారు. ఆ సంఘటన తర్వాత మానసికంగా కలత చెంది, కొన్ని రోజులు నిద్ర కూడా పోలేదని చెప్పారు. నటి అనసూయ భరద్వాజ్పై తాను ఎలాంటి వ్యక్తిగత వ్యాఖ్యలు చేయలేదని ఆయన స్పష్టం చేశారు. ఆమెపై తనకు గౌరవమే ఉందని పేర్కొన్నారు. మొత్తంగా, ఆ వ్యాఖ్యల వల్ల ఎవరికైనా మనస్తాపం కలిగితే క్షమాపణలు చెప్పడానికీ తాను వెనుకాడనని శివాజీ తెలిపారు.

## ఇక "నా కేరాఫ్ హిందూపురమే"

**హీరో, ఎమ్మెల్యే బాలకృష్ణ వన్నమ్మ కాలనీలో సొంతింటి నిర్మాణానికి భూమిపూజ**

హిందూపురం పట్టణంలోని వన్నమ్మ కాలనీలో ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ శుక్రవారం తన సొంత గృహ నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఉదయం శాస్త్రోక్తంగా జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన సతీమణి వసుంధరతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ, తన తండ్రి నందమూరి తారకరామారావును హిందూపురం ప్రజలు మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించి ముఖ్యమంత్రిగా నిలబెట్టారని గుర్తుచేశారు. అదే విశ్వాసంతో తనను కూడా వరుసగా మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించారని చెప్పారు. ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో హిందూపురంలోనే సొంత ఇల్లు నిర్మించాలనుకున్నానన్నారు. నియోజకవర్గ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని, ఇప్పటికే పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## మమ్మల్నీ ఎదగనివ్వండి

**'సరస్వతి' ట్రైలర్ లాంచ్‌లో భావోద్వేగానికి గురైన వరలక్ష్మి**

తొలి సారి దర్శకురాలిగా మారిన వరలక్ష్మి శరత్‌కుమార్ తన చిత్రం 'సరస్వతి' ట్రైలర్ లాంచ్ వేడుకలో భావోద్వేగానికి లోనయ్యారు. ప్రకాశ్ రాజ్, ప్రియమణి, రాధిక, నాజర్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమా తనకు ఎంతో ప్రత్యేకమని తెలిపారు. "ఈ సినిమా కోసం ఎంతో శ్రమించాను. మీ అందరి ప్రేమ, మద్దతే నాకు బలం. దర్శకురాలిగా నా ప్రయాణం మొదలైంది. మా వంటి మహిళలను కూడా ఎదగనివ్వండి" అంటూ ఆమె కంటతడి పెట్టుకున్నారు. నిర్మాత బన్నీ వాసు ప్రశంసలు తనకు మరింత ధైర్యం ఇచ్చాయని చెప్పారు. తెలుగులో తనకు మద్దతుగా నిలిచిన దర్శకుడు గోపీచంద్ మలినేనికు కృతజ్ఞతలు తెలిపారు. "ఇది నా రెండో జీవితంలాంటిది. ఇండస్ట్రీలో మహిళగా నిలబడటం సులభం కాదు. అయినా పోరాడుతూనే ఉంటాను" అని వరలక్ష్మి అన్నారు.



## బస్ ఐసే హీ అంటూ అందాలు ఒలకబోస్తున్న అనైరా గుప్తా



దక్షిణాది సినీ పరిశ్రమలో నెమ్మదిగా గుర్తింపు సంపాదిస్తున్న నటి అనైరా గుప్తా తాజాగా తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన ఫోటోతో ఆకట్టుకుంది. కిటికీ పక్కన మంచంపై ప్రశాంతంగా కూర్చున్న ఆమె సీగ్రీన్ చీరకు యెల్లో బ్లౌజ్ జతచేసి సింపుల్‌గా కనిపించింది. "బస్ ఐసే హీ" అనే క్యాప్షన్‌తో పోస్ట్ చేసిన ఈ ఫోటోలో హెవీ స్టైలింగ్ లేకుండానే ఎలిగెన్స్ మెరిసింది. సినిమాల విషయానికి వస్తే, ఆమె తమిళం, మరో తెలుగు తెలుగు రొమాంటిక్ ప్రాజెక్ట్‌లో కూడా కనిపించనుంది. గతంలో 'సర్కార్' వంటి చిత్రంతో మంచి గుర్తింపు పొందింది. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే అనైరాకు లక్షలాది ఫాలోవర్స్ ఉన్నారు. గ్లామర్, సింప్లిసిటీ కలబోసిన ఈ తాజా ఫోటో ఆమె అభిమానులను మరోసారి ఆకట్టుకుంది.

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013. Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com